ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

మంగళవారం 03.11.2026 | సంపుటి:13 సంచిక:104 | పేజీలు:12 వెల:రూ.4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

బియ్యం, చక్కెరకు రెక్కలు

ఇథనాల్ మోజులో వంటింటికి చేటు

పెట్రోలు వాహనాలకు అవసరం కావచ్చు, కానీ అన్నం మనిషికి ప్రాణాధారం. ప్రజల కడుపు నింపాల్సిన ధాన్యం వాహనాల ట్యాంకుల్లోకి వెళ్లకూడదు. అన్నం పెట్టే రైతు, అన్నం తినే సామాన్యుడు ఎప్పటికీ ప్రథమ ప్రాధాన్యం కావాలి.

- సామాన్యుడి కంచంలో కన్నీరు
- నీటి దాహం.. లక్షల లీటర్లు ఆవిరి

హైదరాబాద్(జనంసాక్షి):
వంటింట్లో పొయ్యి వెలిగించాలంటేనే సామాన్యుడు భయపడే రోజులొచ్చాయి. కిలో చక్కెర సగటు ధర జూలై 20 నాటికి రూ.48.18 ఉండగా, ఆగస్టు 20 నాటికి రూ.55.70కి ఎగబాకింది. కొన్ని ప్రాంతాల్లో రూ.67 వరకూ చేరిందని విపక్షాలు చెబుతున్నాయి. బియ్యం, మొక్కజొన్న పిండి ధరలూ 11 నుంచి 16 శాతం పెరిగాయి. ఆదాయం పెరగకపోయినా ఖర్చులు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి. పప్పులు, నూనెలు, కూరగాయల ధరలతో ఇప్పటికే సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాల నెల బడ్జెట్లు తలకిందులయ్యాయి. పేదవాడి పళ్లెంలోని ముద్ద ఇప్పుడు భారంగా మారింది.

ఇంధనం కోసం ఆహారాన్ని ఆహుతి చేస్తారా?
పెట్రోల్‌లో కలపడానికి ఇథనాల్ తయారు చేయాలనే తపనలో, తినే గింజలను, తీపినిచ్చే చెరకును ఫ్యాక్టరీల వైపు మళ్లించారన్నది విపక్షాల తీవ్ర విమర్శ. రైతు చెమటోడ్చి పండించిన బియ్యం, మొక్కజొన్న, చెరకు ప్రజల కంచంలోకి చేరాల్సింది పోయి ఇంధన కర్మాగారాలకు తరలిపోతున్నాయన్నది వారి ఆరోపణ. ఆకలి తీర్చాల్సిన ధాన్యం వాహనాల ట్యాంకుల్లోకి వెళ్తుంటే, సామాన్యుడి కడుపు ఖాళీగా మిగులుతోందని వారు నిలదీస్తున్నారు. రైతుకు గిట్టుబాటు ధర దక్కడం ఒకవైపు, వినియోగదారుడికి అందుబాటు ధరలో ఆహారం అందడం మరోవైపు. ఈ రెండూ ప్రభుత్వ బాధ్యతలు. వాటిని పక్కనపెట్టి ఇంధన లక్ష్యాలనే ముందుకు తీసుకెళ్తే నష్టపోయేది ప్రజలే. ఈ విమర్శలపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ వివరణ ఇచ్చింది.

ఎట్టకేలకు కేంద్రం కళ్లు తెరిచిందా?
ధరలు మండుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇథనాల్ సప్లై ఇయర్ 2026-27 (నవంబర్ 1, 2026 నుంచి అక్టోబర్ 31, 2027 వరకు) కోసం చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజా టెండర్ ద్వారా ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. – చెరకు రసం, షుగర్ సిరప్, –హెవీ మొలాసిస్ నుంచి ఇథనాల్ తయారీ పూర్తిగా నిలిపివేత– ఈ 20 (20% బ్లెండింగ్) లక్ష్యం కోసం మొక్కజొన్న, విరిగిన బియ్యం, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వద్ద మిగులు బియ్యం,

మిగతా 2లో..

సామాన్యుడే సమిధ
ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాల సంగతి ఎలా ఉన్నా, వాటి భారం చివరికి సామాన్యుడి మీదే పడుతోంది. కిరాణా బిల్లు పెరిగింది, నెల బడ్జెట్ తారుమారైంది. పర్యావరణం పేరుతో తెచ్చిన విధానం పేదవాడి జీవితాన్ని ఇంతగా కుదిపేయడం సమంజసమా?

ఇథనాల్ కోసం చెరకు, ధాన్యం మళ్లింపు





ప్రజల విషయంలో ముందుచూపు అవసరం
తయారయ్యే ఇథనాల్ నాణ్యత లేదా స్వభావం ఒకటే అయినప్పటికీ, దాని ఉత్పత్తికి ఉపయోగించే చెరుకు, మొక్కజొన్న, బియ్యం ప్రాతిపదికన వేర్వేరు మద్దతు ధరలను ఖరారు చేస్తున్నారు. ఎఫ్‌సీఐ ద్వారా కేంద్రం ఇథనాల్ ఫ్యాక్టరీలకు కోటా ప్రకారం సబ్సిడీ ధరకు ధాన్యం ఇస్తోంది. అయితే ఎల్‌నినో వంటి కరువు ఉపద్రవాలు సంభవించినప్పుడు ప్రజల ఆహార భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించడం మంచిది. - డాక్టర్ బాబురావు, శాస్త్రవేత్త

ఇప్పుడు కావలసింది..
- ఇథనాల్ పరిశ్రమల విస్తరణపై సమగ్ర సమీక్ష
- ఆహార ధాన్యాల మళ్లింపుపై పారదర్శక విధానం
- ప్రతి కర్మాగారానికి నీటి వినియోగ పరిమితులు, వ్యర్థ జలాల శుద్ధి తప్పనిసరి
- కాలుష్య పరీక్షల నివేదికలు ప్రజలకు అందుబాటులో ధరలపై జవాబుదారీతనం కేంద్రంపై ఉంది

ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహించొద్దు • అవసరానికి అనుగుణంగా గ్రీన్ ట్యాంకర్లు

- అవసరానికి అనుగుణంగా గ్రీన్ ట్యాంకర్ల ఏర్పాటు
- ట్రాఫిక్ క్రమబద్ధీకరపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):
హైదరాబాద్ మహానగరాన్ని క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని, చెత్త సేకరణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మున్సిపల్ పరిధిలోని వివిధ ఇన్డస్ట్రియల్ ఏరియాల్లో చెత్త సేకరణకు ఐలా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో నిర్మాణ పనులు, పార్కుల నిర్వహణ, ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్ తో పాటు ఇతర పనులకు ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ఉద్దేశంతో గ్రీన్ ట్యాంకర్స్ ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సీఎం అధికారుకు సూచించారు. నిర్మాణ రంగం, గ్రీనరీ

మిగతా 2లో..

ప్రతిష్టాత్మకంగా 'ఖేలో ఇండియా'
డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగబోయే క్రీడలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి
నిర్వహణపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

2లో

తెలంగాణ విభజన హామీలపై మాట్లాడలేదెందుకు?



- దేశాన్ని భాజపా 'అదానీ'కరణ చేస్తోంది : మంత్రి పొన్నం
- కాంగ్రెస్‌ను విమర్శించడానికే అమిత్‌షా పర్యటన పరిమితమైందని విమర్శ

హైదరాబాద్(జనంసాక్షి): కాంగ్రెస్‌ను విమర్శించడానికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన పరిమితమైందని

మిగతా 2లో..

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..

అరాచకత్వాన్ని అంతం చేయండి

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు
ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధమని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో కాంగ్రెస్ సర్కారును గద్దె దించేందుకు సంకల్పం తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్‌షా భాజపా శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో భాజపా సర్కారు రావాలా... వద్దా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. అరాచకత్వాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో భాజపా మహా పాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు. అప్పట్లో నిజాం మెడలను సర్దార్ వల్లభాయ్ పటేల్ వంచబట్టే హైదరాబాద్ విముక్తి పొందిందన్నారు.కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఓటు బచావో ర్యాలీలపై అమిత్ షా విమర్శలు

మిగతా 2లో..





గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీం ఓకే..
దీపావళి వేళ ఢిల్లీలో నిబంధనలతో కూడిన అనుమతి

న్యూఢిల్లీ(జనంసాక్షి):దీపావళి పండగ నేపథ్యంలో దిల్లీ- ఎన్‌సీఆర్ పరిధిలో గ్రీన్ క్రాకర్స్ కాల్చేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. నవంబర్ 7, 8వ తేదీల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10

మిగతా 9లో..

తెలంగాణపై తుపాను ప్రభావం
పలు చోట్ల వర్షాలుపడే అవకాశం

2లో



కరువు సహాయక చర్యలు చేపట్టండి

కరువు మండలాలు ప్రకటించి చేతులు దులుపుకుంటే సరిపోదు : హరీశ్

రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రేవంత్ కనీసం పట్టించుకోవడం లేదని హరీష్‌రావు విమర్శించారు. కరువు మండలాల ప్రకటనే తప్ప ఆర్థిక సహాయం గురించి చేతులెత్తేశారని దుయ్యబట్టారు. సోమవారం వనపర్తి జిల్లాలో మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఎండిపోయిన పంటలను పరిశీలించి రైతులను పరామర్శించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.

వివరాలు 12వ పేజీలో..

జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం

- ప్రక్రియను స్వయంగా నేనే పర్యవేక్షిస్తా
- రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష.. శాశ్వత పరిష్కారాలపై చర్చ



హైదరాబాద్(జనంసాక్షి):
రాష్ట్రంలో రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారాలు తీసుకురావడానికి తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.సరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదని రెండు విభాగాలు పూర్తి సమన్వయంతో జాయింట్

మిగతా 2లో..



శభాష్.. సింగరేణి

- అరుదైన ఘనత సొంతం చేసుకున్న సంస్థ
- ఐదు గనులకు జాతీయస్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే చేతుల మీదుగా అవార్డులు స్వీకరించిన సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి
- చక్కని పనితీరుతో మరిన్ని అవార్డులు సాధించాలి • ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు

వార్త 2 లో

గ్లోబల్ సప్లై చైన్‌తో స్థానిక పరిశ్రమల

అనుసంధానం

ఆర్థిక ప్రగతి కేంద్రాలుగా జిల్లాలను తీర్చిదిద్దుతాం
ఎఫ్‌టీఏల వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకునేలా పరిశ్రమలకు మార్గనిర్దేశం
"మెగా ఎఫ్‌టీఏ అవుట్ రీచ్ ప్రోగ్రామ్"లో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్(జనంసాక్షి):స్థానిక పరిశ్రమలను గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను ఒక ఆర్థిక ప్రగతి కేంద్రంగా ((గ్రోత్ ఇంజన్) తీర్చిదిద్దేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ సంయుక్తాధ్వర్యంలో సోమవారం టీ-హబ్‌లో నిర్వహించిన "మెగా ఎఫ్‌టీఏ అవుట్ రీచ్ ప్రోగ్రామ్"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్య

మిగతా 2లో..

ట్రాఫిక్ ఫ్రీ సిటీగా హైదరాబాద్

మెయింటెనెన్స్, పా ర్కుల అభివృద్ధి వంటి అవసరాలకు తాగునీ టిని ఉపయోగిస్తున్నారని, దీనికి బదులుగా ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిని ఆదా చేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. అందుకే జలమండలి తొలివిడతలో 19 మురుగునీటి శు ద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నుంచి 28 గ్రీన్ వాటర్ ట్యాంకర్ల ద్వారా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిం దని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీతో పాటు ఎ ఎంసీ, ఎంఎంసీ పరిధిలో గ్రీన్ వాటర్ సర ఫరాను మరింత విస్తరించాలని సీఎం సూచిం చారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టి ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబ ద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకోవా లన్నారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురా వడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ జి. సృజన, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఖేలో ఇండియా'

జనంసాక్షి:డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా 2026 క్రీడల పోటీల నిర్వహణ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమిక్ష .. హజరైన మంత్రులు జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి వేలాది మంది యువ క్రీడాకారులు, సిబ్బంది పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్ల ప్రణాళిక, పురోగతిపై వివరిస్తున్న అధికారులు పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (స్పోర్ట్స్) వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలా దేవి, ఇతర ఉన్నతాధికారులు

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. ఆరాచకత్వాన్ని అంతం చేయండి

గుప్పించారు." కాంగ్రెస్‌ది ఓటు బచావో ర్యాలీ కాదు.. చొరబాటుదారులను కాపాడే ర్యాలీ. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వం. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా.. వద్దా? ఓటరు జాబితాను ప్రక్షాళన చేయాలా.. వద్దా? కోటికి పైగా ఉన్న నకిలీ ఓట్లు తొలగించాలా.. వద్దా? దేశంలో లేని వారి ఓట్లే 3 కోట్లకు పైగా ఉన్నాయి. ఈ చొరబాటుదారుల ఓట్లు తొలగించాలా.. వద్దా? ఎస్ఐఆర్ వల్ల మేము గెలిచామని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. 2014, 2019 ఎన్నికలప్పుడు ఎస్ఐఆర్ లేదు.. అప్పుడు మోదీ గెలవలేదా?ఈవీఏంలు ట్యాంపరింగ్ జరిగితే రేవంత్ రెడ్డి ఎలా ముఖ్యమంత్రి అయ్యారు. కొన్నేళ్లుగా భాజపాకి దేశంలో ఆదరణ పెరుగుతోంది" అని అమిత్ షా అన్నారు.

10 ఏళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి

ఇండియా కూటమి నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పైనా అమిత్ షా విమ ర్శలు గుప్పించారు. " ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధమని హైదరాబాద్ నుంచి సవాల్ విసురుతున్నా. ఈవీఎంల ద్వారా మేము గెలిస్తే.. తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది. కేరళ, తమిళనాడులో భాజపాయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయి? కాంగ్రెస్ పార్టీని దేశమంతా ఛీ కొడుతోంది. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగింది. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్‌పై ఉంది. ఇలాంటి పార్టీ మోదీతో పోటీపడుతుందా? ఆయనతో పరుగుపందెంలో పాల్గొనగలదా? కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల అవినీతి రాజ్యమేలుతోంది.

డ్రగ్స్ రహిత దేశంగా భారత్

తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా రేవంత్‌రెడ్డి మార్చారు. ఇక్కడ రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఇక్కడి ఆర్ఆర్ ట్యాక్స్ ఎక్కడికి వెళ్తోంది? రాహుల్ కోసమే ఇక్కడ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ అవినీతిని ఒవైసీ ఆపుతారా.. బీఆర్ఎస్ ఆపుతుందా? కాంగ్రెస్ అవినీతిని కేవలం భాజపా మాత్రమే ఆపగలదు. త్వరలోనే భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మారుస్తాం. మాటిమాటికీ విదేశాలకు పారిపోయేవారు మనకు కావాలా? మేం ఎప్పుడూ పేదలు, రైతులు, యువత పక్షమే ఉంటాం. తెలంగాణలో భాజపా సర్కార్ వచ్చేందుకు మాకు అండగా ఉండాలి." అని అమిత్ షా అన్నారు.

మరోసారి విరుచుకుపడిన హైడ్రా బుల్డోజర్లు

జీడిమెట్లలో మల్లారెడ్డి ఫామ్‌హౌస్ ప్రహరీ కూల్చివేత

హైదరాబాద్(జనంసాక్షి):చెరువుల పునరుద్దరణలో భాగంగా జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ అభివృద్ధి పనులను మొదలుపెట్టిన హైడ్రా ఆ సరస్సు ఎఫ్ టీఎల్ పరిధిలోని ఆక్రమణలు, అక్రమ కట్టడ్డాలను ఒక్కొక్కటిగా తొలగిస్తోంది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏకంగా అర కిలోమీటరు మేర కట్ట నిర్మించడాన్ని హైడ్రా తీవ్రంగా పరిగణించి చర్యలు చేపట్టింది. కట్టను హద్దుగా చేసుకొని ఫామ్ హౌస్ నిర్మాణానికి కట్టిన ప్రహరీని కూల్చి వేసింది.కొన్నిచోట్ల హద్దుగా వేసిన ఇనుప కంచెను కూడా తొలగించింది. ఫాక్స్ సాగర్‌కు మరోవైపు ఎఫ్‌టీఎల్ పరిధిలో మాజీ మంత్రి మల్లారెడ్డి ఫామ్ హౌస్ ప్రహరీని కూడా హైడ్రా కూల్చివేసింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో మట్టిని నింపి ప్రహరీ నిర్మించి ఏర్పాటు చేసిన గేటును పూర్తిగా తొలగించింది. దూలపల్లి గ్రామంలో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మాజీమంత్రి మల్లారెడ్డి కుటుంబసభ్యులకు సంబంధించిన ఫామ్ హౌస్ ఉంది. సర్వే నెంబరు 124లో ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధి ఉండగా వాటిని పట్టించుకోకుండా ప్రహరీ నిర్మించి గేటు పెట్టినట్లు హైడ్రా గుర్తించింది.

ఆక్రమణలు తొలగింపు

ఎఫ్‌టీఎల్ హద్దుల్లో ఉండడంతో ప్రహరీని తొలగించినట్టు హైడ్రా స్పష్టం చేసింది. దాదాపు 15 ఎకరాల వరకూ ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి జరిగి మల్లారెడ్డి కుటుంబ సభ్యులు ప్రహరీ నిర్మించినట్టు హైడ్రా నిర్ధారించింది. జీడిమెట్ల సర్వే నెంబరు 41, 42లలో దాదాపు 20 ఎకరాల మేర ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో వచ్చిన ప్రహరీని కూడా హైడ్రా తొలగించింది.



సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

ఈ-ప్రొక్యూర్‌మెంట్/ఓపెన్ టెండర్ పేపర్ నోటిఫికేషన్
ఆర్‌ఆర్‌జెడ్ - 09/2026-27

ఎస్‌పీ.నం.20ఏ/2025-26 & 25/2026-27(ఎస్‌సీ రిజర్వుడ్) ఘన పూర్ ఈహెచ్‌టీ ఎస్ఎస్ సరూర్‌నగర్ సర్కిల్ వరకు & కొత్త 33కేవీ ఫీడర్ 220/132/33 కేవీ వేయుట మరియు ఆర్ఆర్ జోన్‌కు సంబంధించి సైబర్‌సిటీ సర్కిల్ సెంట్రల్ ఎక్సైజ్ & సర్వీస్ టాక్స్ కమిషనర్‌కు హెచ్‌టీ సరఫరా చేయుట. మిగతా వివరాలకు మరియు డిజిటల్ సర్టిఫికెట్‌కు www.tender.telangana.gov.in లో చూడగలరు.

సం/- చీఫ్ ఇంజనీర్,ఆపరేషన్,
DIPR No.12971-PP/CL/ADVT/2026-27 రంగారెడ్డి జోన్, కేపీహెచ్‌బీ కాలనీ, హైదరాబాద్

బియ్యం, చక్కెరకు రెక్కలు

సీ-హెవీ మొలాసిస్ మాత్రమే వాడాలి. నిర్ణయం స్వాగతించదగినదే. కానీ ధరలు నింగికెగసి, జనం బాధపడ్డాక వచ్చిన ఈ ఆంక్షలు ఆలస్యమైన మేల్కొలుపు కాదా? ఇంతకాలం ఆహార ఉత్పత్తులను ఇంధనం వైపు మళ్లించిన విధానాలపై సమీక్ష ఎప్పుడు? ధరల పెరుగుదలకు కారణాలపై సమగ్ర విచారణ జరుపుతారా? ఇంతకాలం జరిగిన నష్టానికి బాధ్యత ఎవరిది? ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత

లక్షల లీటర్లు ఆవిరి

ఇథనాల్ ఫ్యాక్టరీలు లక్షల లీటర్ల నీటిని పీల్చేస్తున్నాయి. తాగునీటికే తల్లడిల్లే గ్రామాల్లో, పొలాలకు నీరందక రైతు కన్నీరు పెడుతున్న చోట, ఫ్యాక్టరీల కోసం నీటిని వినియోగించడం ఎంతవరకు న్యాయం? నీరు ప్రజల హక్కు, అది కర్మాగారాల సొంతం కాదు. ఒక ఫ్యాక్టరీ కోసం స్థానికుల తాగునీటి అవసరాలు, వ్యవసాయ అవసరాలు దెబ్బతింటే ఎవరు బాధ్యత వహిస్తారు? భూగర్భ జలాల పరిస్థితి, నీటి వినియోగ పరిమితులు, వ్యర్థ జలాల శుద్ధి వివరాలను ప్రజలకు బహిరంగంగా వెల్లడించాలి.

కాలుష్యం.. క్యాన్సర్ ముప్పు?

ఫ్యాక్టరీల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాలుష్యంతో సతమతమవుతున్నారని, ఇది క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని పర్యావరణవేత్తలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లాభాలు ఫ్యాక్టరీ యజమానులకు, రోగాలు గ్రామస్తులకా అని వారు నిలదీస్తున్నారు. వ్యర్థ జలాలు, వాయు కాలుష్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై కఠిన పర్యవేక్షణ అవసరం. నిబంధనలు ఉల్లంఘిస్తే భూములు, నీటి వనరులు, ప్రజారోగ్యం దెబ్బతింటాయి. ఈ కర్మాగారాలే క్యాన్సర్‌కు కారణమని ఆధారాల్లేకుండా నిర్ధారించలేం. కానీ ప్రజల అనుమానాలను నివృత్తి చేయడానికి స్వతంత్ర ఆరోగ్య, పర్యావరణ పరిశీలనలు జరపడం ప్రభుత్వ బాధ్యత.

రేపటి కరవు ముంగిట్లో..?

ఆహార ధాన్యాలను ఇంధనం వైపు మళ్లిస్తూ పోతే, భవిష్యత్తులో ఆహార ధాన్యాల కొరత ఏర్పడే ప్రమా దం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పెరిగిన ధరలు దీనికి సంకేతమన్నది వారి వాదన. దేశానికి ఇంధన స్వావలంబన అవసరమే, విదేశీ చమురు దిగుమతులను తగ్గించుకోవడమూ అవస రమే. కానీ అందుకోసం ప్రజల ఆహార భద్రతను పణంగా పెట్టడం పరిష్కారం కాదు.

రైతు భూమి.. ప్రజల నీరు.. కార్పొరేట్ల లాభాలకా?

ఆహార పంటలను ఇంధన పరిశ్రమలకు అనుసంధానించడం వల్ల రైతుకు నిజంగా ఎంత మేలు జరుగుతోంది? ముడిసరుకు అందించే రైతుకు గిట్టుబాటు ధర, సకాలంలో చెల్లింపులు, పంట కొనుగోలుకు హామీ ఉన్నాయా? లేక పరిశ్రమల లాభాలే ప్రధాన లక్ష్యంగా విధానాలు రూపొందుతున్నాయా? పరిశ్రమల అభివృద్ధి పేరుతో గ్రామీణ ప్రజల జీవనాధారాలను దెబ్బతీయడం అభివృద్ధి అనిపించుకోదు.

జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం

సర్వేలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందని తెలిపారు. భూ వివాదాలు లేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలని, ఆ సర్వేలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులు గుర్తించాలని సూచించారు.

జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం

ఖమ్మం, వరంగల్, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో అటవీ భూములు ఉన్నాయని కొన్ని దశాబ్దాలుగా రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్నాయని ప్రస్తావించారు. పట్టా భూములు, రెవెన్యూ, ఫారెస్ట్ భూముల మధ్య కూడా వివాదాలు ఉన్న దృష్ట్యా ఆయా అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం చూపించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలు సమగ్రంగా సరిపోల్చి వివాదాలకు తావులేకుండా స్పష్టమైన హద్దులు నిర్ధారించాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం

ఈ సమస్యలను ఒక శాఖపై మరొక శాఖ బాధ్యతగా నెట్టివేసే ధోరణి



విడనాడాలని, పరస్పర సమన్వయంతో పరిష్కార దిశగా అడుగులు వేయాలని స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలు అక్కడే పరిష్కరించాలని, ఉన్నతస్థాయి నిర్ణయాలు అవసరమైన అంశాలు వెంటనే రాష్ట్రస్థాయికి నివేదించాలన్నారు.

రెండు శాఖల మధ్య సమన్వయం

ఏళ్ల తరబడి వివాదాలు కొనసాగడం వల్ల రైతులు, భూయజమానులు ఇబ్బందులు పడుతున్న క్రమంలో ప్రజలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా, వాస్తవ ఆధారాలతో సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు. ఇకపై రెవెన్యూ ? అటవీ భూ సరిహద్దు వివాదాల పరిష్కార ప్రక్రియసహా రెండు శాఖల మధ్య సమన్వయానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని పొంగులేటి పేర్కొన్నారు.

గ్లోబల్ సప్లై చైన్‌తో స్థానిక పరిశ్రమల అనుసంధానం

సాధనలో ఎగుమతుల పాత్ర కీలకమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఇండియా వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ (ఎఫ్‌టీఏలు) వల్ల అనేక నూతన వాణిజ్య అవకా శాలు తలుపు తడుతున్నాయన్నారు. వీటిని అందిపుచ్చుకునేలా రాష్ట్రంలోని పరిశ్రమలు, ఎగుమతిదారులు... ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు మార్గనిర్దేశనం చేస్తామన్నారు. "మేడ్ ఇన్ తెలంగాణ" ఉత్పత్తులు ఎఫ్‌టీఏ భాగస్వామ్య దేశాలన్నింటికీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాల వారీగా లభించే ప్రత్యేక ఉత్పత్తులను గుర్తించి, వాటి తయారీ, ప్రాసెసింగ్, ఎగుమతులను ప్రోత్సహిస్తామన్నారు. దేశీయ ఆహార అవసరాలు తీరిన తర్వాత మిగిలే వ్యవసాయ ఉత్పత్తులు వృథా కాకుండా ఎగుమతులకు మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఎఫ్‌టీఏ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వాలకు, పరిశ్రమలకు కేంద్రం మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, వివిధ జిల్లాల కలెక్టర్లు మను చౌదరి, ప్రియాంక ఆలా, కుష్బూ గుప్తా, అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

మరింత పకడ్బందీగా సెన్సార్

నిబంధనలు కఠినతరం చేసిన సీబీఎఫ్‌సీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):సినిమాల సర్టిఫికేషన్ విషయంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నిబంధనలను కఠినతరం చేసింది. సినిమా విడుదల తేదీ దగ్గర పడిందంటూ ఆఖరి నిమిషంలో వచ్చే సర్టిఫికేషన్ దరఖాస్తులను ఇకపై అంగీకరించబోమని బోర్డు సీఈవో రాజేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఈ మేరకు చిత్రనిర్మాతలకు తాజా మార్గదర్శకాలను జారీ చేశారు.రఫ్ కట్స్, ఇంకా పూర్తికాని వెర్షన్లను అంగీకరించరు. ఫైనల్ సౌండ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్ ఎఫెక్ట్స్ సబ్‌టైటిల్స్, ఆడియో డిస్క్రిప్షన్ అన్నీ పూర్తయి ఉండాలి.ముందుగానే రిలీజ్ డేట్ ప్రకటించాం. ప్రమోషన్లు చేశామని చెప్పినా ఎలాంటి ప్రత్యేక మినహాయింపు ఉండదు.ప్రచార కార్యక్రమాలు, ప్రీమియర్ షోల తేదీలను చూపించి సర్టిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఒత్తిడి చేయకూడదు.సెన్సార్ బోర్డు ఆమోదం తెలిపే వరకు సినిమా టైటిల్‌ను కూడా ఫైనల్ చేయకూడదు. అన్ని పనులు ముందుగానే పూర్తి చేసుకుని సమయానికి దరఖాస్తు చేసుకోవాలి.సీబీఎఫ్‌సీ తాజా నిర్ణయం భారీ బడ్జెట్ సినిమాలకు కాస్త ఇబ్బందికరమే. సాధారణంగా వీఎఫ్ఎక్స్ (ఎఈచీ), కలర్ గ్రేడింగ్ లాంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులను సినిమా రిలీజ్‌కు కొన్ని రోజుల ముందు వరకు మేకర్స్ చేస్తుంటారు. తాజా నిబంధనల నేపథ్యంలో సర్టిఫికేషన్ ఆలస్యం కాకుండా ఉండాలంటే ఆ పనులన్నీ ముందుగానే పూర్తి చేసుకోవాలి. మరోవైపు సెన్సార్ బోర్డు నిర్ణయం వల్ల థియేటర్లలో ఆఖరి నిమిషంలో షోలు రద్దయ్యే సమస్యలు ఉండవు.

తెలంగాణ విభజన హామీలపై మాట్లాడలేదెందుకు?



మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ విభజన హామీలపై ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. చొరబాటుదారుల ఓటు హక్కుకు తాము వ్యతిరేకమన్న ఆయన.. కాంగ్రెస్‌పై భాజపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరా బాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ ప్రశ్నిస్తోం దన్నారు." దేశంలో ఏఏ ట్యాక్స్ నడుస్తోంది. ముగ్గురు గుజరాతీయుల కోసమే మోదీ, అమిత్ షా పని చేస్తున్నారు. అన్నీ అదానీకి కట్టబెడుతున్నారు.. దేశాన్ని 'అదానీకరణ' చేస్తున్నారు. మీ హామీల గురించి బహిరంగ చర్చకు మీ రాష్ట్ర నాయకత్వం సిద్ధమా? ఎల్‌నినో ప్రభావం, కరవుపై కేంద్రం సహాయం చేయాలి. పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలి" అని పొన్నం డిమాండ్ చేశారు.

శభాష్.. సింగరేణి

- అరుదైన ఘనత సొంతం చేసుకున్న సంస్థలో
- ఐదు గనులకు జాతీయస్థాయిలో ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబె చేతుల మీదుగాఅవార్డులు స్వీకరించిన సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి
- చక్కని పనితీరుతో మరిన్ని అవార్డులు సాధించాలి..
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు

రాయ్‌పూర్(జనంసాక్షి):

ఉత్తమ మైనింగ్ పద్ధతుల అమలు, పర్యావరణ హిత చర్యలు, కార్మికుల సంక్షేమం, సౌకర్యాల కల్పనలో ఉత్తమ కంపెనీగా ఉన్న సింగరేణి సంస్థ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జాతీయస్థాయిలో 5 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకుంది. సోమవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబె చేతుల మీదుగా.. సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ బుద్ధప్రకాష్ జ్యోతి ఈ అవార్డులను అందుకున్నారు.ప్రతిష్టాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్న గనులలో.. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కేఎన్‌టీ, ఆర్కే-6 ఇంక్లైన్, సత్తుపల్లి ఏరియాకు చెందిన జేవీఆర్ ఓసీ-2, బెల్లంపల్లి ఏరియాకు చెందిన ఖైరీగూడ ఓసీ, రామగుండం-3కి చెందిన ఆర్జీఓసీ-1 గనులు ఉన్నాయి. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతీ ఏడాది దేశంలో అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్‌ను ఇస్తుంది. అత్యుత్తమ స్టార్ రేటింగ్ సాధించిన గనుల యాజమాన్యాలను అభినందిస్తూ అవార్డులను.. అందిస్తూ ఉంటారు. ఇలా స్టార్ రేటింగ్ ఇవ్వడం కోసం బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కులను కేటాయిస్తారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పి ఉన్న గనులలో పై 84 అంశాలను కేంద్ర బొగ్గు శాఖ నుంచి వచ్చిన పరిశీలక బృందం ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతుంది. ప్రాథమిక మూల్యాంకనం తర్వాత వీటి నుంచి అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తారు. ఇలా ఎంపిక చేసిన వాటిలో ఇంకా అత్యుత్తమమైన వాటిని మరో కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుంది. మొత్తం 100 మార్కుల్లో 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. ఈ విధంగా సింగరేణి సంస్థలో ఈసారి ఐదు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం అభినందనీయం. ఈ గనుల నిర్వహణ, పర్యావరణ చర్యలు, సంక్షేమ కార్యక్రమా లు, ఉత్పత్తి సాంకేతికత వంటి అంశాలలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందు వల్లే ఈ అవార్డులు సాధించుకోవడం జరిగింది. దీనిపై సీఎండీ శ్రీ బుద్ధప్రకాష్ జ్యోతి హర్షం వ్యక్తం చేశారు. గనుల యాజమాన్యాలకు, కార్మికులకు తన అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క అభినందనలు..సింగరేణిలో ఐదు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడంపై సింగరేణి అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క అభినందించారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించి రాష్ట్ర ప్రతిష్టను పెంచాలన్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రెటరి సనోజ్ కుమార్ ఝా, కోల్ కంట్రోలర్ సతీష్ కుమార్, కోల్ ఇండియా సీఎండీ సాయిరాం, సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి.శ్రీనివాస్, రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.మధుసూదన్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్, బెల్లంపల్లి ఏరియా ఏజీఎం నరేందర్, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ2 మేనేజర్ రాజేశ్వర్, ఆర్కే న్యూటెక్ మేనేజర్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై తుపాను ప్రభావం

పలు చోట్ల వర్షాలుపడే అవకాశం


అమరావతి(జనంసాక్షి): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను 'మురసు'.. తీవ్ర తుపానుగా బలపడి తీరం వైపు దూసుకొస్తోంది. గత 6 గంటల్లో గంటకు 14 కి.మీ వేగంతో కదిలినట్లు వాతావరణశాఖ తెలిపింది. ప్రస్తుతం నెల్లూరుకు 120 కి.మీ, మచిలీపట్నానికి 140 కి.మీ, కావలి, ఒంగోలుకు 180 కి.మీ, తిరుపతికి 170 కి.మీ, బాపట్లకు 200 కి.మీ దూరంలో తుపాను కేంద్రీకృతమైనట్లు వెల్లడించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము సమయంలో నెల్లూరు-నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశముందని తెలిపింది. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కి.మీ వేగంతో గరిష్ఠంగా 120 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది.

'మురసు' ఎఫెక్ట్.. ఏపీ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు

తుపాను ప్రభావంతో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. ఇవాళ కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు.. ఒకటి, రెండుచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే వీలుందన్నారు. ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు.. అల్లూరి, పోలవరం, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని చెప్పారు. సహాయక చర్యల కోసం ముందస్తుగా 6 ఎన్డీఆర్ఎఫ్, 7 ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. తుపాను తీరానికి సమీపిస్తున్న కొద్దీ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్‌జైన్ కోరారు.

పలు ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు

మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో ఏపీలోని పలు ఓడరేవుల్లో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. నిజాంపట్నం, వాడరేవు హార్బర్‌లలో 10వ నంబర్ ప్రమాద



హెచ్చరిక జారీ చేశారు. మచిలీపట్నంలో 9వ నంబర్, కృష్ణపట్నంలో 8వ నంబర్, విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం, కాకినాడ, కళింగపట్నంలో 3వ నంబర్ ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యాయి. తుపాను దృష్ట్యా బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోని విద్యా సంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. సూర్యలంక బీచ్‌కు రావొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు తుపాను ప్రభావిత జిల్లాల్లో అధికారులు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో 9440827526 (గుంటూరు), 9281413774 (బాపట్ల) నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.మరోవైపు మురసు తీవ్ర తుపాను గత 6 గంటల్లో 13 కి.మీ వేగంతో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ప్రస్తుతం నెల్లూరుకు 80 కి.మీ, కావలికి 70 కి.మీ, తిరుపతికి రూ.170 కి.మీ, ఒంగోలుకు 90 కి.మీ, బాపట్లకు రూ.120 కి.మీ, మచిలీపట్నంకు 170 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. దక్షిణ తీరం వైపు వేగంగా దూసుకొస్తోంది. మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో ఏపీ, ఉత్తర తమిళనాడు తీరాలకు అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము సమయంలో ఒంగోలు సమీపంలో మురసు తీరం దాటే అవకాశముంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా, అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

పలు రైలు సర్వీసుల రద్దు

'మురసు' తీవ్ర తుపాను నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో రైల్వేశాఖ అప్రమత్తమైంది. ముందస్తు చర్యల్లో భాగంగా విజయవాడ- గూడూరు, తెనాలి- రేపల్లె మార్గాల్లో పలు రైలు సర్వీసులను సోమ, మంగళవారాల్లో రద్దు చేసింది.

రష్యాలో ఒక్కసారిగా అణుభయం..

రేడియేషన్ అలర్ట్‌లు

మాస్కో(జనంసాక్షి):రష్యాను ఒక్కసారిగా అణుభయాలు ముసిరాయి. రేడియేషన్ అలర్ట్‌లు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు దాంతో అప్రమత్తమై ప్రభుత్వం దర్యాప్తు చేపట్టగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఉక్రెయిన్-రష్యా మధ్య ఖేర్సన్ ప్రాంతంలో కాల్పుల విరమణ ముగిసిన తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే తమ దేశంలోని అలర్ట్ సిస్టమ్స్ సైబర్ దాడికి గురయ్యాయని రష్యా, ఉక్రెయిన్ ప్రకటించాయి తమ ఎమర్జెన్సీ మంత్రిత్వ శాఖకు చెందిన మొబైల్ యాప్ ఈ దాడికి గురైందని రష్యా వెల్లడించింది. బయటి దేశాల నుంచి వచ్చే డ్రోన్ దాడుల ముప్పు నుంచి ప్రజలను ఎప్పటికప్పుడు ఈ యాప్ అప్రమత్తం చేస్తుంటుంది. ఈ యాప్‌లోకి సైబర్ నేరగాళ్లు చొరబడి.. ప్రజలకు అణు దాడి హెచ్చరికలు పంపడం తీవ్ర ఆందోళనకు దారితీసింది."రష్యా అత్య వసర మంత్రిత్వ శాఖకు చెందిన మొబైల్ అప్లికేషన్‌పై భారీ సైబర్ దాడి జరిగింది. ఈ దాడికి పాల్పడినవారు ప్రజలకు తప్పుడు సమాచారం పంపుతున్నారు" అని ఆ శాఖ అధికారులు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ యాప్‌లోకి సైబర్ నేరగాళ్లు చొరబడి.. రేడియేషన్, రసాయన, అణు ముప్పు గురించి తప్పుడు హెచ్చరికలు పంపారు. దీనికి ఉక్రెయిన్ కారణమని రష్యా అధికా రులు అనుమానిస్తు న్నారు.ఉక్రెయిన్ ఎయిర్ అలర్ట్ యాప్ కూడా హ్యాక్‌కు గురైంది. లౌడ్ స్పీకర్ల వ్యవస్థను హ్యాకర్లు లక్ష్యంగా చేసు కున్నారు. దాంతో తప్పుడు హె చ్చరికలు వెలువడ్డాయి. ప్రజలు ఆందోళన చెందొద్దని, ఎలాంటి ముప్పు లేదని ఆ దేశ ఎయిర్‌ఫోర్స్ అప్రమత్తం చేయడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు.

అప్పుల బాధతో రైతు మృతి

- అప్పులు ఇచ్చిన వారి వేధింపులే కారణమని భార్య ఫిర్యాదు
- విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీసులను కోరిన బాధితురాలు



బచ్చన్నపేట, నవంబర్ 2 (జనంసాక్షి): వ్యవసాయంలో వరుస నష్టాలు, అప్పుల భారం, అప్పులు ఇచ్చిన వారి వేధింపులతో తీవ్ర మనోవేదనకు గురైన రైతు మృతి చెందిన ఘటన బచ్చన్నపేట మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి మృతుడి భార్య వేముల స్వప్న బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బచ్చన్నపేట ఎస్సై శ్రీకాంత్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలంలోని కొన్నే గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్ గౌడ్ గత మూడేళ్లుగా తమకున్న నాలుగు ఎకరాల సొంత భూమితో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకుగా పాల్గొన్న ఆయన ఉద్యమ నిర్వహణ కోసం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అనంతరం వ్యవసాయం ద్వారా అప్పులు తీర్చాలని ప్రయత్నించినప్పటికీ పంటలు ఆశించిన దిగుబడి, ఆదాయం ఇవ్వకపోవడంతో అప్పులు మరింత పెరిగాయి. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలతో పాటు పలువురి వద్ద అప్పులు చేసినట్లు భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలింపూర్ గ్రామానికి చెందిన ఓ వడ్డీ వ్యాపారి అప్పు చెల్లించాలని ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ గొడవ చేసినట్లు ఆమె ఆరోపించారు. అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులతో తన భర్త తీవ్ర మనోవేదనకు గురయ్యాడని తెలిపారు. సోమవారం ఉదయం ఇంటి నుంచి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన లక్ష్మణ్ గౌడ్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీయగా, పొలం వద్ద మృతి చెందినట్లు గ్రామస్తుల ద్వారా సమాచారం అందిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న తన భర్త అప్పుల బాధలు, ఆర్థిక ఇబ్బందులు, అప్పులు ఇచ్చిన వారి వేధింపుల నేపథ్యంలో మృతి చెందాడని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని స్వప్న పోలీసులను కోరారు.

వచ్చే ఏడాది చివరి నాటికి ఆస్పత్రుల నిర్మాణాలు పూర్తి

- పూర్తయిన 9 ఆస్పత్రులను వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలి
- జిల్లాల్లోనే 90 శాతం మందికి వైద్య సేవలే లక్ష్యం
- అధికారులకు మంత్రి దామోదర ఆదేశం



జూబ్లిహిల్స్ (జనంసాక్షి) : సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్ (తెలంగాణ వైద్య విధాన పరిషత్) పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్ల భవన నిర్మాణ పనులపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష చేశారు. జూబ్లిహిల్స్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, వివిధ జిల్లాల డీసీహెచ్ఎస్‌లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు హాస్పిటళ్లు, మెడికల్, నర్సింగ్ కాలేజీల కోసం భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్ మంత్రికి వివరించారు. సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ పరిధిలో 9 హాస్పిటల్ భవనాల నిర్మాణం పూర్తయిందని, డిసెంబర్ నాటికి మరో 14 భవనాలు, 2027 మార్చి నాటికి మరో 11 భవనాల నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. ఇవిగాక మరో 45 భవనాల నిర్మాణం వివిధ దశలో ఉందని తెలిపారు. నిర్మాణాలు పూర్తయిన 9 భవనాల్లో అవసరమైన ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి, హాస్పిటళ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. డిసెంబర్, మార్చిలో నిర్మాణాలు పూర్తయ్యే భవనాలకు సంబంధించిన ఎక్విప్‌మెంట్, ఫర్నీచర్ కొనుగోలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. డీఎస్‌హెచ్ పరిధిలో నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాల్లోని ఏరియా హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. కనీసం 90 శాతం మంది పేషెంట్లకు జిల్లాల్లోనే వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యంలో, కమ్యూనిటీ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్ల పాత్ర అత్యంత కీలకం అని మంత్రి పేర్కొన్నారు. ఈ మూడు సంవత్సరాల్లో డాక్టర్లు, నర్సులు, టెక్నీషియన్లు సహా ఆరోగ్యశాఖలో సుమారు 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. డీఎస్‌హెచ్ పరిధిలోని హాస్పిటల్స్‌లో ఇటీవలే 1616 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను రిక్రూట్ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అవసరమైన ఎక్విప్‌మెంట్ అన్నీ ఇస్తున్నామని, నూతన భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డీసీహెచ్ఎస్‌లు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లపై ఉందన్నారు. ఎల్‌ఎన్‌ఓ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్‌లకు మంత్రి సూచించారు. హాస్పిటళ్లలో నీరు, విద్యుత్, ఇతర సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

గర్భిణీ రాధ మృతి ఘటనపై కమిటీ

ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన డిసిహెచ్ఎస్
షాద్ నగర్ ప్రభుత్వసుపత్రిని తనిఖీ చేసిన కమిటీ బృందం





రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : డెలివరీ కోసం షాద్ నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి వచ్చి పురిటి నొప్పులతో బాధపడుతూ వైద్యుల నిర్లక్ష్యంతో ప్రభుత్వసుపత్రిలోనే మృతిచెందిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు విచారణ నిమిత్తం ముగ్గురు సభ్యులతో కూడుకున్న కమిటీని నియమించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ కోసం వచ్చి మృతిచెందిన కొందుర్గ్ మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన అనమగాళ్ళ రాధ మృతి ఘటనపై రంగారెడ్డి జిల్లా డిసిహెచ్ఎస్ అనురాగిణి రెడ్డి ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. సోమవారం నాడు డాక్టర్ సీమమధుకర్, డాక్టర్ షోయబ్, సంపత్ ముగ్గురి బృందం షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రినీ విజిట్ చేశారు. రాధా మృతి ఘటనపై ఆరా తీశారు. వైద్యుల నిర్లక్ష్యంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కమిటీ రిపోర్టు నివేదిక ఆధారంగా నిర్లక్ష్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బెల్లంపల్లి ఏరియాలో 89 శాతం బొగ్గు ఉత్పత్తి

- వార్షిక లక్ష్యాల సాధన దిశగా సింగరేణి ఉద్యోగుల కృషి: జీఎం ఎం. శ్రీరమేష్



రెబ్బెన, నవంబర్02(జనంసాక్షి): సింగరేణి బెల్లంపల్లి ఏరియాలో అక్టోబర్ మాసంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 89 శాతం సాధించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. అక్టోబర్ మాసానికి 3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా, 2.68 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 35 లక్షల టన్నులు కాగా, అక్టోబర్ మాసం ముగిసే నాటికి 19.86 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వెల్లడించారు. ఓబీ (ఓవర్‌బర్డెన్) పనుల్లో అక్టోబర్ మాసంలో 128 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఉద్యోగులు మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించి, బొగ్గు ఉత్పత్తిని పెంచాలని జీఎం కోరారు. వార్షిక లక్ష్యాలను సాధించే దిశగా సమష్టిగా కృషి చేస్తూ, సింగరేణిలో బెల్లంపల్లి ఏరియాను అగ్రగామిగా నిలపాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.

ప్రేమించిపెళ్లి చేసుకుంటాడని సర్పంచ్ కొడుకు మోసం

న్యాయం చేయాలంటూ సర్పంచ్ ఇంటి ముందు యువతి న్యాయపోరాటం



దండేపల్లి, నవంబర్ 2 (జనం సాక్షి): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి నుండి ప్రేమ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. గ్రామ సర్పంచ్ మంగిడి శంకరమ్మ కుమారుడు మగ్గిడి మనోహర్ గత పదేళ్లుగా తనను ప్రేమించి, ఇప్పుడు పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన ఉపరపు కిష్టయ్య కుమార్తె ఉపరపు అక్షర ఆరోపిస్తోంది. పదేళ్లుగా ప్రేమ పేరుతో తనను నమ్మించి, ఇప్పుడు వివాహానికి నిరాకరించడంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ అక్షర సర్పంచ్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. తనను పెళ్లి చేసుకొని న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేస్తోంది. ఈ ఘటన లింగాపూర్ గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. పదేళ్లుగా కొనసాగిన ప్రేమ వ్యవహారం చివరకు ఆందోళనకు దారితీయడంతో స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంపై స్పందించి, ఇరువర్గాల వాదనలు విని సమగ్రంగా విచారించి బాధిత యువతికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐఆర్‌సీ సదస్సును తెలంగాణ ప్రగతికి, పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా మలచాలి

- తెలంగాణ సంస్కృతి, అభివృద్ధిని ప్రపంచానికి చాటేలా నిర్వహించాలి
- 19న ఉదయం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఘన ప్రారంభోత్సవం
- 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌కు ప్రీ-సమ్మిట్‌గా ఐఆర్‌సీ
- అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : ఐఆర్‌సీ సదస్సును తెలంగాణ ప్రగతికి, పెట్టుబడుల ఆకర్షణకు వేదికగా మలచాలని, రాష్ట్రంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులతో సుమారు మూడున్నర గంటల పాటు సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, ఎలాంటి జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల పనులపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆల్వాల్ టిమ్స్ ఆస్పత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఈ ఏడాదిలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి,నిమ్స్ విస్తరణ, నూతన హైకోర్టు భవన నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన రవాణా, వైద్య సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందుకు సంబంధించిన ప్రతి ప్రాజెక్టును అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సదస్సు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వివరించగా, మంత్రి పలు కీలక సూచనలు చేశారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సదస్సును ఘనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, వివిధ రాష్ట్రాల రోడ్లు, భవనాల శాఖ మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రతినిధులు, అంతర్జాతీయ డెలిగేట్లు, ఇంజనీరింగ్ రంగ నిపుణులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు దక్కిన ఈ ప్రతిష్టాత్మక అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ఐఆర్‌సీనీ కేవలం సాంకేతిక సదస్సుకే పరిమితం చేయకుండా రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను దేశ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేసే వేదికగా మలచాలని మంత్రి సూచించారు. రహదారుల అభివృద్ధి, ఆధునిక నిర్మాణ సాంకేతికత, మౌలిక వసతుల కల్పనలో తెలంగాణ సాధిస్తున్న పురోగతిని ప్రతినిధులకు వివరించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఐఆర్‌సీ సదస్సుకు హాజరయ్యే అతిథులకు తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, పర్యాటక ప్రాంతాలను పరిచయం చేసేలా హైటెక్స్ ప్రాంగణంలో సుమారు 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో పాటు ప్రత్యేకంగా 'తెలంగాణ పెవిలియన్' ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భారీ మౌలిక వసతుల ప్రాజెక్టులు, పెట్టుబడుల అవకాశాలను కూడా ఈ పెవిలియన్‌లో ప్రదర్శించాలని సూచించారు. ఐఆర్‌సీ సదస్సుపై దేశ వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ విమానాశ్రయం, మెట్రో స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, ఇతర ప్రధాన ప్రజా రవాణా కేంద్రాల్లో ఆకర్షణీయమైన హోర్డింగులు, ప్రత్యేక విజువల్ ప్రకటనలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ కార్యదర్శి ఇలంబర్తి, స్పెషల్ సెక్రటరీ గంగాధర్, మోర్త్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్లు లింగారెడ్డి (అడ్మిన్), బి.వి.రావు, వసంత్ నాయక్, ధర్మారెడ్డి, నర్సింగ్‌రావు, రాజేందర్, రాజేశ్వర్‌రెడ్డి, ఇంజనీర్లు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ

- విద్యార్థులకు జిల్లా కలెక్టర్ కె.హరిత అభినందన

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02(జనంసాక్షి): మేడ్చల్ జిల్లాలోని సన్ ఫ్లవర్ వేదిక్ పాఠశాలలో అక్టోబర్ 29 నుండి 31వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుడ్ బాల్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా జట్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి తిరుపతి, జిల్లా విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ జిల్లా జట్టు మేనేజర్ ఎం.రమేష్, జిల్లా జట్టు కోచ్ కదతాల రాకేష్, పీడీలు విద్యాసాగర్ ప్రవీణ్, ప్రభాకర్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

- ఒకరి మృతి

మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 2 (జనంసాక్షి) : ఆర్టీసీ బస్సు ,బైక్ ను ఢీకొనడంతో బైక్ పై ప్రయాణిస్తున్న గుడిపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట బస్టాండ్ సమీపంలో మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీకొనడంతో బైకు బస్సు ముందుకు వెళ్లిపోయింది. బైక్ నుండి కింద పడడంతో గుడిపేటకు చెందిన శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

ఎండోస్కోపీకి వెళ్తే.. డయాలసిస్ చేశారా?

- సాయిరామ్ గ్యాస్ట్రో ఆస్పత్రి, డాక్టర్ సునీల్ కుమార్‌పై ఆరోపణలు
- ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు బాధితుడి ఫిర్యాదు



ఖమ్మం, నవంబర్ 2 (జనంసాక్షి) : ఖమ్మం నగరంలోని నెహ్రూనగర్‌లో ఉన్న సాయిరామ్ గ్యాస్ట్రో ఆస్పత్రిలో తనకు అందించిన వైద్య చికిత్సపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పసుమర్తి సతీష్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ జంగాల సునీల్ కుమార్ తనకు అవసరానికి మించి వైద్య చికిత్స అందించారని, సరైన వివరణ ఇవ్వకుండానే కుటుంబ సభ్యులతో నో రిస్క్ సర్టిఫికెట్, సమ్మతి పత్రాలపై సంతకాలు చేయించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆరోగ్య సమస్యల నేపథ్యంలో అక్టోబర్ 22న ఎండోస్కోపీ, కొలనోస్కోపీ చేయించుకునేందుకు సాయిరామ్ గ్యాస్ట్రో ఆస్పత్రిని సంప్రదించారు. సంబంధిత వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో డాక్టర్ జంగాల సునీల్ కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా, ఆ రోజు అందుబాటులో లేనని, అక్టోబర్ 24న ఆస్పత్రికి రావాలని సూచించినట్లు తెలిపారు. దీంతో అక్టోబర్ 24న మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆస్పత్రికి వెళ్లగా, మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షలు నిర్వహించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వైద్య పరిస్థితిపై ఆందోళన

తన పాత వైద్య నివేదికలను పరిశీలించిన వైద్యుడు సీరమ్ క్రియాటినిన్ 1.5, పొటాషియం 7.8, హిమోగ్లోబిన్ 8.6, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ 110గా ఉన్నట్లు గుర్తించారని బాధితుడు తెలిపారు. తన ఆరోగ్య పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి భయాందోళనలకు గురిచేశారని, చికిత్స అవసరం, దాని వల్ల కలిగే ప్రమాదాలు, ప్రత్యామ్నాయాల గురించి తగిన వివరాలు ఇవ్వకుండానే నో రిస్క్ సర్టిఫికెట్, సమ్మతి పత్రాలపై సంతకాలు చేయించేందుకు ఒత్తిడి చేసినట్లు ఆరోపించారు. ప్రధానంగా ఎండోస్కోపీ, కొలనోస్కోపీ కోసం ఆస్పత్రికి వెళ్లిన తనకు అనంతరం డయాలసిస్ చేశారని, తనకు డయాలసిస్ నిజంగా అవసరమా? అందుకు తగిన వైద్య పరీక్షలు, క్లినికల్ అంచనాలు నిర్వహించారా? సరైన సమ్మతి తీసుకున్నారా? అనే అంశాలపై తనకు సందేహాలున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీమాపై అనుమానాలు

తనకు రూ.కోటి ఆరోగ్య బీమా పాలసీ ఉందని, ఈ పరిస్థితుల్లో ఆ బీమా పాలసీని దుర్వినియోగం చేసి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఆర్థిక ప్రయోజనాల కోసం అవసరం లేని వైద్య ప్రక్రియలు సూచించారా? బీమా సంస్థకు సమర్పించిన క్లెయిమ్‌లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలపైనా విచారణ జరపాలని కోరారు. ఈ చికిత్స, దాని చుట్టూ చోటుచేసుకున్న పరిణామాల కారణంగా తాను శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానని, తన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడిందేమోనని ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. ఆస్పత్రి, సంబంధిత వైద్యుడు అందించిన చికిత్సపై నిష్పక్షపాత వైద్య విచారణ జరపాలని, పూర్తి వైద్య రికార్డులు, ల్యాబ్ నివేదికలు, డయాలసిస్ వివరాలు, చికిత్స నోట్స్, సమ్మతి పత్రాలు, బిల్లులను పరిశీలించాలని కోరారు. డయాలసిస్ అవసరాన్ని వైద్యపరమైన ఆధారాలతో సమీక్షించాలని, కుటుంబ సభ్యులకు సరైన సమాచారం ఇచ్చి స్వచ్ఛందంగా సమ్మతి తీసుకున్నారా లేదా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆరోగ్య బీమా పాలసీ దుర్వినియోగం లేదా అనుచిత బీమా క్లెయిమ్‌లు జరిగాయా అనే కోణంలో విచారణ జరపాలని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో విచారణ చేయించి వైద్య నిర్లక్ష్యం, వృత్తిపరమైన దుష్ప్రవర్తన, ఇతర ఉల్లంఘనలు నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య రికార్డులు, ఆధారాలను భద్రపరచడంతో పాటు తనకు తక్షణమే తగిన వైద్య సహాయం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. విచారణకు అవసరమైన వైద్య నివేదికలు, మందుల చీటీలు, బీమా పత్రాలు, బిల్లులు, ఇతర ఆధారాలను సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తనకు న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇతర రోగులకు ఇలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని బాధితుడు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
3 నవంబర్ 2026

ప్రజాస్వామ్యం గురించి ప్రశ్నలు,

జవాబుదారీతనం లేని సమాధానాలు

సంపాదకీయం

హైదరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా "ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి, అరాచకత్వాన్ని అంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. వినడానికి ఈ మాటలు గంభీరంగానే ఉన్నాయి. కానీ దేశ అంతర్గత భద్రతకు, సరిహద్దుల రక్షణకు నేరుగా బాధ్యత వహించే శాఖకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి నోటి నుంచి వచ్చినప్పుడు, ఆ మాటలు ఇతరులకు చేసే హితబోధగా కాక, తన బాధ్యతను గుర్తుచేసే ప్రశ్నలుగా మారతాయి.

దేశంలో మూడు కోట్లకు పైగా చొరబాటుదారులు ఉన్నారని ఆయన చెప్పారు. ఇది నిజమైతే అది చిన్న విషయం కాదు. దశాబ్దాలుగా ఇంతమంది సరిహద్దులు దాటి వచ్చి ఓటర్ల జాబితాల్లోకి చేరారంటే, సరిహద్దు భద్రతలో వైఫల్యానికి నైతిక బాధ్యత ఎవరిది? ఇందులో ఎక్కువ కాలం కేంద్రంలో అధికారంలో ఉన్నది ఆయన పార్టీనే. వారిని ఎప్పటిలోగా దేశం నుంచి పంపిస్తారో కాలపరిమితితో చెప్పాలి. లేదంటే ఓట్లు తొలగించి చేతులు దులుపుకుంటారా? ఓటు తొలగింపు పరిష్కారం కాదు. అది సమస్యను పరిష్కరించినట్టు చూపించే మార్గం మాత్రమే.

సర్ ప్రక్రియపై చర్చకు సిద్ధమని ప్రకటించడం కూడా గమనార్హం. నిజానికి ఈ ప్రక్రియపై సమాధానం చెప్పాల్సింది, అఖిలపక్ష సమావేశం పిలిచి అనుమానాలను నివృత్తి చేయాల్సింది ఎన్నికల సంఘం. అది రాజకీయ పార్టీకి అతీతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ. ఒక రాజకీయ పార్టీ నేత దాని తరఫున వకాల్తా పుచ్చుకుని మాట్లాడటం ఎందుకు? ఆ సంస్థ స్వతంత్రతపై ఇప్పటికే ఉన్న సందేహాలను ఇది మరింత పెంచుతుంది. ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరిగితే అధికార పార్టీ నేత సమర్థించాల్సిన అవసరం ఉండదు. సమర్థించాల్సి వస్తోందంటే, ప్రశ్నలకు సరైన సమాధానాలు లేవనే అర్థం వస్తుంది.

అందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే నినాదాలు చాలవు. నిజమైన ఓటర్లు ఎవరూ జాబితా నుంచి తొలగిపోకుండా చూడటం, ఎన్నికల సంఘం స్వతంత్రంగా సమాధానం చెప్పడం, గణాంకాలకు ఆధారాలు చూపడం అవసరం. మూడు కోట్ల సంఖ్య ఎక్కడినుంచి వచ్చిందో చెప్పేవరకు అది ఆరోపణగానే మిగులుతుంది.

ఆధిపత్య సంస్థలు

ఒక జాతికి సాధారణమైన ఒక జీవితవిధానం, విశ్వాసాలు, ఆచారాలు, విలువలు, భాషా సాహిత్యాలు, కళలు, సంస్కారవంత మైన సాంఘిక సంబం ధాలు– ఈ అన్నిటి సమాహారమైన భౌతిక భావజాల విలక్షణతల సారం సంస్కృతి

ఒక జాతికి సాధారణమైన ఒక జీవిత విధానం, విశ్వాసాలు, ఆచారాలు, విలువలు, భాషా సాహిత్యాలు, కళలు, సంస్కారవంత మైన సాంఘిక సంబంధాలు– ఈ అన్నింటి సమాహారమైన భౌతిక భావజాల విలక్షణతల సారం సంస్కృతి. అది ఎవరో ఒకరు ఏదో ఒక రోజు పనిగట్టుకొని తయారుచేసిన వస్తువు కాదు. విశాలమైన భూమి మీద భిన్న భౌగోళిక ప్రత్యేకతల మధ్య వేల లక్షల సంవత్సరాల కాలపు సామాజిక పరిణామ దశల గుండా ప్రయాణిస్తూ మానవహోసమూహాలు ఉమ్మడిగా నిర్మించుకుంటూ వచ్చినది. ఒకే ప్రపంచం ప్రాచ్య, పాశ్చాత్య, మధ్య ఆసియా, పర్షియన్ తదితర సంస్కృతుల వైవిధ్యంతో ఉన్నట్లే భారతదేశం కూడా ఉత్తర దక్షిణ సంస్కృతుల వైవిధ్యంతో, అలాగే ప్రతి రాష్ట్రం అంతర్గత ప్రాంతీయ భిన్న సంస్కృతులతో మనుగడలో ఉన్నాయి. కనుక సంస్కృతి అనేది ఏకశిలా సదృశం కాదు. కానీ సమూహ సృష్టి అయిన సంస్కృతిలోని వైవిధ్య సౌందర్యాన్ని మింగేస్తూ, తాము సంస్కృతి అనుకున్నదానినే ఏకైక, అత్యుత్తమ, అంతిమ సంస్కృతిగా నిర్ధారించి అందరినీ నయానా, భయానా ఆ గొడుగు నీడకు చేర్చే ప్రచారము, బలవంతం, దౌర్జన్యం వర్తమాన వాస్తవం. ఇది ప్రమాద కరమైనది. స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం వంటి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకమైనది.

విధ్వంసకర పోకడలు

దళితుల, ముస్లింల ఆహార సంస్కృతిని నేరంగా చూపిస్తూ చంపటం వరకు వాళ్లను శిక్షించే అధికారాన్ని వ్యక్తుల చేతుల్లో పెట్టటం దగ్గర నుంచి– సనాతన ధర్మ సంస్కృతి పరిరక్షణ పేర ఆధునిక హేతుబద్ధ ప్రశ్నలను, తర్కాన్ని తట్టుకోలేని అసహన వైపరీత్యంతో ప్రశ్నిస్తున్న వాళ్లపై అశ్లీల పదజాలంతో అంతర్జాలంలో విషం కక్కటం, ఏ పుస్తకం ప్రచురించాలో, ఏది అమ్మాలో, ఏది చదవాలో, ఎలా విమర్శించాలో, దేని గురించి ఏమి మాట్లాడాలో అన్నింటినీ నిర్దేశించటం వరకు జరుగుతున్న విధ్వంసకర కార్యక్రమాలన్నీ ఈ కోవలోనివే.

సంస్కృతీ నిర్మాతలను పక్కకు నెట్టి నిర్దేశకులుగా ఆధిపత్య శక్తులు రంగం మీదకు వచ్చిన కాలం ఇది. అయితే ఇదంతా ఈ పది పన్నెండేళ్లుగా కొట్టవచ్చినట్లు కనబడుతున్నప్పటికీ, వీటికి మూలాలు కుటుంబం, కులం, మతం, రాజ్యం వంటి ఆధిపత్య వ్యవస్థల చరిత్రలో ఉన్నాయి.

ఉత్పత్తిపై అధికారంతో కొత్త విధానం

ప్రాచీన మానవ సమాజం శిలాయుగాన్ని దాటి లోహయుగంలోకి వచ్చి రాతి పనిముట్ల స్థానంలో ఇనుముతో చేసిన గొడ్డళ్లు, కత్తులు, ఈటెలు, బాణాలు, నాగలి కర్రు వాడటం మొదలయ్యాక వ్యవసాయం అభివృద్ధి చెందింది. అక్కడి నుంచే సంస్కృతిని స్థిరీకరించే ఆధిపత్య వ్యవస్థలుగా పరస్పర సంబంధంలో రూపొంది స్థిరపడ్డవే కుటుంబం, కులం, మతం, రాజ్యం.

మొత్తం మీద మానవ జీవన అవసరాలు, అవసరాల నుంచి పరికరాల ఆవిష్కరణలు, ఆవిష్కరణల ఫలితంగా ఉత్పత్తుల



అభివృద్ధి క్రమంలో రూపొందే సంస్కృతీ సంవిధానం ఆగిపోయి.. ఉత్పత్తి మీద అధికారమే సంస్కృతిని నిర్మించే కొత్త విధానంగా బలపడుతూ వచ్చింది.

వ్యవసాయ మిగులుతో ఏర్పడిన సొంత ఆస్తిపై యాజమాన్యంతో పాటు పురుషుడికి శ్రమ చేసే బానిసలతో పాటు వంశ వారసులను కని పెంచే భార్య పైన, పిల్లలపై కూడా సంక్రమించిన యాజమాన్య పునాదిపై నిర్మించబడిన కుటుంబంలో అందరూ సమానులు కారు. పెద్దవాళ్లకు చిన్నవాళ్లు, అన్నలకు తమ్ముళ్లు, భర్తకు భార్య, తల్లిదండ్రులకు పిల్లలు విధేయులుగా ఉండాలని ఆశించే కుటుంబ సంస్కృతి నిస్సందేహంగా ప్రజాస్వామిక సంస్కృతి కాదు.

నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ

నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ హిందూ సమాజపు అసమానతల తీవ్ర రూపం అంటారు అంబేద్కర్. అన్నింటికన్నా పైన అత్యున్నత స్థానంలో ఉండే కులం ఒకటైతే అన్నింటికన్నా అట్టడుగున ఉండే కులం మరొకటి. ప్రతి కింది కులమూ పై కులానికి విధేయంగా ఉండటం, విశ్వాసంగా ఉండటం లక్షణంగా చెప్పబడుతున్నప్పుడు పై మెట్టు కులానికి కింది మెట్టు కులాల మీద ఆధిపత్యం ధర్మంగా చలామణి అవుతున్నప్పుడు అందులో స్నేహానికి, సోదరత్వానికి, సమానత్వానికి తావు లేదు. ఇక చాతుర్వర్ణ వ్యవస్థకు అవతల, ఊరవతల మిగిలిపోయిన దళిత వర్ణం మొత్తంగా కులం ఒక ఆధిపత్య వ్యవస్థలో అత్యంత శోషణకు గురికావటం మనకు తెలిసిన వర్తమానమే.

కుటుంబం కుల ఆధిపత్యాన్ని నిలబెట్టే వ్యవస్థ. కులాంతర వివాహాల పట్ల వ్యతిరేకత, పరువు హత్యలు ఆ ఆధిపత్య భావం నుంచే జరుగుతున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్టానికి అతీతమైన స్వయంప్రతిపత్తితో కులం చలామణిలో ఉండటం వర్తమాన విషాదం.

మతం ఒక హింసాత్మక వ్యవస్థ

కులానికి సంక్రమించిన ఈ అతీత శక్తికి ప్రాతిపదిక మతం. వ్యక్తిగత జీవితానికి పరిమితమై ఉండవలసిన మతం సామాజిక సంబంధాల నిర్దేశక శక్తి కావటం, స్వీయ మతంలో స్త్రీ పురుషులకు, భిన్న కులాల వారికి మధ్య వేర్వేరు ధర్మాలను, విధులను నిర్దేశించటం ద్వారా అసమ, అమానవ, అవమాన సంబంధాలకు కారణం కావటం చారిత్రక వాస్తవం.

ఇక ఇతర మతాలను సహించగల లౌకిక తత్వం లేకపోవటం సరేసరి. మనుషుల మధ్య ఉండవలసిన ప్రేమను రద్దు చేస్తూ ఆ స్థానాన్ని ద్వేషంతో నింపటమే మతం అవుతున్న పరిస్థితుల్లో అది హింసాత్మక ఆధిపత్య వ్యవస్థ కాక మరేమంటాం?

మతం ఒక హింసాత్మక వ్యవస్థ

కులానికి సంక్రమించిన ఈ అతీత శక్తికి ప్రాతిపదిక మతం. వ్యక్తిగత జీవితానికి పరిమితమై ఉండవలసిన మతం సామాజిక సంబంధాల నిర్దేశక శక్తి కావటం, స్వీయ మతంలో స్త్రీ పురుషులకు, భిన్న కులాల వారికి మధ్య వేర్వేరు ధర్మాలను, విధులను నిర్దేశించటం ద్వారా అసమ, అమానవ, అవమాన సంబంధాలకు కారణం కావటం చారిత్రక వాస్తవం. ఇక ఇతర మతాలను సహించగల లౌకిక తత్వం లేకపోవటం సరేసరి.

మనుషుల మధ్య ఉండవలసిన ప్రేమను రద్దు చేస్తూ ఆ స్థానాన్ని ద్వేషంతో నింపటమే మతం అవుతున్న పరిస్థితుల్లో అది హింసాత్మక ఆధిపత్య వ్యవస్థ కాక మరేమంటాం?

ఆధిపత్య శక్తులకు అనుకూలంగా భావజాలం

కుటుంబం, కులం, మతం సామాజిక సంబంధాల్లో సంక్షోభ కారకాలు అవుతున్నప్పుడు, రాజ్యాంగం హామీపడిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి పౌర హక్కులకు అవరోధంగా మారినప్పుడు జోక్యం చేసుకొనవలసిన రాజ్యమే కుల మత ఆధిపత్య శక్తుల కార్యక్రమాన్ని భుజాలకు ఎత్తుకున్నప్పుడు మొత్తంగా దేశంలో పునరుత్పత్తి అయ్యేది, ప్రచారంలో ఉండేది ప్రజా సంస్కృతి కాదు.

ఆధిపత్య వ్యవస్థల రాజకీయ, ఆర్థిక అవసరాలకు, ప్రయోజనాలకు అనుకూలంగా నిర్వచించబడే భావజాల సంస్కృతే సనాతన ధర్మంగా చలామణిలోకి వస్తుంది.

ప్రశ్నకు, విమర్శకు అతీతంగా సర్వులకూ అనుల్లంఘనీయ శాసనం అవుతుంది. ఆధిపత్యం ఇప్పుడు ప్రజా ప్రతినిధుల్లో అధిక సంఖ్యాకుల అభిప్రాయంతో కూడా నిమిత్తం లేకుండా వ్యక్తి స్థాయిలో కేంద్రీకృతమై వాయుగుండంగా మారి వైవిధ్యభరిత ప్రజా సమూహాల సంస్కృతులను ముంచెయ్యగల ప్రమాద హెచ్చరిక అవుతున్నది.

యువత ఈ ప్రమాదాన్ని గుర్తించి ఎదుర్కొనటానికి తనదైన పద్ధతుల్లో సంసిద్ధం అవుతుండటం, పైపైకి పెరుగుతున్న ఆధిపత్య అహంకార పర్వతాలను ఏదో ఒక మూల నుంచి బద్దలు కొట్టటానికి తమవైన ఆయుధాలతో ప్రయత్నపరులు కావటం ఆశావహంగా ఉంది. రచయితలు, కళాకారులు, బుద్ధిజీవులు వాళ్లతో కలిసి నినాదం కావలసిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్, అక్టోబరు 31న హైదరాబాద్‌లో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో యువ సాహిత్యోత్సవం 2026 నిర్వహిస్తున్నది. 'సంస్కృతి – ఆధిపత్య వ్యవస్థలు' అనే అంశం మీద చర్చతో ఈ సాహిత్యోత్సవం ప్రారంభమవుతుంది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

బీజేపీకి నిరసన హక్కు ఉంది.. ప్రతిపక్షాలకు లేదా?

ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు.. ప్రజలే అంతిమ నిర్ణేతలు. ఎన్నికల్లో మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన పాలకులకు ప్రజల గొంతుకలను నియంత్రించే అధికారం లభించదు. ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించడం ఎంత సహజమో, వాటిని వ్యతిరేకించడం కూడా అంతే సహజం. పాలకుల విధానాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలపై గళమెత్తడం, తమ అసంతృప్తిని నిరసన రూపంలో వ్యక్తం చేయడం పౌరుల ప్రాథమిక ప్రజాస్వామిక హక్కులు. అయితే అధికారంలో ఉన్నవారు తమ రాజకీయ ప్రయో జనాలకు అనుగుణంగా నిరసనల పట్ల భిన్నమైన వైఖరులు ప్రదర్శిస్తే మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది. భారతీయ జనతా పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉన్నప్పుడు, ప్రతిపక్షాలకు మాత్రం ఆ హక్కు ఎందుకు ఉండకూడదు? అధికార పక్షానికి అనుకూలమైన ఆందోళనలకు ఒక న్యాయం, ప్రభుత్వాన్ని ప్రశ్నించే నిరసనలకు మరో న్యాయం ఉండగలదా? ఈ ప్రశ్నలకు పాలకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

దేశ రాజధాని ఢిల్లీలో నవంబరు 1న రాంలీలా మైదానంలో జరగనున్న ఇండియా కూటమి ర్యాలీ నేపథ్యంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల మోహరింపును నవంబరు 16 వరకు పొడిగించడం ఈ చర్చకు ప్రాధాన్యం కల్పిస్తోంది. సుమారు 270 కంపెనీల బలగాల మోహరింపును ఈ నెలలోనే మూడోసారి పొడిగించడం గమనార్హం. ఆకస్మిక నిరసనలు తలెత్తే అవకాశాలు, పండుగల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ వంటి కారణాలను ప్రభుత్వం ఇందుకు ప్రస్తావిస్తోంది. దేశ రాజధానిలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యతే. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని ఎవరూ కాదనలేరు. అయితే భద్రత పేరుతో చేపట్టే చర్యలు ప్రజల ప్రజాస్వామిక హక్కులకు అవరోధంగా మారకూడదు. భద్రతా ఏర్పాట్లు ప్రజలకు భరోసా కల్పించాలి తప్ప, తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలనుకునే వారిలో భయాన్ని నింపకూడదు.

ఒకవైపు ర్యాలీకి అనుమతి ఇచ్చి, మరోవైపు సమయం, ప్రసంగాలు, రాకపోకలు, జనసమీకరణ, సీసీటీవీ నిఘా వంటి అంశాలపై అనేక షరతులు విధించడం, దానికి తోడు భారీగా భద్రతా బలగాలను మోహరించడం పౌర హక్కులు, ప్రభుత్వ భద్రతా ఆందోళనల మధ్య సమతుల్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రతి ఆంక్షనూ తప్పుబట్టడం ఎంతవరకు సమంజసం కాదో, ప్రతి ఆంక్షనూ భద్రత పేరుతో సమర్థించడం కూడా అంతే అసమంజ సం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాధికారానికి పరిమితులు ఉంటాయి. ఆ పరిమితులను గుర్తుచేసే బాధ్యత న్యాయవ్యవస్థతోపాటు ప్రజలు, ప్రతిపక్షాలు, పౌర సమాజంపై కూడా ఉంది. నిరసనల పట్ల ప్రభుత్వ వైఖరిని అంచనా వేసేటప్పుడు రాజకీయ అనుకూలతను కాకుండా రాజ్యాంగ సూత్రాలను ప్రామాణికంగా తీసుకోవాలి.

భారత రాజ్యాంగంలోని 19వ అధికరణం పౌరులకు భావప్రకటనా స్వేచ్ఛను, శాంతియుతంగా, ఆయుధాలు లేకుండా సమావేశమయ్యే హక్కును కల్పించింది. అయితే ఈ హక్కులు అపరిమితమైనవి కావు. ప్రజా శాంతి, భద్రత వంటి రాజ్యాంగబద్ధమైన కారణాలతో ప్రభు త్వం సహేతుకమైన ఆంక్షలు విధించవచ్చు. కానీ ఆంక్షలు విధించే అధికారం ఉందని చెప్పి, వాటిని ఇష్టానుసారంగా అమలు చేయడానికి వీల్లేదు. ఆంక్షలు అవసరానికి మించి ఉండ కూడదు. నిరసన వల్ల తలెత్తే ప్రమాదాన్ని వాస్తవ పరిస్థితుల ఆధారంగా అంచనా వేయాలి. నిరసనకారుల రాజకీయ అభిప్రాయాలు, ప్రభుత్వంపై వారి విమర్శలు ఆంక్షలకు కారణం కాకూడదు. ఒక ప్రాంతంలో నిరసన నిర్వహించడం సాధ్యం కానప్పుడు ప్రత్యామ్నాయ వేదికను చూపించాలి. ప్రజల భద్రతను కాపాడుతూనే వారి గొంతుక వినిపించేందుకు అవకాశం కల్పించడం సమర్థవంతమైన ప్రజాస్వామిక పాలనకు నిదర్శనం.

ఇక్కడ మరో ముఖ్యమైన అంశం రాజకీయ పార్టీల ద్వంద్వ వైఖరి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు ప్రజాస్వామ్య హక్కులని నొక్కిచెప్పే పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే నిరసనలను శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరించడం తరచూ కనిపించే రాజకీయ వైరుధ్యం. బీజేపీ అయినా, కాంగ్రెస్ అయినా, మరే ఇతర రాజకీయ పార్టీ అయినా ఈ విషయంలో మినహాయింపు పొందకూడదు. ఒక పార్టీ తన రాజకీయ ప్రయోజనాల కోసం వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపినప్పుడు అది ప్రజాస్వామ్య పోరాటమైతే, అదే విధంగా మరో పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టినప్పుడు అది ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా ఎలా మారుతుంది? అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలమైన నిరసనలకు విస్తృత స్వేచ్ఛ, ప్రతిపక్షాల ఆందోళనలకు కఠినమైన ఆంక్షలు విధించే పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్యంలో సమానత్వం అనే సూత్రం అర్థరహితమవుతుంది.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిని రాజకీయ ప్రత్యర్థులుగా మాత్రమే చూడటం పాలకుల దృష్టిని సంకుచితం చేస్తుంది. ప్రతిపక్షం అనేది కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవాలనుకునే రాజకీయ శక్తి మాత్రమే కాదు. ప్రభుత్వ నిర్ణయాలను సమీక్షించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించడం కూడా దాని బాధ్యతలు. ఎన్నికల ప్రక్రియపై సందేహాలు వ్యక్తమైనా, ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురైనా, ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు వచ్చినా వాటిపై చర్చ జరగాలి. ప్రతిపక్షాల విమర్శల్లో రాజకీయ ఉద్దేశాలు ఉండవచ్చు. అయినప్పటికీ ఆ కారణంతోనే ప్రతి విమర్శనూ కొట్టిపారేయడం సరికాదు. విమర్శల్లో వాస్తవం ఉంటే సరిదిద్దుకోవాలి. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే ఆధారాలతో సమాధానం చెప్పాలి. అంతేతప్ప ప్రశ్నించిన వారిపై ఆంక్షలు విధించడం పరిష్కారం




కాదు. ఇదే సమయంలో నిరసనకారుల బాధ్యతలను కూడా విస్మరించలేం. ప్రజాస్వామ్య హక్కులు ఉన్నాయని చెప్పి హింసకు పాల్పడటం, ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడం, ప్రజా రవాణాకు తీవ్ర అంతరాయం కలిగించడం, ఇతరుల స్వేచ్ఛకు భంగం కలిగించడం సమర్థనీయం కాదు. ప్రశాంతంగా నిరసన తెలిపే వారి హక్కులను హింసాత్మక చర్యలకు పాల్పడే కొద్దిమంది కారణంగా ప్రశ్నార్థకం చేయకూడదు. గతంలో జరిగిన హింసాత్మక ఘటనలను సాకుగా చూపి ప్రతి నిరసననూ అనుమానంతో చూడటం కూడా సరైన విధానం కాదు. నిరసనకారుల్లో ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే వ్యక్తిగత బాధ్యతను నిర్ధారించి చర్యలు తీసుకోవాలి. మొత్తం ఉద్యమాన్ని దోషిగా చిత్రీకరించడం న్యాయసమ్మతం కాదు.

పోలీసుల పాత్ర ఈ సందర్భంలో అత్యంత కీలకం. శాంతిభద్రతలను పరిరక్షించడం, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత. నిరసనకారులు హింసకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందే. అదే సమయంలో పోలీసులు అతిగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటినీ నిష్పక్షపాతంగా పరిశీలించాలి. పోలీసులపై దాడులు జరిగినా, నిరసనకారులపై అనవసర బలప్రయోగం జరిగిందనే ఆరోపణలు వచ్చినా వాస్తవాలు వెలుగులోకి రావాలి. చట్టాన్ని ఉల్లంఘించిన పౌరులకే కాకుండా, విధి నిర్వహణలో అధికార పరిధిని అతిక్రమించిన సిబ్బందికీ బాధ్యత వర్తించాలి. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందనే నమ్మకం ప్రజల్లో బలపడినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం నిలుస్తుంది.

ఢిల్లీ దేశానికి రాజకీయ రాజధాని మాత్రమే కాదు, భారత ప్రజాస్వామిక విలువలకు ప్రతీకగా నిలవాల్సిన నగరం కూడా. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంస్థలు, విద్యార్థి సంఘాలు తమ సమస్యలను వినిపించేందుకు ఢిల్లీని వేదికగా ఎంచుకుంటాయి. అలాంటి నగరంలో నిరసనలకు తగిన స్థలం, స్వేచ్ఛ, భద్రత కల్పించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సమస్యలను పాలకుల దృష్టికి తీసుకురావడానికి ప్రతిసారీ అనుమతుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడకూడదు. అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి. ఆంక్షలకు స్పష్టమైన కారణాలు ఉండాలి. ఒకే తరహా పరిస్థితుల్లో అన్ని రాజకీయ పార్టీలకు ఒకే విధమైన ప్రమాణాలు వర్తించాలి. అధికార పక్షానికి ఒక నిబంధన, ప్రతిపక్షానికి మరో నిబంధన అనే భావన ప్రజల్లో కలగకుండా చూడాలి.

ప్రజాస్వామ్య బలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క గొంతు కూడా వినిపించకుండా చేయడంలో లేదు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలకు భద్రత కల్పిస్తూ, వాటి వెనుక ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఉంది. విమర్శలను బలహీనతగా భావించే పాలన క్రమంగా ప్రజలకు దూరమవుతుంది. నిరసనలను అణచివేస్తే అసంతృప్తి అంతరించిపోద, అది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ప్రజల ఆగ్రహాన్ని అర్థం చేసుకోవడానికి, వారి సమస్యలకు పరిష్కారాలు చూపడానికి సంభాషణే సరైన మార్గం. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పే బాధ్యతను పాలకులు స్వీకరించాలి. ప్రతిపక్షాలు కూడా నిర్మాణాత్మక విమర్శలతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలి.

చివరికి, ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు అధికారంలో ఉన్న పార్టీ ఇచ్చే కానుక కాదు. అది రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కు. ఆ హక్కును వినియోగించుకోవడానికి అధికార పక్షం నుంచి రాజకీయ అనుమతి అవసరం లేదు. అయితే దానిని వినియోగించుకునే క్రమంలో రాజ్యాంగబద్ధమైన పరిమితులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. బీజేపీకి నిరసన తెలిపే హక్కు ఉన్నప్పుడు ప్రతిపక్షాలకూ అదే హక్కు ఉండాలి. కాంగ్రెస్‌కు ఉన్నప్పుడు ఇతర పార్టీలకూ ఉండాలి. ఈ హక్కు పార్టీని బట్టి మారితే అది ప్రజాస్వామ్యం కాదు, అధికారానికి అనుకూలంగా రూపొందిన అసమాన వ్యవస్థ మాత్రమే. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో ప్రజల గొంతుకలను కట్టడి చేయడం కంటే, వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పే పాలన అందించడం ముఖ్యం. ప్రజల నిరసనలను బలగాలతో ఎదుర్కోవడం తాత్కాలిక నియంత్రణను ఇవ్వవచ్చు. కానీ ప్రజాస్వామ్యంపై విశ్వాసాన్ని నిలబెట్టేది మాత్రం సంభాషణ, పారదర్శకత, జవాబుదారీతనం మాత్రమే. ప్రశ్నించే హక్కును కాపాడటం, ప్రశ్నలకు సమాధానం చెప్పడం.. ఈ రెండింటినీ సమానంగా గౌరవించినప్పుడే భారత ప్రజాస్వామ్యం తన అసలైన స్ఫూర్తిని నిలబెట్టుకోగలదు.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ఆడపిల్లల కన్నీళ్లపై అభివృద్ధి సౌధాలు నిర్మించలేం!

ఆడపిల్ల నవ్వులోనే కుటుంబానికి ఆనందం.. మహిళ ఎదుగుదలలోనే సమాజానికి అభ్యుదయం.. కానీ నేడు ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి మహిళగా ఎదిగి జీవించే వరకు అడుగడుగునా అభద్రతా ఛాయలు వెంటాడుతున్నాయి. చదువుకోవడానికి బడికి వెళ్లినా, ఉపాధి కోసం పట్టణానికి చేరినా, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్నా ఆమెకు సంపూర్ణ భద్రత కరువవుతోంది. ఒకవైపు మహిళా సాధికారత, మరోవైపు మహిళలపై అఘాయిత్యాలు.. ఒకవైపు బేటీ బచావో–బేటీ పడావో నినాదాలు, మరోవైపు బాలికల జీవితాలతో చెలగాటం! ఈ వైరుధ్యాలకు ముగింపు ఎప్పుడు?

ఆర్థిక నిస్సహాయతను ఆసరాగా చేసుకొని అక్రమ దందాలు!

పొట్టకూటి కోసం పల్లెటూళ్ల నుంచి హైదరాబాద్‌కు చేరి హాస్టళ్లలో ఉంటూ ఉద్యోగాల వేట సాగిస్తున్న యువతుల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని, హాస్టల్ బిల్లులు చెల్లిస్తామంటూ మానవ అండాల అక్రమ సేకరణకు పాల్పడుతున్నారనే ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేస్తోంది. బేగంపేట పరిధిలో మహిళల హాస్టల్ ముసుగులో సాగుతున్నట్లు అనుమానిస్తున్న ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేపట్టడం ఆందోళనకరం. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన యువతుల అమాయకత్వాన్ని, ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వారి శారీరక ఆరోగ్యంతో వ్యాపారం చేయాలనుకోవడం మానవత్వానికే మచ్చ. అయితే ఈ వ్యవహారంలో ఎవరి పాత్ర ఎంతన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

సంతానలేమితో బాధపడుతున్న దంపతులకు వైద్య సాంకేతికత ద్వారా సంతానం కల్పించడం ఒక గొప్ప వైద్య విజ్ఞాన ఫలితం. కానీ ఆ సాంకేతికతను అక్రమ వ్యాపారానికి వేదికగా మార్చడం క్షమించరాని నేరం. అండదాతల సమ్మతి, ఆరోగ్య భద్రత, వైద్యపరమైన నియమాలు తప్పనిసరి. ఈ ప్రక్రియను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం 2021లోనే సహాయక పునరుత్పత్తి సాంకేతికత నియంత్రణ చట్టాన్ని తీసుకొచ్చింది. అయినప్పటికీ చట్టాల అమలులో పర్యవేక్షణ లోపిస్తే అక్రమార్కులకు అడ్డూ అదుపూ ఉండదు.

ముఖ్యంగా నగరాల్లోని మహిళా హాస్టళ్లకు తప్పనిసరి గుర్తింపు, నిర్వాహకుల వివరాల నమోదు, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. ఉద్యోగాల కోసం వచ్చే నిరుపేద యువతులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో సురక్షిత వసతి, చౌక భోజన సదుపాయాలు కల్పించాలి. ఆర్థిక అవసరాన్ని ఆసరాగా చేసుకొని మహిళల శరీరాలను వ్యాపార వస్తువులుగా చూసే దుర్మార్గానికి కఠినంగా అడ్డుకట్ట వేయాలి.

బడిలోనే బాలికకు భద్రత కరువైతే..సమాజానికి భరోసా ఎక్కడ!?

విద్యార్థులకు అక్షరజ్ఞానంతోపాటు ఆత్మవిశ్వాసం, భద్రత, భవిష్యత్తుపై భరోసా కల్పించాల్సిన పాఠశాలలు కూడా నేడు ఆందోళనకు గురిచేస్తున్నాయి. అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి బాలికపై తరగతి గదిలోనే ఓ వ్యక్తి విద్యుత్ రంపంతో దాడికి పాల్పడటం, అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడటం సభ్యసమాజాన్ని కలచివేసింది. చదువుల తల్లి ఒడిలాంటి తరగతి గదిలోనే ఇలాంటి దారుణం చోటుచేసుకోవడం పాఠశాలల భద్రతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది.

బాలికలపై వేధింపులు, వెంటపడటం, ప్రేమ పేరుతో ఒత్తిడి చేయడం, తిరస్కరణను భరించలేక దాడులకు దిగడం వంటి వికృత ధోరణులను చిన్నచూపు చూడకూడదు. ఇవి వ్యక్తిగత ప్రవర్తనా లోపాలే కాకుండా మహిళల స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని నిరాకరించే పురుషాధిక్య భావజాలానికి ప్రతిబింబాలు. ఒక బాలిక తన ఇష్టాన్ని వ్యక్తం చేసే హక్కును, తనకు ఇష్టం లేని ప్రతిపాదనను తిరస్కరించే స్వేచ్ఛను సమాజం గౌరవించాలి. పాఠశాలల ప్రధాన ద్వారాల వద్ద పటిష్టమైన భద్రత, సందర్శకుల వివరాల నమోదు, సీసీ కెమెరాల నిర్వహణ, ఉపాధ్యాయులకు ప్రత్యేక బాధ్యతలు అవసరం. విద్యార్థినులకు స్వీయరక్షణపై అవగాహనతోపాటు వేధింపులను నిర్భయంగా ఫిర్యాదు చేసే వ్యవస్థ ఉండాలి. కేంద్ర విద్యాశాఖ రూపొందించిన పాఠశాల భద్రతా మార్గదర్శకాలను కాగితా లకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు



చేయాలి. విద్యాసంస్థల్లో నిర్లక్ష్యానికి తావులేని విధంగా జీరో టాలరెన్స్ విధానం పాటించాలి.


మహిళల కన్నీళ్లకు ముగింపు ఎప్పుడు?

ప్రభుత్వాల బాధ్యత ఏది!?

వికారాబాద్ జిల్లా పరిధిలో తల్లి, ఇద్దరు చిన్నారులు మృతి చెందిన హృదయవిదారక ఘటన మరోసారి కుటుంబ భద్రత, మహిళల మానసిక వేదన, సామాజిక అండదండల అవసరాన్ని గుర్తుచేస్తోంది. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. అయితే కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు, గృహకలహాలు, ఒంటరితనం, మానసిక ఒత్తిళ్లు మహిళలను ఎంతటి నిస్సహాయ స్థితికి నెట్టగలవో సమాజం ఆలోచించాలి. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలకు కుటుంబం, బంధువులు, సమాజం అండగా నిలవాలి. బాధను దాచుకోవాల్సిన అవసరం లేదనే నమ్మకం కల్పించాలి. దేశంలో మహిళలపై నమోదవుతున్న నేరాల గణాంకాలు కూడా పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఎన్‌సీఆర్‌బీ 2024 గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా మహిళలపై 4,41,534 నేరాలు నమోదయ్యాయి. తెలంగాణలో 24,495 కేసులు నమోదవడం, ప్రతి లక్ష మంది మహిళల జనాభాకు 128.6 నేరాల రేటుతో రాష్ట్రం దేశంలోనే అత్యధిక స్థాయిలో నిలవడం ఆందోళనకరం. ఇవి నమోదైన కేసులు మాత్రమే; వెలుగులోకి రాని ఘటనలు మరెన్నో ఉండవచ్చు.

మహిళల భద్రతకు ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. పోలీస్ స్టేషన్లలో మహిళా సహాయ కేంద్రాలను బలోపేతం చేయాలి. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి. మహిళా హాస్టళ్లు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా రవాణా కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలి. బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులపై గ్రామస్థాయి నుంచి నగర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అంతేకాదు, బాలురకు చిన్నతనం నుంచే మహిళలను గౌరవించడం, ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛను గుర్తించడం, తిరస్కరణను గౌరవించడం వంటి మానవీయ విలువలను నేర్పాలి. మద్యం, మాదకద్రవ్యాల దుర్వినియోగం, వికృత ఆలోచనలు, సామాజిక మాధ్యమాల ద్వారా పెరుగుతున్న వేధింపులపై కుటుంబాలు, విద్యాసంస్థలు అప్రమత్తంగా ఉండాలి. మహిళల భద్రత పోలీసుల ఒక్కరి బాధ్యత కాదు.. ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత.

లిమహిళను దేవతగా పూజిస్తూ.. మనిషిగా గౌరవించలేని సమాజం నాగరిక సమాజం ఎలా అవుతుంది? ఆడపిల్లకు రక్షణ, మహిళకు భద్రత, బాధితురాలికి న్యాయం, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుంది. ఆడపిల్లల కన్నీళ్లపై అభివృద్ధి సౌధాలు నిర్మించలేం.. మహిళల అభద్రతపై ప్రగతి పతాకాలు ఎగురవేయలేం. బేటీ బచావో నినాదం బహిరంగ సభలకే పరిమితం కాకూడదు.. ప్రతి ఇంట్లో, ప్రతి బడిలో, ప్రతి వీధిలో ఆచరణ కావాలి. మహిళకు భద్రత లేని చోట అభివృద్ధి లేదు.. ఆడపిల్లకు రక్షణ లేని చోట భవిష్యత్తు లేదు!.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు,
జిల్లా: వరంగల్,
ఫోన్:9573666650.

భయాందోళనలో మేడిపల్లి ప్రజలు..!

- దొంగల స్వైరవిహారం..
- రాత్రీ పగలు తేడా లేకుండా వరుస చోరీలు
- కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్న కాలనీవాసులు
- ఇళ్లలో చోరీలు..ద్విచక్ర వాహనాల అపహరణలు.. వాహనాల నుంచి డీజిల్ చోరీలు
- సీసీ కెమెరాలు ఉన్నా తగ్గని దొంగల ఆగడాలు
- కాలనీల్లో పోలీసు గస్తీ పెంచాలని సీఐకి నివాసితుల వినతి

బోడుప్పల్, నవంబర్ 2 (జనంసాక్షి) : మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాత్రీపగలు తేడా లేకుండా దొంగలు చోరీలకు పాల్పడుతుండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.ఇళ్లలో చోరీలు, ద్విచక్ర వాహనాల అపహరణలు,రోడ్లపై పార్క్ చేసిన వాహనాల నుంచి డీజిల్ చోరీలు వరుసగా చోటుచేసుకుంటుండటం పోలీసులకు సవాలుగా మారుతోంది.ఇటీవల వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న క్యారెట్ లేన్ గోల్డ్ షాపులో సుమారు రూ.2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ఈ కేసులో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రత్యేక దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.అయితే ఆ ఘటన తర్వాత కూడా పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.గతంలో రాత్రి వేళల్లో లేదా జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లోనే దొంగతనాలు ఎక్కువగా జరిగేవి.ప్రస్తుతం పట్టపగలు సైతం ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతుండటం గమనార్హం. కాలనీల్లో పెద్ద సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ దొంగతనాలు తగ్గకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ముఖ్యంగా



పండుగలు,సెలవుల సమయంలో కుటుంబ సభ్యులు ఊళ్లకు వెళ్లి ఇళ్లకు తాళాలు వేసి ఉండటాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.పీ అండ్ టీ కాలనీలో ప్రధాన రహదారిపై ఉన్న ఓ ఇంట్లో పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లగా మరుసటి రోజే దొంగలు ఇంట్లోకి చొరబడి నగదు,వెండి వస్తువులను అపహరించారు. బోడుప్పల్, చెంగిచెర్ల పరిధిలోని పలు కాలనీల్లో ఇప్పటికే అనేక ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. అంతేకాకుండా రోడ్ల పక్కన,అపార్ట్‌మెంట్ల పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపిన వాహనాల నుంచి డీజిల్‌ను అపహరిస్తున్న ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయి.ఈ వరుస ఘటనలతో వాహనదారులు,ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు.

సీసీ కెమెరాలు ఉన్నా.. భద్రత ఏదీ..?

కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ,పనితీరు సక్రమంగా ఉందా? నిఘా వ్యవస్థ నిరంతరం పనిచేస్తోందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.గతంలో దొంగతనాలకు పాల్పడి పోలీసులకు పట్టుబడిన కొందరు నిందితులు తిరిగి అదే తరహా నేరాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.నేరాల నియంత్రణకు కేవలం సీసీ కెమెరాల ఏర్పాటు మాత్రమే సరిపోదని నిరంతర పోలీసు నిఘా,పటిష్టమైన గస్తీ అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



గస్తీ పెంచండి

కాలనీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప చెంగిచెర్ల డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనగర్ కాలనీలో వరుస దొంగతనాల యత్నాలు చోటుచేసుకుంటుండటంతో నివాసితులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలో ఇళ్ల బయట పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని దుండగులు చోరీలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారు.సోమవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ జలంధర్ రెడ్డిని కలిసి బీరప్ప ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం 6:28 గంటల సమయంలో కాలనీవాసులు రోడ్డుపై నడుస్తున్న సమయంలో ఓ దుండగుడు స్కూటీ తాళం తీసి దొంగిలించేందుకు ప్రయత్నించాడని,అయితే వాహనం స్టార్ట్ కాకపోవడంతో దానిని సమీపంలోని మరో కాలనీలో వదిలి పరారయ్యాడని పేర్కొన్నారు.ఇదే కాలనీలో మరో ఇంట్లోకి చొరబడి బంగారం దొంగిలించేందుకు ప్రయత్నించిన ఘటన కూడా చోటుచేసుకుందని ఫిర్యాదుతో పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.రాత్రి వేళల్లోనే కాకుండా తెల్లవారుజామున కూడా దొంగతనాలకు యత్నాలు జరుగుతుండటంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారని బీరప్ప పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని శ్రీ లక్ష్మీనగర్ కాలనీలో పోలీసుల గస్తీని పెంచాలని,అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలని సీఐ జలంధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలి

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పిలుపు



ఉప్పల్, నవంబర్ 2 (జనం సాక్షి) : ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి చిలకనగర్ డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డ ప్రాంతం రాఘవేంద్ర నగర్ కాలనీలో ఉన్న సెయింట్ గాబ్రియేల్ ప్రైవేట్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. అర్హులైన పట్టభద్రులు ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో అందుబాటులో ఉందని తెలిపారు. ఆఫ్‌లైన్ విధానంలో ఓటరు నమోదు చేసుకునేందుకు పాఠశాల యాజమాన్యానికి ఫారం-18 దరఖాస్తులను అందజేశామని, అర్హులైన వారు వాటిని పూర్తిచేసి అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలని సూచించారు. అదేవిధంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలనుకునే వారికి బీఆర్ఎస్ పార్టీ నాయకులు ల్యాప్‌టాప్‌లతో అందుబాటులో ఉండి సహకారం అందిస్తారని తెలిపారు. అర్హులైన పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటరు నమోదు ప్రక్రియపై తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. మీ ఓటు మీ హక్కు.. మీ గొంతుకకు గుర్తింపు అని పేర్కొంటూ, ప్రజాస్వామ్యంలో ప్రతి పట్టభద్రుడి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

మత్తు పదార్థాలు, అవినీతి దేశాభివృద్ధికి విఘాతం

- ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి
- ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు



రంగారెడ్డి, నవంబర్ 2 (జనంసాక్షి) : మత్తు పదార్థాలు, అవినీతి దేశాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు – అవినీతి వల్ల కలిగే నష్టాలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా ఉద్యోగం, కుటుంబ జీవితం, భవిష్యత్తు నాశనమవుతాయన్నారు. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గి నేర ప్రవృత్తి పెరుగుతుందని గుర్తు చేశారు. మత్తు పదార్థాల కోసం దొంగతనాలు, నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో నమోదు అవుతున్న కేసులే దీనికి నిదర్శనమని తెలిపారు. కుటుంబాలు ఆర్థికంగా చిన్నభిన్నమై అప్పులపాలవుతాయని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అవినీతిని అడ్డుకోవడంలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. యువత ఈ దేశానికి కీలకమైన మానవ వనరన్నారు. వారు విద్య, విజ్ఞానం, పరిశోధన, పరిశ్రమలు, పరిపాలన వంటి రంగాల్లో రాణించాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైతే ప్రతిభ, ఉత్పాదకత తగ్గి దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి తీవ్ర నష్టం జరుగుతుందనీ వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. రాధిక, ప్రభుత్వ పాలన విభాగాధిపతి జి. రవికుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. సురేష్, ఇబ్రహీంపట్నం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సుమలత, అధ్యాపకులు డి.ఎస్.ఆర్. కృష్ణ, సురేష్, డాక్టర్ సిహెచ్. రాకేష్ భవాని, డాక్టర్ డి.వి. రావు, డాక్టర్ నరసింగరావు, టి. శ్రీ కృష్ణ, డాక్టర్ ఈ. శంకర్ పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలి

- రైతులకు సూచించిన ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు



చేవెళ్ల, నవంబరు 2 (జనంసాక్షి) : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, శాస్త్రీయ విధానాల్లో సాగు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.గోబినాథ్, డాక్టర్ జ్యోతి బద్రి, డాక్టర్ జాగృతి రోహిత్ సూచించారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, నేల సారాన్ని పెంపొందించే విధానాలు, పంట దిగుబడుల మెరుగుదల, భవిష్యత్తులో నేల ఆరోగ్యాన్ని కాపాడుకునే చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని తెలిపారు. నేల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తక్షణ భూసార పరీక్ష పరికరం ద్వారా పొలంలోనే భూసార పరీక్షలు నిర్వహించే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోటూరి రామచంద్రయ్య గౌడ్, ఉప సర్పంచ్ అనూష, మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్, వ్యవసాయ విస్తరణ అధికారులు గాయత్రి, బాల కోటేశ్వరరావు, నాయకులు నాగిరెడ్డి, అంజన్ కుమార్, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నంగునూరును కరువు మండలంగా ప్రకటించాలి

- ఎంపీడీవో ఆఫీస్ ముందు బిఆర్ఎస్ శ్రేణుల ధర్నా
- అనంతరం ప్రజావాణిలో ఫిర్యాదు

నంగునూరు, నవంబర్ 2 (జనం సాక్షి) : నంగునూరు మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రోజు బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయం ముందు నిరసన ధర్నా చేపట్టారు. అనంతరం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల నాయకులు మాట్లాడుతూ.. నంగునూరు మండలంలో కరువు పరిస్థితులు తీవ్రస్థాయికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



వర్షపాతం సక్రమంగా లేక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయని పేర్కొన్నారు. సాగునీరు అందక రైతులు వేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుండటంతో రైతాంగం తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిందని తెలిపారు. పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలో సమగ్ర సర్వే నిర్వహించి నంగునూరును కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించి, రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మాజీ ఎంపీపీ జూప శ్రీకాంత్ రెడ్డి, మాజీ జెడ్పి వైస్ చైర్మన్ రాగుల సారయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రేకులపల్లి సంతోష్ రెడ్డి, బద్దిపడగ కిష్టారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాత నేరస్తుడిని హతమార్చేందుకు యత్నం

- ఐదుగురు అరెస్టు
- రెండు నాటు తుపాకులు, తూటాలు, కత్తులు స్వాధీనం



మల్కాజిగిరి, నవంబర్ 2 (జనం సాక్షి) : పాత కక్షలతో ఓ నేరస్తుడిని హతమార్చేందుకు పథకం పన్నిన ఐదుగురు సభ్యుల ముఠాను మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రెండు నాటు తుపాకులు, ఎనిమిది తూటాలు, మూడు కత్తులు, వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుమతి వివరాలు వెల్లడించారు.గతంలో దాసరి సురేందర్ అలియాస్ సూరి తన భార్య షబాను, అనంతరం 2024లో ఆమె సోదరుడు సల్మాన్‌ను హత్య చేశాడు. దీనిపై ప్రతీకారంతో షబా మరో సోదరుడు ఆర్ఫాజ్ గతేడాది జులైలో సురేందర్‌ను హతమార్చి జైలుకెళ్లాడు. ఇటీవల ఆర్ఫాజ్ జైలు నుండి విడుదల కావడంతో సురేందర్ అనుచరులు అతడిపై కక్ష తీర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. బిహార్‌లోని భాగల్‌పూర్ నుంచి 30 వేలకు నాటు తుపాకులు, తూటాలు కొనుగోలు చేశారు. సోమవారం ఉదయం ఆర్ఫాజ్‌ను చంపేందుకు ఉప్పల్ శిల్పారామం సమీపంలోని మూసీ ఖాళీ ప్రదేశంలో నిందితులు సమావేశమయ్యారని విశ్వాసనీయ సమాచారంతో ఉప్పల్ పోలీసులు, ఎస్‌వోటీ పోలీసుల సహకారంతో తోకట తనయ్ కుమార్ (26) షేక్ అక్బర్ (26) ఆదిత్య కుమార్ ఠాకూర్ (33) దుగాని లక్ష్మణ్ సింగ్ (27)వడియ వెంకటేశ్ (22) అదుపులోకి తీసుకొని విచారించగా,నిందితుల్లో లక్ష్మణ్ సింగ్‌పై చైతన్యపురి ఠాణాలో రౌడీషీట్‌తో పాటు, గతంలో రెండు హత్యలు సహా 30కి పైగా కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ఆస్తి నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి

- సంగారెడ్డి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌ను తనిఖీ చేసిన ఐజీ షానవాజ్ ఖాసిం



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 2 (జనం సాక్షి) : ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి, నేరాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని మల్టీ జోన్--2 ఐజీ షానవాజ్ ఖాసిం పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం సంగారెడ్డి జిల్లా ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ స్టోర్, మోటారు వాహనాలు, జాగిలాల విభాగం, బాంబు నిర్వీర్య బృందం పనితీరును సమీక్షించారు. పోలీసు ఆయుధాలు, రక్షణ పరికరాలు అందుబాటులో ఉండేలా చూడాలని, వాహనాలకు క్రమం తప్పకుండా మరమ్మతులు చేయించి వినియోగానికి సిద్ధంగా ఉంచాలని సూచించారు. జాగిలాల ఆరోగ్యం, ఆహారం, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించి, వారికి పురస్కారాలు ప్రకటించారు. అనంతరం డీఎస్పీలతో నిర్వహించిన సమీక్షలో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచాలని, సమాజంతో సంబంధాలను బలోపేతం చేస్తూ నేరాల నివారణకు ముందస్తు సమాచార సేకరణ చేపట్టాలని సూచించారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీలు చైతన్య రెడ్డి, శ్రీనివాసరావు, డీఎస్పీలు, ఆర్ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

భూ సేకరణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి

- సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్

కొడంగల్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) : అభివృద్ధి పనులకు సంబంధించి భూ సేకరణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ అధికారులను ఆదేశించారు.సోమవారం కడ కార్యాలయంలో రేడియల్ రోడ్ నిర్మాణం, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు మక్తల్ – నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణాల పురోగతిపై ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, వికారాబాద్, నారాయణ పెట్ జిల్లా కలెక్టర్‌లు దీపక్ తివారీ, ప్రియాంకలతో కలిసి అధికారులతో సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్ట్ లకు కేటాయించాల్సిన భూముల సమస్యలు, వాటి పరిష్కారానికి అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు.ప్రాజెక్టుల పనుల అమలులో ఎలాంటి జాప్యం జరగకుండా, భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, అభివృద్ధి పనులను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసే దిశగా అధికారులు కృషి చేయాలని ఆయన తెలిపారు.ప్రాజెక్టులకు సంబంధించి భూములు ఇచ్చేందుకు సమ్మతించిన రైతులతో మాట్లాడి అవార్డులను ప్రకటించాలని ఆయన సూచించారు.పంచాయతీ రాజ్, ఆర్ అండ్ రోడ్డు, పబ్లిక్ హెల్త్, ఇడబ్ల్యుఐడిసి చేపడుతున్న పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.త్రాగు నీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు.ఈ సమీక్ష



సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,ఆర్డీవోలు వాసుచంద్ర, అనిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
03 నవంబర్ 2026

రోడ్డు విస్తరణ పేరుతో వ్యాపారులపై వేధింపులు ఆపాలి

- చైర్మన్ భర్త, షాపుల ఆక్రమణలు తొలగించాలి
- నష్టపరిహారం ఇచ్చాకే దుకాణాల తొలగింపు చేపట్టాలి
- అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్



వనపర్తి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి) : పట్టణంలో రోడ్డు వెడల్పు పనులకు తాము పూర్తి మద్దతు ఇస్తామని, అయితే అభివృద్ధి పేరుతో ప్రజల హక్కులను కాలరాస్తూ విధ్వంసం సృష్టిస్తే సహించేది లేదని అఖిలపక్ష ఐక్యవేదిక స్పష్టం చేసింది. రోడ్డు విస్తరణ పనులను సోమవారం పరిశీలించిన ఐక్యవేదిక నాయకులు అక్కడి పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రోడ్డు వెడల్పు చేయాలనే నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారని, అందుకు వ్యాపారులు కూడా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు అధికార బలంతో వ్యాపారులను దూషించడం, వారి దుకాణాలను అస్తవ్యస్తం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ పేరుతో పదివేల లోతులో కాలువలు తవ్వడం వెనుక ఉద్దేశమేమిటని నిలదీశారు. వ్యాపారులతో సామరస్యంగా చర్చించి, వారిని ఒప్పించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షులు డా సతీష్ యాదవ్, బీఎస్పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు ,టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, బిజెపి నాయకులు రవి, రామస్వామి, శివకుమార్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ రుణాలు అందజేయాలి

- అనుబంధ రంగాలకూ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి
- కరువు పరిస్థితుల్లో బ్యాంకుల సహకారం అవసరం
- బీమా పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఈ ఏడాది క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, బ్యాంకులు విరివిగా వారికి రుణాలు ఇచ్చి సహకరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్లతో ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 13 మండలాలను తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కరువు ప్రభావిత రైతులకు ఆర్థిక ఉపశమనం కల్పించడం, వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ, నూతన పంట రుణాల మంజూరు తదితర అంశాలపై బ్యాంకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరువు పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గి, సాగునీటి కొరతతో కొందరు రైతులు తమ పంటలను కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అర్హులైన రైతులకు భారతీయ రిజర్వ్ బ్యాంక్, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ మార్గదర్శకాల ప్రకారం రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా ఉపశమనం కల్పించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకు శాఖల పరిధిలో మొత్తం 59,968 మంది రైతులు రూ.1,099.43 కోట్ల విలువైన పంట రుణాలు పొందగా, మరో 15,383 మంది రైతులు రూ.517.64 కోట్ల విలువైన వ్యవసాయ కాలపరిమితి రుణాలు పొంది ఉన్నారని, వీరందరికీ నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన రైతుల వ్యవసాయ రుణాలకు 12 నెలల మారటోరియం కల్పించి, తిరిగి చెల్లింపు వ్యవధిని గరిష్టంగా 60 నెలల వరకు పొడిగించే విధంగా మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చే ప్రక్రియను చేపట్టాలని, మారటోరియం అనంతరం నిర్ణీత షెడ్యూల్ ప్రకారం రుణాల చెల్లింపులు జరిగేలా చూడాలని తెలిపారు.రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు రైతులకు తదుపరి పంటల సాగు కోసం నూతన పంట రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. రుణాల రికవరీ విషయంలో రైతులపై ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులు లేకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లోని అర్హులైన రైతుల విషయంలో బలవంతపు రుణ వసూళ్లకు పాల్పడరాదని బ్యాంకు అధికారులకు కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకులతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన రైతులను, రుణ ఖాతాలను గ్రామాలు, మండలాల వారీగా గుర్తించాలని, రైతు వేదికలు, గ్రామసభలు, ఆర్థిక అక్షరాస్యత శిబిరాల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై అన్నదాతలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో ఎంపీడీవోలు, డిఆర్డిఏ, తదితర శాఖల సిబ్బందితో కలిసి బ్యాంకు శాఖల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించి రుణాల మంజూరు, ఇతరత్రా అంశాలపై చర్చించి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిసిబి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అబ్దుల్ నబీ, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్, నాబార్డ్ డీడీఎం మనోహర్ రెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే సహన సంస్థ లక్ష్యం

- అంసానిపల్లిలో ఉచిత వైద్య శిబిరం



కొల్చారం, నవంబర్ 2 (జనం సాక్షి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు బాలల హక్కులను కాపాడుతూ, బాల కార్మికులు లేని ఆదర్శ గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా సహన సంస్థ పనిచేస్తోందని సంస్థ ప్రతినిధి సత్యనారాయణ తెలిపారు. ఇందులో భాగంగా కొల్చారం మండలంలోని అంసానిపల్లి గ్రామంలో సహన సంస్థ మల్లారెడ్డి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ రామన్న గీత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామన్న గీత మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న సహన సంస్థ ప్రతినిధులకు, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సహన సంస్థ ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, అన్ని గ్రామాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మికుల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫణీందర్ కుమార్, గ్రామ సర్పంచ్ గీత రమేష్ , వార్డు సభ్యులు, మల్లారెడ్డి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రీతం కుమార్ రెడ్డి, డాక్టర్ శివ సాత్విక, నర్సింగ్ సిబ్బంది పావని, నందిని, ఫాతిమా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నాగప్ప, మేనేజర్ మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ పేరుతో నకిలీ వాట్సాప్ ఖాతా..

- డబ్బులు అడిగితే నమ్మవద్దు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) : జిల్లా కలెక్టర్ పేరు,ఫొటోతో నకిలీ వాట్సాప్ ఖాతాల ద్వారా డబ్బులు కోరుతున్న సందేశాలను నమ్మవద్దని, ఎవరూ డబ్బులు పంపి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ పేరు, ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని, ఆయన పేరుతో ముఖ్యంగా 8974808916 నంబర్‌తో ప్రజలకు సందేశాలు పంపిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. తన పేరుతో డబ్బులు కోరుతూ వచ్చే ఇటువంటి సందేశాలు పూర్తిగా నకిలీవని, వాటిని ఎవరూ నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు పంపి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ ప్రజలకు స్పష్టం చేశారు.ఈ తరహా మోసాలకు పాల్పడుతున్న వారిపై ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించినట్లు వెల్లడించారు. వాట్సాప్‌లో లేదా సోషల్ మీడియాలో కలెక్టర్ ప్రభుత్వ అధికారుల ఫొటోలు,పేర్లు, హోదాలు కనిపించినంత మాత్రాన అవి నిజమైన ఖాతాలని నమ్మవద్దని తెలిపారు. ప్రభుత్వ అధికారులు,జిల్లా కలెక్టర్ పేర్లను దుర్వినియోగం చేస్తూ ప్రజలను మోసం చేయడం తీవ్రమైన నేరమని,ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డీహెచ్‌పీఎస్ 20వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి



సిద్దిపేట, నవంబర్ 2 (జనంసాక్షి) : దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్ పీఎస్) 20వ వార్షికోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించి జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కనుకుంట్ల శంకర్, అధ్యక్షుడు బొనగిరి రూపేష్ లు పిలుపునిచ్చారు.దళితుల అభ్యున్నతి కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న డీహెచ్ పీఎస్ 20 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం సిద్దిపేటలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద జిల్లా సమితి ఆధ్వర్యంలో వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితుల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం డీహెచ్ పీఎస్ నిరంతరం పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో డీహెచ్ పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బోనగిరి శంకర్, చిట్యాల నవీన్, చక్రం గణేష్, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



వనపర్తి, నవంబర్ 2 (జనం సాక్షి) : జిల్లాలో బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వ్యాపారులపై ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ధరల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం నిల్వలు, సరఫరా, మార్కెట్ ధరలపై వ్యాపారులతో సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయనే అంచనాలను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ముందస్తుగా బియ్యం నిల్వ చేసి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే ప్రయత్నాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అదనపు కలెక్టర్ తెలిపారు. అలాంటి చర్యలకు పాల్పడవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని ఆదేశించారు.

బియ్యం ధరల వివరాలు ఇలా ఉన్నాయి

బీపీటీ, కేఎన్ఎం రకం కిలో రూ.66కు మించరాదు, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం కిలో రూ.74కు మించరాదు, జేఎస్ఆర్, హెచ్ఎంటీ రకం కిలో రూ.79కు మించరాదన్నారు. బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల నిల్వలు, సరఫరా విషయంలో వ్యాపారులు పారదర్శకత పాటించాలని సూచించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే నిత్యావసర వస్తువుల చట్టంతో పాటు ఇతర చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ రాంరెడ్డి, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా పౌరసరఫరాల సంస్థ డీఎం హరీష్, కమిటీ సభ్యులు, బియ్యం, హోల్‌సేల్, కిరాణా వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలి
- ఈనెల 7 వరకు బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాలు
- అదనపు కలెక్టర్ సంగీత

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 2 (జనం సాక్షి) : విద్యుత్, ఇంధన వనరులను పొదుపుగా వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ సంగీత సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంధన పరిరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ... ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు, ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించాలని సూచించారు. అవసరం లేనప్పుడు దీపాలు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలను నిలిపివేయాలని, ఇంధనాన్ని ఆదా చేసే ఉపకరణాలను వినియోగించాలని కోరారు. సహజ వనరులను కాపాడుతూ పర్యావరణహిత జీవన విధానాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. చిన్నచిన్న మార్పులతోనే ఇంధనాన్ని ఆదా చేసి పర్యావరణాన్ని కాపాడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జానకిరెడ్డి, సాంఖిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు అఖిలేష్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలిత దేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చిలప్‌చెడ్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి



చిలప్‌చెడ్, నవంబర్ 2 (జనంసాక్షి) : లోటు వర్షపాతం, వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని మండల రైతులు కోరారు. చిలప్‌చెడ్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేల చొప్పున పంట నష్టపరిహారం అందించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండల పరిధిలోని గౌతపూర్, మంగళ్‌పల్లి, రాందాస్‌పల్లి, సోమక్కపేట, రహీంగూడ, శిలాంపల్లి, జగ్గంపేట, గంగారం తండా, ఫైజాబాద్ గ్రామాలతో పాటు పలు గ్రామాలు, తండాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు చేసిన వరి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టి, అప్పులు చేసి వ్యవసాయం చేసిన రైతులకు ఆశించిన దిగుబడి రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిపోయిన వరి పంటలను పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరారు. నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చిలప్‌చెడ్‌ను కరువు మండలంగా ప్రకటించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాలని కోరారు. ఎకరాకు రూ.35 వేల చొప్పున పరిహారం అందించడంతో పాటు, రైతులకు వర్తించే ప్రభుత్వ సహాయ పథకాలను త్వరితగతిన అమలు చేసి తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన వారికి న్యాయం చేయాలి

- సామాజిక కార్యకర్త వేల్పుల శంకర్



కోహెడ, నవంబర్ 2 (జనంసాక్షి) : తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో మండలంలో రాజకీయ పక్షపాతం చోటుచేసుకుంటోందని, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి, రాజకీయ పలుకుబడి కలిగినవారికే ఇళ్ల మంజూరులో ప్రాధాన్యత ఇస్తున్నారని ఎస్సి, ఎస్టీ, బీసీ మైనారిటీ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు డా. వేల్పుల శంకర్ ఆరోపించారు. నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలు, రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదలు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తుంటే, ఇప్పటికే ఇళ్లు ఉన్నవారికి, ఆర్థికంగా స్థిరత్వం ఉన్న వారికి, కార్లు, ట్రాక్టర్లు భూస్వాములకు పెత్తందారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు రాజకీయ పార్టీల సొంత ఆస్తులు కావు. ప్రజలందరూ కడుతున్న పన్నుల నుంచే ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అలాంటప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి కేవలం ఒక రాజకీయ పార్టీకి చెందిన వారికే కేటాయించడం చాలా విడ్డూరమని ఆయన అన్నారు.నిజంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని, క్షేత్రస్థాయిలో అధికారులు స్వయంగా సర్వే నిర్వహించి, లబ్ధిదారుల ఇళ్ల పరిస్థితి, ఆర్థిక స్థితిగతులను పరిశీలించి, అర్హత ఆధారంగా ఇళ్లు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజకీయ సిఫార్సులు, పార్టీ అనుబంధాలు, నాయకుల పలుకుబడి కాకుండా నిరుపేదరికమే లబ్ధిదారుల ఎంపికకు ప్రామాణికం కావాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో డా. వెల్పుల శంకర్ ఆధ్వర్యంలో 30 మందికి పైగా బాధితులు, స్థానికులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఇల్లు లేని అసలైన భాధితులు పాల్గొన్నారు.

రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలి



అల్లాదుర్గం నవంబర్ 2 (జనంసాక్షి) : మండల పరిధిలోని గడి పెద్దాపూర్ గ్రామ పంచాయతీకి వెంటనే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ప్రజావాణిలో అధికారులకు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత ఆరు నెలలుగా గ్రామ పంచాయతీలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారని, దీంతో గ్రామ ప్రజలు పంచాయతీకి సంబంధించిన వివిధ పనుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గడి పెద్దాపూర్ ఒక మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో ప్రజలకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలు, ధృవీకరణ పత్రాలు, పంచాయతీ రికార్డులు, పారిశుధ్యం, గ్రామ అభివృద్ధి పనులు, ఇతర ప్రభుత్వ సేవలు సకాలంలో అందాల్సిన అవసరం ఉందన్నారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం వల్ల ప్రజలకు అవసరమైన సేవలు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, సకాలంలో అందించడంతో పాటు గ్రామ పంచాయతీ పరిపాలన సజావుగా సాగాలంటే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి నియామకం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ సయ్యద్ బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు కృష్ణా గౌడ్,పవన్, ముదిరాజ్ , విజయ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

హైదరాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- మొగుళ్ళపల్లి మండలంలో విషాదం
- బైక్ పై వెళ్తున్న స్టూడెంట్ లను మరో బైక్ అతివేగంతో ఢీకొట్టడంతో ఒకరు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- మృతుడు కొర్కిశాల మాజీ సర్పంచ్ దానవేణి రాములు-అఖిల దంపతుల కుమారుడు



మొగుళ్లపల్లి (జనంసాక్షి) : ఆదివారం రాత్రి హైద్రాబాదులో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాల, బద్దంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు హైద్రాబాద్ లోని మల్లారెడ్డి కాలేజీలో బీటెక్ చదువుతున్నారు. కాగా ఆదివారం రాత్రి ఆ ఇద్దరు స్టూడెంట్స్ బైక్ పై వెళ్తుండగా..వెనుక నుండి అతివేగంతో వచ్చిన మరో బైక్..స్టూడెంట్స్ వెళ్తున్న బైక్ ను ఢీకొట్టడంతో కొర్కిశాల గ్రామ మాజీ సర్పంచ్ దానవేణి రాములు-అఖిల దంపతుల కుమారుడు యశ్వంత్ స్టూడెంట్ తల పగిలి రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. బద్దంపల్లి గ్రామానికి చెందిన మరో స్టూడెంట్ జిల్లెల రాహుల్ అనే స్టూడెంట్ కు తీవ్ర గాయాలు కావడంతో..హైద్రాబాదులోని ఒక ప్రైవేట్ హాస్పటల్ కు తరలించగా..చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనతో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

- 30 ఏండ్లుగా నివసిస్తున్న పేదలకు పక్కా ఇండ్లు కట్టించాలి
- పేదల గుడిసెలను కూల్చుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి
- ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత



హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 2 (జనంసాక్షి) : వైఎస్సార్ నగర్ గుడిసెవాసులు, నిరుపేదలకు పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు నిర్మించాలనే డిమాండ్‌తో సోమవారం రోజున బీఆర్ఎస్ పార్టీ, సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ మాజీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలని, పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నడిమాండ్‌తో చేపట్టిన ర్యాలీ కాజీపేట ఎమ్మార్వో కార్యాలయానికి రాగా... పోలీసులు అడ్డుకున్నారు. దీంతో మాజీ పార్లమెంట్ సభ్యులు వినోద్ కుమార్ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ పోలీసులతో వాగ్వాదం జరిగింది. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఉన్న రోడ్డుపై బైఠాయించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వైఎస్సార్ నగర్ గుడిసెవాసులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం నుంచి బయటకు వచ్చి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల వద్దకు రాగా... వినతిపత్రం అందజేశారు. పేదలకు అండగా నిలివాలని, వైఎస్సార్ నగర్ భూ వివాదంపై సమగ్ర విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు నార్లగిరి రమేష్, మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగ రావు, సోదా కిరణ్, తండమల్ల వేణు, జోరిక రమేష్, ఉడతల సారంగపాణి, వద్దిరాజ్ గణేష్, మేకల బాబురావు, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, రంజిత్, పున్నం చందర్, దువ్వ కనకరాజు, కోటిలింగం, మనోజ్, కొండ శ్రీను, ఖలీల్, ఆర్టీఏ మాజీ మెంబర్ కాటాపూర్ రాజు, సీనియర్ నాయకులు సుంచు కృష్ణ, రామ్మూర్తి, మర్యాల కృష్ణ, నయీంఖుబేర్, అష్టల్, యాదగిరి, రఘు, ప్రభాకర్, ఎస్కే మహమూద్, శ్రీకాంత్ చారి, రాబర్ట్, బాచి, రామ్‌చందర్, కోండ్ర శంకర్, బరిగెల వినయ్, శ్రీను, రాజ్‌కుమార్, విజయ్, కిట్టు, శ్రీనాథ్, పాము రాజేష్, సుబ్బు, వినీల్ రావు, వీరస్వామి, లీగల్ సెల్ బాధ్యులు నాయిని రవి, వైఎస్సార్ గుడిసెవాసులు, రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటల పరిశీలన

- కరువు సహాయక చర్యలు చేపట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి



బచ్చన్నపేట (జనంసాక్షి) : బచ్చన్నపేట మండలం నక్కవానిగూడెం బచ్చన్నపేట గ్రామాలలో సిపిఎం పార్టీ బచ్చన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో ఎండిపోయిన వరి పత్తి మొక్కజొన్న పంటలను సోమవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఏలినో ప్రభావంతో వర్షాభావ ప్రభావంతో వేసిన వరి పత్తి మొక్కజొన్న ఎండిపోవడం జరిగిందని పత్తి మొక్కజొన్న పంటలకు నష్టపరిహారం 50 వేల రూపాయలు అలాగే వరి పంటకు 30 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని జనగామ జిల్లాలో బచ్చన్నపేట మండలంను కరువుమండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టి మండల రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే యాసాంగి వరి పంటలు వేయొద్దని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రైతాంగానికి ప్రత్యామ్నాయ పంటలు విత్తనాలు అందుబాటులో ఉంచకుండా వరి పంటలు వేయవద్దని చెప్పడం సరికాదని అన్నారు. రైతాంగానికి ఎకరానికి 20వేల చొప్పున ఇవ్వాలని రైతు బంధు ఎకరానికి 12 000 వేలు రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, మండల నాయకులు రామగళ్ళ అశోక్, బోడ పట్ల బాలరాజు, కంత్రి ఐలయ్య, దండుగుల మురళీకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు యువ ఆపద మిత్రులు

- వరంగల్ పోలీస్ కమిషనర్
- 4వ బెటాలియన్ లో ముగిసిన విపత్తు నిర్వహణ శిక్షణా తరగతులు
- కమాండెంట్ ఎల్.ఎన్.వి.ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం



వరంగల్ ఎంజీఎం, నవంబర్ 2 (జనంసాక్షి): ప్రకృతి వైపరీత్యాలు మరియు అత్యవసర విపత్కర పరిస్థితులు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు యువ ఆపద మిత్రులు పూర్తిగా సిద్ధమయ్యారని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐపిఎస్ కొనియాడారు. వరంగల్ మామునూరులోని 4వ బెటాలియన్లో జరిగిన యువ ఆపద మిత్రుల ప్రత్యేక విపత్తు నిర్వహణ శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. 4వ బెటాలియన్ కమాండెంట్ ఎల్.ఎన్.వి.ఎస్. శ్రీనివాసరావు ప్రత్యక్ష పర్యవేక్షణ మరియు ఆధ్వర్యంలో ఈ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత శిక్షణ పూర్తి చేసుకున్న వాలంటీర్లను అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విపత్తులు సంభవించినప్పుడు అధికారిక రెస్పాన్స్ టీమ్‌లు వచ్చేలోపు, స్థానికంగా ఉండే ఆపద మిత్రులు అందించే సేవలు ఎంతో విలువైనవని, అవి ఎందరో ప్రాణాలను నిలబెడతాయని తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో ధైర్యంగా ముందడుగు వేసేలా యువతను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. 4వ బెటాలియన్ కమాండెంట్ ఎల్ఎన్వివిఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బెటాలియన్‌లో వాలంటీర్లకు అత్యంత కఠినమైన, క్షేత్రస్థాయి ప్రమాణాలతో కూడిన రెస్పాన్స్ శిక్షణను అందించినట్లు పేర్కొన్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి సమయాల్లో వాటర్ రెస్క్యూ, రోప్ రెస్క్యూ, ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్), సిపిఆర్ వంటి అంశాలపై నిపుణులచే ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చామని వివరించారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన వాలంటీర్లకు పోలీస్ కమిషనర్, కమాండెంట్ శ్రీనివాసరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు, ఎమర్జెన్సీ రెస్పాండర్ కిట్లను అందజేశారు.

చిల్లర కాంటాలతో పత్తి రైతుల దోపిడీ

- పత్తి ధరల వ్యత్యాసంతో రైతులకు తీవ్ర నష్టం
- మార్కెట్లో వే బ్రిడ్జిలు పనిచేయకపోవడం సిగ్గుచేటు..
- పత్తి క్వింటా 12వేల రూపాయల మద్దతు ధర ప్రకటించాలి..
- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్..



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 2 (జనం సాక్షి): గ్రామాల్లో చిల్లర కాంటాలను అరికట్టి, మార్కెట్లో ధరల వ్యత్యాసాన్ని తగ్గించి పత్తి పండించిన రైతులను నష్టపోకుండా చర్యలు చేపట్టాలని అఖిలభారత రైతు సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏనుమాముల మార్కెట్లో పత్తి క్వింటాకు 12 వేల రూపాయల మద్దతు ధర ప్రకటించాలన్నారు. అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రతినిధి బృందం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ సందర్శించి మార్కెట్లో రైతులు తీసుకువచ్చిన పత్తి ధరలు రైతుల ఇబ్బందులు జరుగుతున్న మోసాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా పత్తి పంట విస్తీర్ణం దిగుబడి తగ్గిందని అదే కోవలో రాష్ట్రంలో 49 లక్షల ఎకరాలు పత్తి పంట వేసిన ఎకరానికి నాలుగు ఐదు క్వింటాలకు మించి ఉత్పత్తి రావడంలేదని ఇలాంటి పరిస్థితుల్లో పత్తికి మంచి డిమాండ్ ఏర్పడిందని ఇలాంటి పరిస్థితుల్లో పత్తి ధర పెరగాల్సింది పోయి తగ్గించుకుంటూ వస్తున్నారని అన్యాయమని అన్నారు. మరోవైపు ఆసియాలోనే అతిపెద్ద రెండో మార్కెట్ ఎనుమాములలో ఈ సీజన్లో ఇతర మార్కెట్లలో పోల్చితే ఒక్కసారి కూడా హై రేట్ పలకకపోవడం దారుణం అన్నారు. జెండా పాట పేరుతో కొద్దిమంది రైతుల పత్తికి జెండా పాట వర్తింపజేసి మిగతా రైతాంగానికి క్వింటాకు ఐదు నుంచి 600 వరకు తగ్గించి కొనుగోలు చేయడం అన్యాయం అన్నారు. మార్కెట్లో 4 వే బ్రిడ్జి కాంటాలు ఉన్న పనిచేయకపోవడం దేనికి సంకేతం అన్నారు. లూజుగా వాహనాల్లో తీసుకువచ్చే పత్తిని మార్కెట్లో ధర నిర్ణయించినప్పటికీ బయట తూకం వేయడం మార్కెట్లో నిర్ణయించడం తగ్గించడం దారుణం అన్నారు. గ్రామాల్లో మధ్య దళారులు పత్తి రైతులను మభ్యపెట్టి మార్కెట్ ధర కన్నా తక్కువకు పత్తిని కొనుగోలు చేస్తూ తూకంలో మోసం చేస్తూ దోచుకుంటున్న మార్కెట్ యంత్రాంగం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా తక్షణమే గ్రామాల్లో చిల్లర కాంటాలను అరికట్టి ధరల వ్యత్యాసాన్ని తొలగించి జెండా పాట రైతులందరికీ వర్తింపజేసి మార్కెట్లో రైతులకు కార్మికులకు నాణ్యమైన ఉచిత భోజనాన్ని అందించి కనీస మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించిన పత్తికి క్వింటా 12వేల రూపాయల కనీస మద్దతు ధర నిర్ణయించి రైతులను ఆదుకోవాలని కోరారు.

అనంతరం సమస్యలతో కూడిన మెమోరాండాన్ని మార్కెట్ చైర్మన్ ఎర్ర ప్రియాంక, మార్కెట్ కార్యదర్శి నిషాని శ్రీనివాస్ లకు ఇచ్చి సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి జిల్లా కార్యదర్శి కుసుంబ బాబురావు రాష్ట్ర నాయకులు సింగతి సాంబయ్య జిల్లా కోశాధికారి సింగతి మల్లికార్జున్ ప్రజా సంఘాల రాష్ట్ర జిల్లా నాయకులు వంగల రాగసుధ గడ్డం నాగార్జున ముక్కెర రామస్వామి మాస్ సావిత్రి మాలి ప్రభాకర్ అప్పనపురి నర్సయ్య ఏఐకేఎఫ్ జిల్లా నాయకులు ఐతం నాగేష్ మహమ్మద్ ఉస్మాన్ మంద భద్రయ్య గోనె రామచంద్రు రైతులు పాల్గొన్నారు.

గ్రావెల్ అనుమతుల కోసం ఆన్‌లైన్ విధానం ప్రారంభం

- ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ పర్మిషన్ పోర్టల్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 2 (జనం సాక్షి) :అక్రమ మైనింగ్ కు అడ్డుకట్ట వేయడంతో పాటు మట్టి (గ్రావెల్) తవ్వకాలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానంను అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో నూతనంగా పోర్టల్ ను తీసుకువచ్చినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన సమీకృత గ్రావెల్ (మట్టి) నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం) పోర్టల్‌ను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం అమలు గురించిన వివరాలను అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఈ విధానం ద్వారా పౌరులు తమ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా సులభంగా లాగిన్ అయి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తులు సంబంధిత అధికారులకు చేరతాయని, రెవెన్యూ భూములకు సంబంధించిన అనుమతులను పరిశీలించి మూడు నుంచి ఐదు రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డిఆర్ఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, జి డబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, సి సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్,సీజీజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఈడీఎం శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కటాక్షపూర్ చెరువును మింగేస్తున్న భూ బకాసురులు

- ప్రజావాణిలో నాయబ్ తహసీల్దార్ కు ఫిర్యాదు, సర్వే చేసి హద్దులు వేయాలని డిమాండ్



ఆత్మకూరు, నవంబర్ 2 (జనం సాక్షి): మండలంలోని కటాక్షపూర్ చేరువు శిఖం భూమి కబ్జాకు గురవుతోంది. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న చేరువు శిఖం భూమిపై కొందరు భూ బకాసురుల కన్ను పడిందని, అధికారుల అండదండలతో యథేచ్ఛగా ఆక్రమించేందుకు తెగబడుతున్నారని హౌజుబుజుర్గు గ్రామ అఖిల పక్షం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరు మండల ప్రజావాణి కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ మమతకు అఖిల పక్షం నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కటాక్షపూర్ చేరువు మండలంలోనే పెద్ద చేరువు అని, ఈ చేరువుపై ఆధారపడి చుట్టుపక్కల రైతులు వందల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. అలాంటి చేరువు శిఖం భూమిని కొందరు పట్టా భూమిగా మార్చేసి కొట్టేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చేరువులోకి దూసుకెళ్లి హద్దులు చెరిపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెవెన్యూ యంత్రాంగం తక్షణమే స్పందించి కటాక్షపూర్ చేరువు శిఖం భూమిని కటాక్షపూర్ శివారు వరకు పూర్తిస్థాయిలో సర్వే చేయాలని డిమాండ్ చేశారు. హద్దులు నిర్ణయించి, హద్దు రాళ్లు వేసి శాశ్వతంగా చేరువు భూమిని కాపాడాలని కోరారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో అఖిల పక్షం నాయకులు సయ్యద్ మౌల , ఎండి గఫూర్, నీల రవీందర్ ,సయ్యద్ మౌల ,మొగిలిచర్ల వీరస్వామి, ఎండి గఫూర్, షేక్ ఇమామ్, మార్క రజిని కుమార్, బోడిగే రాంబాబు,మండల కుమారస్వామి, గుండె బోయిన బాలకృష్ణ,షేక్ హుస్సేన్, సయ్యద్ బషీర్, షేక్ సలీం పాషా, షేక్ కమాల్, ఉప్పరి మొగిలి, సయ్యద్ వలి, బొల్ల పెళ్లి సురేష్,హౌజ్ బుజుర్గు, కటాక్షపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ పనులను వేగవంతం చేయాలి

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



మావల నవంబర్ 03 (జనంసాక్షి) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతి, ఫారం- 6,7,8 దరఖాస్తుల పెండింగ్, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రూ, తదితర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ... ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, ఎస్ఐఆర్‌లో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనర్హుల విషయంలో తగిన ఆధారాలతో రికార్డులు భద్రపరచాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం జిల్లాలో 74 మందికి మాత్రమే హియరింగ్ నిర్వహించాల్సి ఉందని, మిగిలిన మ్యాపింగ్ తప్పులను త్వరలోనే సరిదిద్దుతామని తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో దరఖాస్తులను త్వరలోనే పూర్తిగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షణ అధికారి నలంద ప్రియ, నాయబ్ తహశీల్దార్ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 2, (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలు, వంటగది, భోజనశాల, పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న తరగతి గదుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

- జిల్లా ఎస్పీ నితికా పంత్



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02(జనంసాక్షి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని,వాటికి చట్టపరమైన పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్పీ కి నేరుగా వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎస్పీ సావధానంగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా, నిర్దీత సమయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ అందిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.

ఒకే కుటుంబం చేతిలో రెండు రేషన్ షాపులు

- ప్రజలకు తప్పని ఇబ్బందులు!



నస్పూర్ (జనంసాక్షి): రేషన్ షాపుల నిర్వహణలో నెలకొన్న సమస్యలతో ఆర్అండ్ఆర్ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని 24వ డివిజన్ కార్పొరేటర్ బొద్దు స్వప్న తిరుపతి జిల్లా కలెక్టర్‌ను కోరారు.ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం ఆర్అండ్ఆర్ గ్రామ పరిధిలోని రేషన్ షాపు నంబర్ 15,24వ వార్డు పరిధిలో ఉండగా,రేషన్ షాపు నంబర్ 16 సీతారాంపల్లి 9వ వార్డు పరిధిలో ఉన్నదని,ఈ రెండు రేషన్ షాపుల మధ్య సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉండటంతో పాటు,వాటి నిర్వహణ విషయంలోనూ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.రెండు రేషన్ షాపుల నిర్వహణ నర్సిని రాజేంద్రప్రసాద్ అతని భార్య విజయలక్ష్మి చేతిలో ఉండటంతో ప్రజలకు సకాలంలో రేషన్ సరుకులు అందడంలో సమస్యలు తలెత్తుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు,మహిళలు,ఇతర లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.దాదాపు 40 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి,రేషన్ షాపుల నిర్వహణను సమీక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా రేషన్ సరుకులు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఒకే కుటుంబానికి కాకుండా నిరుద్యోగ యువతకు షాపు ను కేటాయించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
03 నవంబర్ 2026

యువతను మత్తు పదార్థాల వ్యసనాలకు దూరంగా ఉంచాలి

● జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 2 (జనం సాక్షి) : యువతను పొగాకు, మాదక ద్రవ్యాలు, తదితర వ్యసనాలకు దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ – పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి 60 రోజుల పాటు పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో పొగాకు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు, యువత వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా వారికి అవగాహన కల్పించాలని, పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించాలని అన్నారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం పొగాకు రహిత యువత ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని తెలిపారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక సమస్యలపై విద్యార్థులకు వివరించాలని, వ్యసనాలకు గురైన వారిని గుర్తించి వారికి సరైన కౌన్సెలింగ్, వైద్య చికిత్స అందించాలని అన్నారు. అవసరమైన వారికి వ్యసన విముక్తి కేంద్రాల ద్వారా పునరావాస సేవలు కల్పించాలని సూచించారు. వ్యసనాల నిర్మూలనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థల యాజమాన్యాలు, ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. యువత దేశ భవిష్యత్తు అని, వారిని వ్యసనాల నుంచి కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి – ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపండి, వ్యసనాలకు బానిసలు కావద్దు -- జీవితాన్ని ఆనందంగా గడపండి అనే నినాదాలతో యువతలో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటామని, ఇతరులను కూడా పొగాకు, మత్తు పదార్థాల వినియోగం నుంచి దూరంగా అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్, జిల్లా అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ 100 అడుగులకే పరిమితం చేయాలి

● ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు నాయకుల వినతి



రాజేంద్రనగర్, నవంబర్ 2 (జనంసాక్షి) : కోకాపేట పైప్‌లైన్ రోడ్డు విస్తరణ విషయంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కోకాపేట డివిజన్ నాయకులు ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిసిసి ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు గోపాల విజయ్ బాబు, గంగిడి శివారెడ్డి, సీనియర్ నాయకులు రాజ్ కుమార్ లు మాట్లాడుతూ ఈ పైప్ న్ రోడ్డును తొలుత 100 అడుగుల వెడల్పుతో నిర్మించాలనే ప్రతిపాదన ఉండగా, ప్రస్తుతం దానిని 120 అడుగులకు పెంచారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. 120 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడితే అనేక ఇళ్లు ప్రభావితమై స్థానికులు నష్టపోయే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో మొదట ప్రతిపాదించిన విధంగానే రోడ్డును 100 అడుగులకే పరిమితం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తానని, స్థానికులకు నష్టం కలిగించే విధంగా చర్యలు చేపట్టబోమని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

● అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు
● జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బాల్ రాజ్



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 2 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లాలో ని రైస్ మిల్లులు, హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపా రులు ప్రభుత్వం నిర్ణయించి న ధరల ప్రకారమే బియ్యా న్ని విక్రయించాలని నారా యణపేట జిల్లా పౌరసరఫ రాల శాఖ అధికారులు సూచించారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం బిపిటి,కే ఎన్ ఏంరకం బియ్యం కిలో రూ.66, ఆర్ ఎన్ ఆర్, తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, ఎచ్ ఎం టి ,జే ఎస్ ఆర్,రకం బియ్యం కిలో రూ.79గా నిర్దేశించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సోమవారం జిల్లా పౌరసర ఫరాల అధికారి బాలరాజు, జిల్లా మేనేజర్ సైదులు, తహసీల్దార్లు, కొలతల శాఖ అధికారులు, పౌరసరఫ రాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జిల్లాలోని పలు రైస్ మిల్లులు, హోల్‌సేల్/ రిటైల్ బియ్యం వ్యాపార దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బియ్యం విక్రయ ధరలను, తూకం, కొలతలను పరిశీలించారు. జిల్లాలో సరి పడా బియ్యం నిల్వలు ఉన్నాయని, బియ్యం కొరత లేదని ఈ సందర్భం గా అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే బియ్యాన్ని విక్రయించాలని, నిర్ణీత ధరలకు మించి విక్రయించ కుండా సంబంధిత వ్యాపా రులకు అధికారులు ఆదేశా లు జారీ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక బోర్డులను ప్రతి రైస్ మిల్లు, హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపార దుకాణాల్లో వినియోగదా రులకు స్పష్టంగా కనిపించే విధంగా ఏర్పాటు చేయాల ని సూచించారు.ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించడం, తూకం,కొలతల్లో అక్రమా లకు పాల్పడటం వంటి ఉల్లంఘనలకు పాల్పడి నట్లు గుర్తిస్తే సంబంధిత వ్యాపారులపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయడంతో పాటు తగిన చర్యలు తీసుకోవడం జరు గుతుందని అధికారులు హెచ్చరించారు.వినియోగదారులు కూడా బియ్యం కొనుగోలు సమయంలో నిర్దేశిత ధరలను తెలుసు కొని, అధిక ధరలు వసూలు చేసినా లేదా తూకంలో మోసాలకు పాల్పడినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.

ప్రతి గింజ కొనుగోలే లక్ష్యం

● ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం
● తుఫాన్ల నేపథ్యంలో ధాన్యం తడవకుండా అప్రమత్తంగా ఉండాలి
● పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్



బెజ్జంకి, నవంబర్ 2 (జనం సాక్షి) : మండలంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో ముత్తన్నపేట, వీరాపూర్, తోటపల్లి గ్రామాల్లో, ఐకేపీ ఆధ్వర్యంలో బెజ్జంకి క్రాసింగ్,గుగ్గిళ్ల,రేగులపల్లి,చిలాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ ప్రారంభించి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని,ధాన్యం తడవకుండా టార్పాలిన్లతో కప్పి సురక్షిత ప్రాంతాల్లోనే నిల్వ చేసుకోవాలని సూచించారు.కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.మిల్లుల కేటాయింపు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని,రైతులు ధాన్యంలోని తాలు,చెత్తను తొలగించి శు భ్రపరిచిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నిర్వాహకులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శిరీష అనిల్,వైస్ చైర్మన్ పర్శ సంతోష్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్,మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గుడెల్లి శ్రీకాంత్,సర్పంచులు గుర్రాల అనురాధ,బాల్ నరసింహారెడ్డి,జట్టి రమేష్,గాజ రవళి శ్రీనివాస్,జంగిలి లక్ష్మీ తిరుపతి,గండికోట సురేష్,శానగొండ స్వరూప,చిలుమల సతీష్,అశ్విని శ్రీనివాస్,మల్లయ్య,చెప్యాల శ్రీనివాస్,బైరా సంతోష్,కత్తి రమేష్,కుక్కల రాములు,కుంట హరికృష్ణ,జిల లింగం,రామకృష్ణ రెడ్డి,రామచంద్రం తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

చర్లగూడెం నిర్వాసితులకు పునరావాసం ఎప్పుడిస్తారు..?

● ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోయిన బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలి
● ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి
● రాంరెడ్డిపల్లి పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం



మర్రిగూడ, నవంబర్ 2 (జనం సాక్షి) : నల్లగొండ జిల్లా మర్రిగూడ శివన్నగూడెం (చర్లగూడెం) ప్రాజెక్టు నిర్మాణంతో సర్వస్వం కోల్పోయిన చర్లగూడెం ముంపు బాధితులకు తక్షణమే పునరావాసం కల్పించి న్యాయం చేయాలని రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చర్లగూడెం భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించిందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం గ్రామాన్ని, ఇళ్లను వదులుకున్న బాధితులకు ఇప్పటికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందకపోవడం ఆవేదనకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన నిర్వాసితులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయడంతో పాటు పునరావాస స్థలాలు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎరుకల నిరంజన్, వల్లపు హైమ భాస్కర్, బడేటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి భవిష్యత్తుకు ఇంకుడు గుంతలే ఆధారం

● భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి
● బోర్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి
● బీజేపీ లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్

బోడుప్పల్, నవంబర్ 2 (జనంసాక్షి) : భూగర్భ జలాల పరిరక్షణతో పాటు భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా బోర్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని బీజేపీ లేబర్ సెల్ మేడ్చల్ జిల్లా రూరల్ కన్వీనర్ దాసరి మహేష్ యాదవ్ కోరారు.ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బోడుప్పల్,మేడిపల్లి పరిసర ప్రాంతాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని ఫలితంగా భూగర్భ జలమట్టాలు తగ్గిపోయి ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని వినతిపత్రంలో పేర్కొన్నారు.ప్రజల తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో బోర్లు ఏర్పాటు చేసినప్పటికీ వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టకపోవడంతో విలువైన వర్షపు నీరు డ్రైనేజీల ద్వారా వృథాగా పోతోందని తెలిపారు.ప్రభుత్వ బోర్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకించి భూగర్భ జలమట్టాలను పెంచవచ్చని, తద్వారా బోర్లలో నీటి లభ్యత మెరుగుపడటంతో పాటు భవిష్యత్తులో తాగునీటి కొరతను నివారించవచ్చని వివరించారు.పర్యావరణ పరిరక్షణకు,నీటి వనరుల స్థిరమైన వినియోగానికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని ప్రభుత్వ బోర్లను గుర్తించి వాటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని,బోర్ల పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నేరుగా ఇంకుడు గుంతల్లోకి చేరేలా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలని కోరారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను కోరారు.

వీధి వ్యాపార కార్యకలాపాల క్రమబద్ధీకరణే ధ్యేయం



శేరిలింగంపల్లి, నవంబర్ 2 (జనంసాక్షి) : సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి వ్యాపార కార్యకలాపాల నిర్వహణ క్రమబద్ధీకరణ ధ్యేయంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగరం ఉన్నట్లు సిఎంసి ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం మియాపూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో సర్కిల్ పరిధిలోని వీధి వ్యాపారులతో కలిపి టౌన్ వెండింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప కమిషనర్ శ్రీనివాస్, సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ విభాగం పోలీస్ అధికారులు, సర్కిల్ ప్రాజెక్ట్ అధికారి, టౌన్ వెండింగ్ కమిటీ(టివికె) ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సి అధికారులు మాట్లాడుతూ వీధి వ్యాపారులంతా నిరుపేద వర్గాలకు చెందిన వారిని, వారి జీవితం సజావుగా సాగేలా, వ్యాపార భద్రతకు తగిన భరోసాను కల్పించే క్రమంలో వీధి వ్యాపార కార్యకలాపాల క్రమబద్ధీకరణకు సీఎం సి నడుం బిగించిందన్నారు. వ్యాపార వ్యాపార నిర్వహణ విధి విధానాలు, ట్రాఫిక్ అంతరాయానికి వీధి వ్యాపారం కారణభూతం కాకూడదనే ప్రధాన లక్ష్యం నెరవేర్చడానికి, సామాన్య ప్రజలు సైతం రద్దీతో ఇబ్బందులు పడకుండా ఒక క్రమ పద్ధతిలో వ్యాపారం సజావుగా సాగేలా చేపట్టాల్సిన చర్యల నిమిత్తం టౌన్ వెండింగ్ కమిటీ సమావేశంలో కూలంక సంఘా చర్చించడం జరిగిందన్నారు. త్వరలోనే ఒక నిర్దిష్ట కార్యరూపాన్ని తీసుకొని వీధి వ్యాపార కార్యకలాపాల క్రమబద్ధీకరణను చేపడుతూ అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

గోళ్లపాడులో కాంగ్రెస్‌కు మరింత బలం

● బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి 30 కుటుంబాలు
● మంత్రి పొంగులేటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై చేరిక
● పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన తుంబూరు దయాకర్‌రెడ్డి



ఖమ్మం రూరల్, నవంబర్ 2 (జనం సాక్షి) : ఖమ్మం రూరల్ మండలం లోని గోళ్లపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరింది. బీఆర్ఎస్‌కు చెందిన 30 కుటుంబాలు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సోమవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ మంత్రి పొంగులేటి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లతో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందన్నారు. గోళ్లపాడు గ్రామంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారుల విస్తరణ, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు మంత్రి పొంగులేటి చొరవతో పూర్తయ్యాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఆటో యూనియన్ అధ్యక్షుడు గడ్డమీద ఉపేందర్, మాజీ ఉపసర్పంచ్ దొంతిసర్పు రాంబాబు, మాజీ వార్డు సభ్యుడు చీకటిమళ్ల లక్ష్మీనారాయణ, గౌడ సంఘం నాయకుడు మడికంటి శ్రీను, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రుద్ర మధు, ఎస్సీ నాయకుడు పొన్నెకంటి రాంబాబు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మండల నాయకులు మద్ది వీరారెడ్డి, మద్ది కిషోర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రుద్ర ఉపేందర్, తేజావత్ పంతులు నాయక్, మద్ది వెంకటరెడ్డి, మందటి వెంకటరెడ్డి, శాబాదు మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

● మాజీ మంత్రి పువ్వాడ అజయ్



ఖమ్మం, నవంబర్ 2 (జనం సాక్షి) : పార్టీ ఆదేశాల మేరకు గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకుని వేగవంతం చేయాలని మాజీ మంత్రి శ్రీ పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం నియోజకవర్గంలో ఖానాపురం హవేలి, రఘునాథపాలెం మండలంలో నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి డివిజన్ ప్రతి గ్రామంలో నమోదు చేసిన పట్టభద్రుల ఓట్లను రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ గారు ప్రత్యేకంగా డిజైన్ చేయించిన 'పార్టీ యాప్' ద్వారా మన ఓటర్ల నమోదు వివరాలను అప్‌లోడ్ చేయ్యాలన్నారు. పట్టభద్రుల ఓటర్ నమోదు కోసం గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఓటర్ ఐడీ కార్డ్, మొబైల్ నంబర్ మరియు అప్లికేషన్ ఫారమ్‌లను నింపి నమోదు చేయించాలి. గ్రామాల్లో వేలాది మంది పట్టభద్రులు ఉన్నారు. నాయకులు నేరుగా ఇళ్లకు వెళ్లి, అర్హులైన ప్రతీ పట్టభద్రుడి వివరాలు సేకరించి ఓటరుగా నమోదు చేయించాలి. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కేవలం కాంగ్రెస్ ప్రభుత్వ సమర్థత లేకపోవడం వల్ల వచ్చిన "చేతకానితనపు కరువు" అని దుయ్యబట్టారు. వచ్చే రెండేళ్లలో కాంగ్రెస్ వైఫల్యాలు ఇంకా స్పష్టంగా బయటపడతాయని, ప్రజల మైండ్ సెట్ కూడా మారిపోతుందని స్పష్టం చేశారు.బిఆర్ఎస్ కేడర్ అంతా అలర్ట్‌గా ఉండి నిరంతరం రాజకీయ కార్యకలాపాలు నిర్వహించాలి. పిలుపునిచ్చిన వెంటనే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని, ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని కోరారు. పార్టీ బలాన్ని పెంచేందుకు, రాబోయే ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు ఈ ఓటర్ నమోదు అత్యంత కీలకమని, నాయకులు అలసత్వం వహించకుండా మిగిలిన గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు బచ్చు విజయ్ కుమార్, నాగండ్ల కోటేశ్వరరావు, దండా జ్యోతి రెడ్డి,కూరాకుల వలరాజు, కొనకంచి ప్రసాద్, వల్లభనేని రామారావు,వీరు నాయక్, మద్దినేని వెంకటరమణ, గుత్తా రవి, హరిప్రసాద్,పిన్ని కోటేశ్వరరావు, మెంటం రామారావు,లక్ష్మణ్ నాయక్, యాస రామారావు,పెంట్యా,శంకర్,రాజా,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమైన నూతన భవనాలు

● ఈనెల 8న సీఎం చేతుల మీదుగా ప్రారంభం
● సిద్ధమైన భవన నిర్మాణ పనులు పరిశీలించిన సీఎంవో కార్యదర్శి ఎన్.శ్రీధర్



బొంరాస్‌పేట, నవంబర్ 2 (జనం సాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 7,8,9న మూడు రోజులపాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కోడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈనెల 8న నియోజకవర్గంలోని ఆయా మండలాలలో నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించనున్నారు.సోమవారం సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రా, కాడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డితో కలిసి ప్రారంభానికి సిద్ధమైన దుద్యాల పోలీస్ స్టేషన్, మండల కార్యాలయ సముదాయ భవన నిర్మాణాన్ని, బొంరాస్ పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాలను తనిఖీ చేసి, మిగిలిన పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ బస్వరాజు, గుట్టూర్, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
03.11.2026

బా'భౌ'య్..

- తప్పని వీధి కుక్కల బెడద
- ఎల్లారెడ్డి - కామారెడ్డి రోడ్డుపై వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

ఎల్లారెడ్డి జనంసాక్షి :
ఎల్లారెడ్డి – కామారెడ్డి ప్రధాన రహదారిపై వీధి కుక్కల గుంపు రోడ్డు మధ్యలోనే సంచరిస్తూ వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది.సోమవారం ఉదయం తీసిన దృశ్యాలలో దాదాపు ఎనిమిది కుక్కలు రోడ్డుపై గుంపుగా తిరుగుతూ కనిపించాయి. ఈ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో, అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చే కుక్కల వల్ల ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమా దాలకు గురయ్యే అవకాశం ఉంది.ముఖ్యంగా రాత్రి వేళల్లో, పొలం పనులకు వెళ్లే రైతులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఈ కుక్కల బెడదతో భయాందోళన కు గురవుతున్నారు. వీధి కుక్కలు వెంటపడి కరవ డం, వాహనాలను ఢీకొనడం వంటి ఘటనలు తర చూ జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత పంచాయతీ, మున్సిపల్ అది కారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.



కలెక్టరేట్లో కలకలం

మహిళ ఆత్మహత్యాయత్నం..


అడ్డుకొని విచారణ చేపట్టిన పోలీసులు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి,జనంసాక్షి:
నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సరిత అనే మహిళ జిల్లా కలెక్టరేట్ లో ఆత్మహత్యాయత్నం చేసింది.తన ఇల్లును సొంతవారే కబ్జా చేయడంతో ఈ అఘాయి త్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.రూరల్ పోలీ సులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హమా ల్వాడీలో ఉండే విజయ అనే మహిళకు ఒక చెల్లెలు ఉం ది.ఇటీవలే వారి తండ్రి మరణించాడు.అయితే ఆయన గతంలోనే అక్కాచెల్లెలికి ఇంట్లో చెరో గదిని రాసిచ్చారు. కాని తండ్రి మరణించిన అనంతరం చెల్లెలు అక్క విజ యను గెంటేసి ఇల్లు కబ్జా చేసుకుంది. దీంతో దిక్కుతోచని విజయ కలెక్టరేట్ను ఆశ్రయించింది. ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. కాని సమస్య పరిష్కారం అవుతుందో లేదోననే భయంతో విజయ మనమరాలు సరిత పురుగుల మంది తాగేందుకు యత్నించింది.గమనించిన పోలీసులు వెంటనే ఆమె దగ్గరి నుంచి పురుగుల మందు లాక్కు న్నారు. విజయను,ఆమె మనమరాలు సరితను పోలీసులు విచారిస్తున్నారు.

గ్రీన్ క్రాకర్స్‌కు సుప్రీం ఓకే..

గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చేందుకు అను మ తించాలని అధికారులను ఆదేశించింది. ఆసుపత్రులు, నర్సింగ్ హోంలు, వృద్ధాశ్రమాలు, నోటిఫైడ్ సైలెన్స్ జోన్లకు 300 మీటర్ల పరిధిలో టపాసులు కాల్చొద్దని స్పష్టం చేసింది. బాణసంచా పరిశ్రమలకు గ్రీన్ క్రాకర్ల తయారీకి మాత్రమే అనుమతి ఉందని పేర్కొంది. బేరియం కలిగిన బాణసంచా వాడకం, ఆమోదించని గ్రీన్ క్రాకర్లకు అనుమతి లేదని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ పి.బి.వరాలే ధర్మాసనం పునరుద్ఘాటించింది. అదేవిధంగా దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో అక్రమ, కాలుష్యకారక టపాసుల దిగుమతులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. గతంలో విధించినట్లుగానే.. దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో టపాసులపై పూర్తి నిషేధాన్ని నవంబర్ 9 నుంచి తిరిగి అమలు చేయాలని అక్టోబర్ 29 నాటి తమ ఉత్తర్వుల్లో పేర్కొంది.



పీఠమడి

సిరిసిల్ల కాంగ్రెస్‌లో పదవుల పంచాయితీ..!

సిరిసిల్లలోని కాంగ్రెస్ పార్టీలో పదవుల కేటాయింపు వ్యవహారం రోజు రోజుకు హాట్ టాపిక్ గా మారుతుంది.సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేస్తుండగా మరోవైపు ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో న్యాయం జరగడం లేదని అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఈ క్రమంలో తాజాగా కాంగ్రెస్ కార్యకర్త పేరిట విడుదలైన ఓ కరపత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

- ఏఎంసీ పీఠం ఎవరికి దక్కేనో..?
- కష్టపడిన కార్యకర్తలకు న్యాయం జరిగేనా..?
- నామినేటెడ్ పోస్టుల్లో పైరవీకారులకే పెద్దపీటనా..?
- సిరిసిల్లలో కాంగ్రెస్ కార్యకర్త పేరిట కరపత్రం విడుదల..

సిరిసిల్ల టౌన్ నవంబర్ 2 (జనంసాక్షి):
సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం ఈసారి ఎవరికి దక్కుతుందోననే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కీలక మైనదిగా గుర్తింపు పొంది, కోట్లాది రూపాయల లావా దేవీలు,వేలాదిమంది రైతులతో సంబంధం ఉన్న ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఎంతోమంది కాంగ్రెస్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు.గతంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఈ పదవి ఎక్కువ సార్లు అగ్ర వర్ణాలకు చెందిన నాయకులనే వరించిందనీ, కీలక పదవుల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని బీసీ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన క్రమంలోనైనా బీసీలకు ఈ పదవి దక్కుతుందా అనే చర్చ కాంగ్రెస్ కార్యకర్తల్లో గుస గుసలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం దశాబ్దాలుగా పని చేస్తున్నా కీలక పదవుల విషయంలో తమకు ప్రాధాన్యం లభించడం లేదని స్థానికంగా అధిక సంఖ్యలో ఉన్న బిసి సామాజిక వర్గాలకు చెందిన సీనియర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది.

జెండాలు మోసేది మేమైతే.. పదవులు వచ్చేది వాళ్లకా..?

పార్టీ కష్టకాలంలో అండగా నిలిచి,ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా సహకరించిన సీనియర్ కార్యకర్తలను పద వుల కేటాయింపు సమయంలో పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇతర పార్టీల నుంచి ఇటీవల కాంగ్రెస్ లో చేరిన వారికి, ఆర్థికంగా పలుకుబడి ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే చర్చ కూడా పార్టీలో సాగుతోంది. పైరవీలు చేసేవారికే పదవులు దక్కుతాయా..? పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఎప్పుడు వస్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కార్యకర్త పేరిట కరపత్రం కలకలం..

కాంగ్రెస్ కార్యకర్త పేరిట విడుదలైన కరపత్రం పార్టీలో చర్చకు మరింత ఆజ్యం పోసింది.కష్టపడ్డ కార్యకర్తలకు న్యాయం జరిగేనా..? నామినే టెడ్ పదవులు ఎవరికి.. పనిచేసిన వారికా..? పైరవీలు చేసేవారికేనా..? అంటూ అందులో ప్రశ్నలు సంధిం చారు.మళ్లీ మాజీ అమాత్యుడినే గెలిపించాలా..? లేదంటే హస్తం జెండా ఎగరాలా..?' అంటూ ప్రస్తావించడం రాజకీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కర పత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

అధిష్ఠానం నిర్ణయంపైనే ఆశలు..


రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏఎంసీ, నామినేటెడ్ పదవుల కేటాయింపులు కాంగ్రెసు కీలకంగా మారాయి. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని



పద వులు కేటాయించాలని బీసీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు కోరుతున్నారు. ఈ అంశంపై పీసీసీ, డీసీసీ నాయకత్వంతోపాటు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన కార్యకర్త లకు పదవుల్లో తగిన గుర్తింపు లభిస్తుందా..? ఏఎంసీ చైర్మన్ పీఠం బీసీలకు దక్కుతుందా..? లేక మరోసారి పాత పద్ధతే కొనసాగుతుందా..? అన్నది కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది. ప్రస్తుతం ఈ పరిణామాలు సిరిసిల్ల కాంగ్రెస్లో అంతర్గత అసంతృప్తికి అద్దం పడుతున్నాయి.ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పర్యటన తర్వాత దృష్టిని ఆకర్షించిన సిరిసిల్ల విషయంలో అధిష్ఠానం ఆచితూచి అడు గులు వేస్తున్నట్లు పరిస్థితులు కనిపిస్తున్నాయి. చివరకు నామినేటెడ్ పోస్టులు కష్ట కాలంలో పార్టీ కోసం నిబద్ధ తతో పని చేసిన వారిని వరిస్తాయో.. లేక వైరవీలు చేస్తున్న వారికి దక్కుతాయో వేచి చూడాల్సిందే మరి..!

అంతర్గాం అభివృద్ధిపై బీఆర్ఎస్ సమరశంఖం..

పెండింగ్ పనులు పూర్తి చేయాలని భారీ నిరసన దీక్ష..



- ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు..
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్..

అంతర్గాం, జనంసాక్షి :
మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భారీ నిరసన దీక్ష నిర్వహించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ దీక్షను ప్రారంభించి ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అంతర్గాం మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపట్టామని చందర్ గుర్తుచేశారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండుమూడేళ్లుగా మండలంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.

కీలక అభివృద్ధి పనులు ఎక్కడ?
మంచిర్యాల నుంచి అంతర్గాం వరకు గోదావరి వంతెన నిర్మాణం, పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఖుర్జీ భూముల పట్టాల పంపిణీ, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు వంటి కీలక పనులు పెండింగ్‌లో ఉన్నాయని చందర్ పేర్కొన్నారు. గతంలో మంజూరు చేయించిన ఈ పనులు ప్రారంభం కాకపోవడంతో మండలం అభివృద్ధిలో వెనుకబడుతోందని విమర్శించారు.

హామీలు అమలు చేయాలి:
అంతర్గాం నుంచి మంచిర్యాలకు వంతెన నిర్మాణం చేపట్టాలని, పెద్దంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని, ఖుర్జీ భూముల పట్టాలను రైతులకు అందజేయాలని, ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణాన్ని చేపట్టాలని కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అభివృద్ధిని విస్మరిస్తే చూస్తూ ఊరుకోబోమని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన దీక్షలో నడిపెల్లి మురళీధర్ రావు, మూల విజయ రెడ్డి, కౌశిక హరి, కొంకటి లక్ష్మీనారాయణ, హరీష్ రెడ్డి, మేకల సమ్మయ్య యాదవ్, మారుతీ, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి పోలీసుల రికార్డు

జిల్లాల వారీగా రాష్ట్రంలో మొదటి స్థానం..

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, జనంసాక్షి:మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లా పోలీసులు రాష్ట్రస్థాయిలో అరుదైన ఘనత సాధించారు. పోలీస్ కమిషనరేట్లను మినహాయించి జిల్లాల వారీగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ప్రత్యేక చొరవతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేస్తున్నారు.ఇన్స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ బాలరాజు, ఐదుగురు కానిస్టేబుళ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందం ప్రతి నెలా సగటున 150కి పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు రూ. 2.23 కోట్ల విలువైన 1,397 ఫోన్లను స్వాధీనం చేసుకోగా, గత 45 రోజుల్లోనే రూ. 42.24 లక్షల విలువైన 264 ఫోన్లను రికవరీ చేసింది. గత ఏడాది రూ. 3 కోట్ల విలువైన 1,834 ఫోన్లను బాధితులకు అందజేసింది.పోర్టల్ ద్వారా ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 5,678 మొబైల్ ఫోన్లను గుర్తించి, సుమారు రూ. 9.08 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక బృందాన్ని ఎస్పీ అభినందించారు.మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, సిమ్ కార్డును బ్లాక్ చేయించడంతో పాటు అఐఎఖీ పోర్టల్‌లో ఎఓఎ నంబర్‌ను బ్లాక్ చేయాలని ఎస్పీ సూచించారు. రికవరీ అయిన ఫోన్లను పొందేందుకు సంబంధిత ధ్రువ పత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ బాల రాజు (8712686114)ను సంప్రదించాలని తెలిపారు.

‘జనంసాక్షి’కి స్పందన

నిమజ్జన వ్యర్థాల తొలగించండి

అధికారులను ఆదేశించిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్

టేక్రియాల్ చెరువు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి





కామారెడ్డి ప్రతినిధి,జనంసాక్షి :కామారెడ్డి పట్టణంలోని టేక్రియాల్ చెరువులో నిమజ్జనం అనంతరం పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చెరువులో వ్యర్థాలు పేరుకుపోయి నీరు కలుషితం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. నిమజ్జన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి, చెరువు పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లలిత చిట్టిబాబు, డీఈ హన్మంత్ రావు, ఏఈ వేణు ప్రసాద్, శానిటేషన్ ఇన్‌చార్జి ప్రశాంత్, నాయకులు రాములు, సంజీవ్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన సీపీ అంబర్ కిషోర్ ఝా..



గోదావరిఖని, జనంసాక్షి :రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలకు చెందిన ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదులోని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు .ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడం, బాధితులకు సత్వర న్యాయం కల్పించడం, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొం దించడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా, ప్రజలకు అందుబాటులో ఉం టుందని భరోసా ఇచ్చారు. అదనపు డీసీపీ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గన్నేరువరం విద్యార్థులు



గన్నేరువరం, నవంబర్ 2 (జనంసాక్షి):గన్నేరువరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి ఆర్ట్స్ అండ్ కల్చరల్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నవంబర్ 2న కరీంనగర్ జిల్లా సైన్స్ మ్యూజియంలో పీఎం శ్రీ పాఠశాలల కోసం నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్ట్స్ అండ్ కల్చరల్ పోటీల్లో ఆర్ట్స్, మ్యూజిక్, డ్యాన్స్, క్రాఫ్ట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గన్నేరువరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు క్రాఫ్ట్ విభాగంలో తమ సృజనాత్మక ప్రతిభను చాటుకున్నారు. కార్డ్‌బోర్డ్‌తో పాటు వివిధ వస్తువులను ఉపయోగించి అయోధ్యలోని శ్రీరామ మందిరం నమూనాను అద్భుతంగా రూపొందించి ప్రదర్శించారు. విద్యార్థులు అక్షిత,కావ్య రూపొందించిన ఈ కళాకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి పలువురి ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి కుడిదల రామయ్య విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.ఉపాధ్యాయురాలు పబ్బ జ్యోతిలక్ష్మి, ఒకేషనల్ టీచర్ తిప్పారపు సౌజన్య పాల్గొన్నారు.

అధిక ధరకు బియ్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు

- ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:
అధిక ధరలకు బియ్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ప్రభు త్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుప కూడదని సూచించారు. ఈ నిబంధనలను పాటించకుండా ప్రజలపై ధరల భారం మోపే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు లోబడి బియ్యం విక్రయాలు జరిపేందుకు వీలుగా గజానన్ రైస్ మిల్ ఇండస్ట్రీ వారు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గాంధీ గంజ్ కమాన్ గోశాల రోడ్ కు ఆనుకుని ప్రజల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. బీ.పీ.టీ, హెచ్.ఎం.టీ తదితర రకాల బియ్యంను ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే మరికొంత తక్కువ ధరకే విక్రయాలు జరిపేలా ముందుకు రావడం పట్ల కలెక్టర్ గజానన్ ఇండస్ట్రీస్ యాజమాన్యాన్ని అభినందించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ మేరకు ప్రభుత్వం కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరుగుతున్నాయా లేదా అన్నది నిశిత పరిశీలన జరిపేందుకు వీలుగా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని సూచించారు. నిర్ణీత ధరల కంటే అధిక రేట్లకు విక్రయాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ వెల్లడించారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బీ.పీ.టీ స్టీమ్ రైస్ బ్యాగ్ ను రూ.1510 లకు, హెచ్.ఎం.టీ రకం బియ్యం బస్తా రూ. 2030 చొప్పున అవుట్ లెట్ ద్వారా విక్రయాలు జరుపుతామని గజానన్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు హితెన్ భిమాని తెలిపారు. ఆధార్



కార్డును పరిశీలిస్తూ ఒక కుటుంబానికి నెలకు 26 కిలోలతో కూడిన ఒక బియ్యం బస్తా మాత్రమే విక్రయించేలా ఏర్పాట్లు చేశామని, దీనివల్ల ఏకమొత్తంలో కొనుగోళ్లకు ఆస్కారం లేకుండా అందరికీ నిర్ణీత ధరకు బియ్యం అందాలనే సదుద్దేశ్యంతో ఆధార్ కార్డు విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమల్ కిషోర్, ప్రియాన్ భిమాని, రవీష్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు

జిల్లాలో ఎక్కడ కూడా వేసవిలో దాహార్తి సమస్య తలెత్తకుం డా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం పలు కీలక అంశాలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న వేసవి సీజన్లో ప్రతి నివాస ప్రాంతానికి ప్రజల అవసరాలకు సరిపడేలా రక్షిత మంచినీరు సరఫరా అయ్యే విధంగా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించా లన్నారు. తాగునీటి సరఫరా తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, ఎక్కడైనా దాహార్తి సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నట్లుగా గమనిస్తే, సంబంధిత ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని అం దించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలలో వ్యవసాయ బోరుబావులను అద్దెకు తీసుకునేందుకు వీలుగా గుర్తించాలని, మంచినీటి ట్యాంక్ లు, పైప్ లైన్ వంటి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలని ఆదేశించారు. ఇదిలాఉండగా, ఆయా పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల మెరుగుదల పనులు, భవిత కేంద్రాల నిర్మాణాలు తదితర వాటి పనులలో వేగం పెంచాలని కలెక్టర్ ఇంగినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు.

బాలిక పై లైంగిక దాడి కేసులో

నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

రూ.10వేల జరిమానా

ఖమ్మం టౌన్(జనంసాక్షి):బాలిక పై లైంగిక దాడి కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారా గార శిక్ష తో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఖమ్మం ఫాస్ట్ ట్రాక్ (ఫోక్సో) కోర్టు తీర్పు ఇచ్చింది మధిర పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్ 87/2025. కేసులో నిందితుడు గడ్డాల అరవింద్ ఏచిన్ని (35) మధిర పట్టణ నివాసి ఇతనిపై బీ ఎన్ ఎస్ 65(2)ఫోక్సో. చట్టం 2012లో నీ సెక్షన్ 5 తీ/లి. 6. కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు ఈ కేసులో నేరం రుజువు కావడంతో ఖమ్మం రెండో ఫాస్ట్ ట్రాక్ (ఫోక్సో) కోర్టు న్యాయమూర్తి డాక్టర్ పుల్లబట్ల.పొగడ కృష్ణ అర్జున్ నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష తో పాటు 10000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు ఈ కేసు దర్యాప్తు రూత్ రుత్వీక్ సాయి (ఐ పి ఎస్) ఎ సి పి రహమాన్ నిర్వహించగా ప్రస్తుత మధిర పట్టణ సి ఐ దోమల రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కోర్టు సమన్వయంతో.వ్యవహరించారు

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
3 నవంబర్ 2026

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ప్రజావాణి, సీఎం ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 109 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీదారులకు తీసుకున్న చర్యలపై సహేతుకమైన వివరణతో లిఖితపూర్వక సమాచారం అందించాలని, సంబంధిత వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఎల్ నినో నేపథ్యంలో 'జలసిరి' పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- ఆరు తడి పంటల సాగును ప్రోత్సహించాలి
- వీ-బీజీ-రాంజీ పనులు వేగవంతం చేయాలి
- పైపులై న్, వాటర్ ట్యాంక్ లీకేజీలు, నీటి వృథా అరికట్టాలి
- ప్రతి వ్యక్తి నీటిని పొదుపు చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 02 (జనంసాక్షి) : ఎల్‌నినో వర్షాభావ పరిస్థితు ల నేపథ్యంలో అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజలు నేటి సంరక్షణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఐడీఓసీ లో ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడారు.
ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తుందని మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటిస్తూ.. ప్రజల సాయంతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారంలో ఏ ప్రాంతాలకు వెళ్లారు.. చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖల అధికారులు గ్రామాల్లో తరచుగా పర్యటిస్తూ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన పంట మార్పిడి పద్ధతులను వివరించాలని, ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని వివరించారు.మండలంలో చేపట్టిన వీ బీజీ రాంజీ పనులు, నీటి సమస్యలు, ఇతర అభివృద్ధి పనుల పై అధికారులు తరచుగా సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. పనుల పురోగతి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించాలని ఆదేశించారు. గ్రామాల్లో మంజూరైన ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణాల దశలు , ఓహెచ్ఎస్ లీకేజీలు, తాగునీటి పైపులైన్ల పనులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

కరువు పునరావాస చర్యలపై దృష్టి సారించండి

తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కరువు పునరావాస చర్యలతో పాటు.. భూగర్భ జలాల స్థితి, పశుగ్రాసం కొరత, వీబీజీ రాంజీ పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, డీఆర్‌ఓ స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారికి పోలీసుల ఆపన్నహస్తం!

- తల్లి హత్య.. తండ్రి జైలుపాలు.. ఏడేళ్ల మహాన్యకు దిక్కుగా మారిన పోలీసులు
- చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగింత.. ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి చొరవకు ప్రశంసలు



కరీంనగర్, క్రైమ్, నవంబరు 2 (జనంసాక్షి): తల్లి హత్యకు గురై.. తండ్రి జైలుపాలు కావడంతో అనాథగా మిగిలిన ఏడేళ్ల చిన్నారి దావు మహాన్యకు కరీంనగర్ రూరల్ పోలీసులు అండగా నిలిచారు. చిన్నారి సంరక్షణ, భవిష్యత్తుపై మానవతా దృక్పథంతో స్పందించి భరోసా కల్పించారు. గత నెల 25న మగపిల్లవాడు పుట్టలేదనే కక్షతో భార్యను హత్య చేసిన కేసులో నిందితుడైన తండ్రి దావు చంద్రకుమార్ జైలుకు వెళ్లాడు. చిన్నారిని చూసుకోవాల్సిన తాత కూడా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆమె పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్‌రెడ్డి చిన్నారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులకు సమాచారం అందించారు. ఔట్రీచ్ వర్కర్ ఎన్. స్వరూప పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా, తాత సమక్షంలో చిన్నారిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సురక్షితంగా అప్పగించారు. ఆమె విద్య, సంరక్షణ, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ చర్య తీసుకున్నారు. చిన్నారికి వీడ్కోలు పలికే సమయంలో పోలీసు సిబ్బంది, స్థానికులు భావోద్వేగానికి గురయ్యారు. ఆపదలో ఉన్న చిన్నారికి అండగా నిలిచిన ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారులను స్థానికులు అభినందించారు.

రూ.100 కోట్ల ఖర్చుపై విచారణ జరిపించాలి

- బీజేపీ పాలకవర్గంపై అవినీతి ఆరోపణలు
- బండి సంజయ్ ప్రజలకు సమాధానం చెప్పాలి
- ఆడియో, వీడియో ఆధారాలు ఉన్నాయన్న హరిశంకర్
- మహాలక్ష్మి ఆలయంలో ప్రమాణానికి సిద్ధం.. సవాల్



కరీంనగర్ టౌన్, నవంబరు 2 (జనంసాక్షి): కరీంనగర్ నగరపాలక సంస్థలో బీజేపీ పాలకవర్గంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. నగరంలో సుమారు రూ.100 కోట్ల నిధుల ఖర్చు, కాంట్రాక్టుల కేటాయింపు, బిల్లుల చెల్లింపులు, భవన నిర్మాణ అనుమతులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సోమవారం మంకమ్మతోటలోని మీకోసం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎనిమిది నెలల 15 రోజులుగా నగరపాలక సంస్థలో జరుగుతున్న పరిణామాలు, పాలకవర్గ సభ్యులపై వస్తున్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయని పేర్కొన్నారు. రూ.100 కోట్ల వరకు నిధులు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. శంకుస్థాపనలకే పనులు పరిమితమవుతున్నాయని, నిధుల కేటాయింపులు, పనుల పురోగతి, బిల్లుల చెల్లింపులపై విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. అభివృద్ధి పనుల కేటాయింపుల్లో కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలపైనా విచారణ జరపాలని కోరారు. కాంట్రాక్టర్లను నేరుగా విచారిస్తే అక్రమాల వివరాలు బయటపడతాయని పేర్కొన్నారు. బీజేపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్లలో భవన నిర్మాణ అనుమతుల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. గత ఎనిమిది నెలల 15 రోజుల్లో జారీ చేసిన భవన నిర్మాణ అనుమతులపై పరిశీలన జరిపి, యజమానుల నుంచి వివరాలు సేకరించాలని సూచించారు. ఈ వ్యవహారాలకు సంబంధించి తమ వద్ద ఆడియో, వీడియో రికార్డులతో పాటు ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. వాటితో మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మీడియా సమక్షంలో ప్రమాణం చేసేందుకు సిద్ధమని, బండి సంజయ్ కూడా సిద్ధమా? అని సవాల్ విసిరారు. ఆరోపణలు నిరూపించలేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పి ముక్కు నేలకు రాస్తానని ప్రకటించారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత కార్పొరేటర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించారు. ఆధారాలు బయటపెట్టే వరకు వేచి చూడకుండా ముందుగానే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అనూప్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు ఆరె రవి, చేతి చంద్రశేఖర్, తొంటి రాజేందర్, రాజ్‌కుమార్, బండ శ్రీకాంత్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి గంగాధర చందు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే




రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 02 (జనంసాక్షి); ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 19 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదా రునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కామారెడ్డి కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 71 ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పరిష్కారానికి సంబంధించిన వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్వో పాండు, సీఈఓ చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తునికాకు కూలీలకు శఠగోపం..?

- 177 మంది ఖాతాల్లో రూ.2 వేల నుండి రూ.3 వేల వరకు కోత
- కల్లేదారుపై చర్యలు తీసుకోవాలని గోపాల్ పూర్ గ్రామస్తుల ఆవేదన
- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు



మంథని, నవంబర్ 02, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా మంథని మండలం గోపాల్ పూర్ గ్రామంలో తునికాకు సేకరణ కూలీలు తీవ్రంగా నష్టపోయారు. 2026 మే నెలలో జరిగిన తునికాకు సేకరణలో కూలీలకు రావాల్సిన పూర్తి డబ్బులు రాకపోవడంతో గ్రామంలో ఆందోళన నెలకొంది. మంథని మండలం గోపాల్ పూర్ గ్రామానికి చెందిన దాదాపు 177 మంది గిరిజన, పేద కూలీలు మే నెలలో ఎండను లెక్క చేయకుండా అడవిలో తునికాకు సేకరించారు. వారు కోసిన కట్టల లెక్క ప్రకారం ఒక్కొక్కరికి రూ. 8 వేల నుండి రూ. 10 వేల వరకు రావాలి. కానీ వారి బ్యాంక్ అకౌంట్లలో మాత్రం కేవలం రూ. 5 వేలు, రూ. 6 వేలు మాత్రమే జమ అయ్యాయి. ఒక్కొక్కరికి రూ. 2,000 నుండి రూ. 3,000 వరకు తక్కువ పడింది. దీనిపై కూలీలు సంబంధిత కల్లేదారును, ఆఫీసులో అడిగితే "ఆఫీసులో తప్పుగా కొట్టారు, సరి చేస్తాం" అంటూ దాటవేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సరిచేయలేదు.

కార్డులు కూడా లాక్కున్నారు :
ఇదే కాకుండా మా వద్ద ఎలాంటి ఆధారం లేకుండా కల్లేదారు మా తునికాకు కార్డులన్నీ తీసుకుని వెళ్లిపోయాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కార్డులు చేతిలో లేకపోవడంతో మేము ఎంత సేకరించామో చెప్పుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేము చేసిన కట్టలకు పూర్తి డబ్బులు మా అకౌంట్లో పడేలా చూడాలి. మా కార్డులు మాకు ఇప్పించాలి" అంటూ గోపాల్ పూర్ గ్రామ ప్రజలు మంథని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గారికి వినతి పత్రం అందజేశారు. 177 మంది కూలీల అకౌంట్లను వెంటనే సరిచేసి, తక్కువ పడిన రూ.2-3 వేలు తిరిగి జమ చేయాలి. కల్లేదారు తీసుకెళ్లిన తునికాకు కార్డులను తిరిగి కూలీలకు అప్పగించాలి. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. ఎండనక, వాననక కష్టపడి అడవి బిడ్డలు సేకరించిన తునికాకు డబ్బుల్లో కోత పడటం అన్యాయమని, అటవీ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్య, సంక్షేమం, క్రీడలకు కలెక్టర్ ప్రోత్సాహం

- ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ.. నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం
- ప్రజావాణి అర్జీల పరిష్కారానికి గడువు విధింపు
- తొమ్మిది జంటలకు కులాంతర వివాహ ప్రోత్సాహక బాండ్లు
- జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికైన వంశికకు క్రీడా సామగ్రి అందజేత



రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబరు 2 (జనంసాక్షి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వసతిగృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం కోనరావుపేట మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థుల సంఖ్యను తెలుసుకున్నా రు. మెనూ చార్ట్‌ను పరిశీలించడంతో పాటు వంటగది, గోదాంలోని బియ్యం, పప్పులు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. భోజనం, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులు వసతులను సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి 165 దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాల్లో ఆరు చొప్పున అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి నిర్వహించి వినతులు స్వీకరించారు. అన్ని కార్యాలయాల్లో అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.
మరోవైపు ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన కులాంతర వివాహ ప్రోత్సాహకాలను తొమ్మిది జంటలకు కలెక్టర్ అందజేశారు. ఒక్కో జంటకు రూ.2.50 లక్షల విలువైన ఫిక్స్‌డ్ బాండ్‌ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.
జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన గూడెపు వంశికను కలెక్టర్ అభినందించి క్రికెట్ కిట్, క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ నెల 12 నుంచి జమ్మూ కశ్మీర్‌లో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ క్రికెట్ టోర్నీలో ఆమె తెలంగాణ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. నిత్యం సాధన చేస్తూ ప్రతిభ చాటాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి, మత్స్యశాఖ అధికారి సౌజన్య, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రాందాసు, మాజీ సర్పంచి గాడ్పిచర్ల దేవయ్య, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చుక్క రామ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటించాలి

- ఎల్‌నినో నేపథ్యంలో 'జలసిరి' పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- ఆరు తడి పంటల సాగును ప్రోత్సహించాలి
- వీ-బీజీ-రాంజీ పనులు వేగవంతం చేయాలి
- పైపులైన్, వాటర్ ట్యాంక్ లీకేజీలు, నీటి వృథా అరికట్టాలి
- ప్రతి వ్యక్తి నీటిని పొదుపు చేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 02 (జనంసాక్షి) : ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజలు నేటి సంరక్షణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఐడీఓసీలో ప్రజావాణి అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో అధికారులు తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తుందని మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటిస్తూ.. ప్రజల సాయంతో నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారంలో ఏ ప్రాంతాలకు వెళ్లారు.. చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో నివేదిక రూపొందించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్ డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖల అధికారులు గ్రామాల్లో తరచుగా పర్యటిస్తూ, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన పంట మార్పిడి పద్ధతులను వివరించాలని, ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని వివరించారు. మండలంలో చేపట్టిన వీబీజీ రాంజీ పనులు, నీటి సమస్యలు, ఇతర అభివృద్ధి పనుల పై అధికారులు తరచుగా సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. పనుల పురోగతి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించాలని ఆదేశించారు. గ్రామాల్లో మంజూరైన ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణాల దశలు , ఓహెచ్ఎస్ లీకేజీలు, తాగునీటి పైపులైన్ల పనులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కరువు పునరావాస చర్యలతో పాటు.. భూగర్భ జలాల స్థితి, పశుగ్రాసం కొరత, వీబీజీ రాంజీ పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాసరెడ్డి, డీఆర్‌ఓ స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భావి డాక్టర్లకు తప్పని భవంతుల కష్టాలు

సొంత క్యాంపస్ లేక మహేశ్వరం వైద్య విద్యార్థుల ఆందోళన



- మౌఖిక హామీలు వద్దు.. లిఖితపూర్వక భరోసా కావాలి
- సాగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో, కళాశాల ఎదుట నిరసన ర్యాలీలు



రంగారెడ్డి, నవంబర్ 2 (జనంసాక్షి):
వైద్యులుగా సమాజానికి సేవ చేయాలన్న ఉన్నతాశయంతో ప్రభుత్వ వైద్య కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. కళాశాల ప్రారంభమై రెండేళ్లకు చేరువవుతున్నా సొంత క్యాంపస్ లేక, హాస్టళ్లు కరవై, కనీస మౌలిక వసతుల కోసం వీధిన పడాల్సిన దుస్థితి దాపురించింది. తమ సమస్యలను పరిష్కరించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి, ఎమ్మెల్యే, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేకి పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యం కావడంతో మహేశ్వరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు నిరసన బాట పట్టారు. సమ్మెలోకి దిగారు. నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

దశల వారీగా ఆందోళనలు..

ఇప్పటికే అక్టోబరు 12న ప్రిన్సిపాల్‌కు సమ్మె నోటీసు అందించి, తరగతులు, క్లినికల్ పోస్టింగులను విద్యార్థులు బహిష్కరించారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆందోళన తీవ్రతరం చేశారు. గత నెల 23, 24 తేదీల్లో సమ్మె నిర్వహించిన మెడికోలు తాత్కాలిక విరమణ పాటించారు. కానీ సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం కళాశాల ఎదుట భారీ నిరసన చేపట్టారు. కళాశాల నుంచి నాగార్జున సాగర్ జాతీయ రహదారి వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రతినిధి బృందం..

ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, అధ్యాపకులతో కలిసి విద్యార్థుల ప్రతినిధి బృందం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించింది. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ.. కొత్త భవనం పూర్తయ్యే వరకు టిమ్స్‌లో తాత్కాలిక వసతి కల్పించేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే శాశ్వత క్యాంపస్‌పై ప్రభుత్వంతో చర్చించి నెల రోజుల్లో స్పష్టత ఇస్తామని, ప్రతి 15 రోజులకు ఒకసారి పరిస్థితిని సమీక్షిస్తామని మౌఖికంగా తెలిపారు. అయితే, సమ్మె విరమిస్తేనే చర్యలు సాధ్యమని అధికారులు పేర్కొనడంతో 23,24 తేదీల్లో నిర్వహించిన సమ్మె విరమణ పాటించారు. ప్రభుత్వం నుంచి నిర్దిష్ట గడువులతో కూడిన లిఖితపూర్వక హామీ ఇచ్చే వరకు సమ్మె విరమించేది లేదని విద్యార్థులు రోడ్డెక్కారు.

మెడికోల ప్రధాన సమస్యలు..

మంగళ్‌పల్లిలోని బీఐఈటీ ఇంజినీరింగ్ ప్రాంగణంలో 2024 నవంబరులో తరగతులు ప్రారంభమయ్యాయి. 6 నెలల్లో టిమ్స్ ఎల్బీనగర్‌కు తరలిస్తామని 2024 బ్యాచ్‌కు, 2 నెలల్లో తరలిస్తామని 2025 బ్యాచ్‌కు హామీలిచ్చినా ఆచరణకు నోచుకోలేదు. ప్రస్తుతం 3 ఎంబీబీఎస్ బ్యాచ్‌లు ఉన్నా కనీస వసతులు లేవు.

ప్రైవేటు హాస్టళ్లు.. మోయలేని భారం..

శాశ్వత హాస్టళ్లు లేకపోవడంతో ప్రైవేటు పీజీ హాస్టల్స్‌లో ఉంటూ నెలకు రూ.7,500 నుండి రూ.10,000 వరకు అద్దెలు చెల్లిస్తున్నారు. సరైన సెక్యూరిటీ, వీధిదీపాలు లేకపోవడం ముఖ్యంగా విద్యార్థినుల భద్రతను ప్రశ్నార్థకంగా మార్చింది. అంతే కాకుండా తాత్కాలిక క్యాంప స్ నుంచి బోధనా ఆసుపత్రికి (మహేశ్వరం జీజీహెచ్ / వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి) ప్రతిరోజూ 40 కి.మీ ప్రయాణించాల్సి వస్తోంది. ప్రత్యేక బస్సు సౌకర్యం లేకపోవడంతో క్లినికల్ పోస్టింగులు, ఎన్ఎంసి ఫీల్డ్ విజిట్లకు తీవ్ర విఘాతం కలుగుతోంది.

మైదానం, లైబ్రరీపై ఆంక్షలు..

సాయంత్రం 4 గంటల తర్వాత బీఐఈటీ క్యాంపస్‌లో ఉండకూడదని యాజమాన్యం ఆంక్షలు విధిస్తుండటంతో లైబ్రరీ, గ్రౌండ్ సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. విద్యార్థులు, అధ్యాపకుల వాహనాలకు కూడా క్యాంపస్‌లోకి ప్రవేశం లేకపోవడం గమనార్హం.

జీఓలు ఉన్నా అమలు ఏది?

జీఓ ఎంఎస్ నం.190 (తేదీ: 23-12-2024) ప్రకారం టిమ్స్ ఎల్బీనగర్‌ను మహేశ్వరం మెడికల్ కాలేజీకి కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలోనూ మంత్రి ఈ విషయాన్ని ప్రకటించారు. జీఓలు, ప్రభుత్వ ప్రకటనలు ఉన్నప్పటికీ ఇప్పటికీ టిమ్స్‌లో స్థానం కల్పించకపోవడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కరించాలని వైద్య విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. దశల వారి ఆందోళన నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగానే సోమవారం కళాశాల ధర్నా నిర్వహించారు అనంతరం కళాశాల నుంచి రెండు కిలోమీటర్ల మేర ఉన్న నాగార్జునసాగర్ జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ రాస్తారోకో నిర్వహించి, క్యాంపస్లో టిమ్స్‌కు తరలించాలని నినాదాలు చేశారు. అప్పటివరకు తమ ఆందోళన కొనసాగుతుందని ప్రకటించారు.

బోరబండలో ఐదేళ్ల బాలుడి దారుణ హత్య

తల్లితో కలిసి ఉంటున్న వ్యక్తిపైనే అనుమానం.. పరారీలో నిందితుడు

హైదరాబాద్, జనం సాక్షి: బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సైట్-3, ఆజంనగర్‌లో ఐదేళ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బాలుడిని అతని తల్లితో కలిసి ఉంటున్న విద్యాసాగర్ నల్లవరపు హత్య చేసి ఉంటాడని తల్లి పవార్ దుర్గ అనుమానం వ్యక్తం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పవార్ దుర్గ తన కుమారుడు విజయ్‌తో కలిసి ఆజంనగర్‌లో నివాసం ఉంటోంది. ప్రిజం హాస్పిటాలిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఆమె నవంబర్ 2న ఉదయం సుమారు 6.30 గంటలకు విధుల నుంచి ఇంటికి తిరిగి వచ్చింది. అప్పటికే ఐదేళ్ల కుమారుడు విజయ్ మృతి చెంది ఉండటాన్ని గమనించింది. బాలుడి మెడ, కడుపుపై గోకిన గాయాల గుర్తులు ఉన్నట్లు గుర్తించింది. తనతో కలిసి ఉంటున్న విద్యాసాగర్ గతంలోనూ బాలుడిని తరచూ కొట్టేవాడని, అతడిపైనే అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ప్రశ్నించడంతో నిందితుడు ఇంటి నుంచి పరారైనట్లు పేర్కొంది. సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

బియ్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

నిర్ణయించిన ధరలకే విక్రయించాలి.. వ్యాపారులకు అదనపు కలెక్టర్ ఆదేశాలు

కరీంనగర్ టౌన్ , నవంబర్ 02 (జనంసాక్షి): కరీంనగర్ జిల్లాలో బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, అక్రమంగా నిల్వ చేయడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ (పౌరసరఫరాలు) హెచ్చరించారు. సోమవారం హోల్‌సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో బియ్యం లభ్యత, నిల్వలు, ధరలను సమీక్షించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు నిరంతరాయంగా బియ్యం సరఫరా జరిగేలా వ్యాపారులు తగినంత నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యం విక్రయించాలని స్పష్టం చేశారు. బీపీటీ/కేఎన్‌ఎం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రూ.79 ధరలకు విక్రయించాలని ఆదేశించారు. ప్రతి వ్యాపార ప్రాంగణంలో స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసి బియ్యం రకం, నిల్వల పరిమాణం, విక్రయ ధరలను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. కొనుగోలు, విక్రయాలు, నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మార్కెట్లో బియ్యం లభ్యత, ధరలను పౌరసరఫరాల శాఖ నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఆందోళన చెందకుండా అవసరానికి మించి బియ్యం కొనుగోలు చేయవద్దని కోరారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, రైస్ డిపో యజమానులు, వ్యాపారులు పాల్గొన్నారు.

నవాబుపేట బస్టాండ్‌లో 100 గ్రాముల గంజాయి స్వాధీనం

యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నవాబుపేట, నవంబరు 2 (జనంసాక్షి): మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గంజాయితో పట్టుబడిన యువకుడిని నవాబుపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి గంజాయి కలిగి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని అనుమానాస్పదంగా ఉన్న యువకుడిని తనిఖీ చేశారు. అతని వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్‌లో సుమారు 100 గ్రాముల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మహమ్మద్ ముస్తఫా (26), తండ్రి పాషా, గంగబౌలి, నటరాజ్‌నగర్, జీడిమెట్ల నివాసిగా గుర్తించారు. గంజాయితో పాటు అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

చారిత్రక వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

- సీతమ్మలోద్ది విశిష్టతను కాపాడాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష
- 10 వేల ఏళ్ల నాటి గ్రైండింగ్ పరికరం పురావస్తు మ్యూజియంలో భద్రం
- 560 మందితో హెరిటేజ్ ట్రెక్కింగ్ విజయవంతం
- ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు



పెద్దపల్లి, నవంబరు 2 (జనంసాక్షి): సీతమ్మలోద్ది చారిత్రక ప్రాంత విశిష్టత ను భావితరాలకు అందించడంతో పాటు వారసత్వ సంపద పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సీతమ్మలోద్ది ప్రాంతంలో నిర్వహించిన హెరిటేజ్ ట్రెక్కింగ్‌లో 560 మందికి పైగా ట్రెక్కర్లు, చిన్నారులు పాల్గొనడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అక్కడి గుహలో లభించిన సుమారు 10 వేల సంవత్సరాల నాటి ప్రాచీన గ్రైండింగ్ పరికరాన్ని సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లోని పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారు. ఈ సందర్భంగా డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాక ర్‌రెడ్డి ఆ పరికరం విశిష్టత, వినియోగం గురించి కలెక్టర్‌కు వివరించారు. ప్రాచీన మానవులు ధాన్యాలు, మొక్కల భాగాలు, వేర్లు, ఖనిజ వర్ణద్రవ్యాలను నూరి పొడి చేసేందుకు షాడిల్ క్వెర్న్ అనే ఈ పరికరాన్ని ఉపయోగించే వారని తెలిపారు. పెద్ద రాయిపై చిన్న రాయిని ముందుకు వెనుకకు రుద్దుతూ పదార్థాలను పొడిగా చేసుకునేవారని వివరించారు. గుహలో ఇటువంటి పరికరాలు లభించడం అప్పటి మానవుల జీవన విధానం, ఆహారపు అలవా ట్లు, సాంకేతిక పరిజ్ఞానానికి ఆధారాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. సీతమ్మలోద్ది చారిత్రక విశేషాలను పొందుపరుస్తూ హెరిటేజ్ టేబుల్ బుక్ రూపొందించిన బృందాన్ని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమం విజయవంతానికి కృషిచేసిన జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్‌రెడ్డి, పుస్తక రూపకల్పనలో భాగస్వామైన అనిల్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. చారిత్రక సంపద పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి హెరిటేజ్ ట్రెక్కింగ్ దోహదపడుతుందని అన్నారు.

ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ధర్మారం మండలం కొత్తూరుకు చెందిన జోగుల లచ్చయ్య సర్వే నంబరు 429లోని ఏడు గుంటల భూమికి పట్టాదారు హక్కులు కల్పించాలని కోరగా, ధర్మారం తహసీల్దార్‌కు పంపించి చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరాంపూర్ మండలం తారుపల్లికి చెందిన జాసోదపు లక్ష్మి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, పరిశీలన కోసం పీడీ హౌసింగ్‌కు పంపించారు. మంథని మండలం నాగారానికి చెందిన డిగ్రీ పూర్తి చేసిన దివ్యాంగుడు గాజుల ప్రశాంత్ ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరగా, వారధి సొసైటీకి సిఫారసు చేశారు. రామగుండం మండలం గోదావరిఖని 18 ఇంక్లైన్ కాలనీకి చెందిన గంట నరసమ్మ గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని దరఖాస్తు చేయగా, రామగుండం ఎంపీడీఓకు పంపించి పరిశీలించాలని ఆదేశించారు. ప్రజావాణిలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నోటీసులు జారీ చేశారు.. విచారణను మరిచారు?

- ప్రభుత్వ అసైన్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలపై చర్యలేవీ.?
- ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ముందుకు సాగని విచారణ
- అధికారుల తీరుపై ప్రశ్నలు సంధిస్తున్న గ్రామ యువకుడు మహిపాల్



ధారూర్,నవంబర్ 02(జనంసాక్షి) : నోటీసులు జారీ చేశారు. విచారణ మాత్రం మరిచారా.?అన్న ప్రశ్నలు ఇప్పుడు ధారూర్ మండలం దోర్నాల్ గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ అసైన్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు, నిర్మాణాల వ్యవహారంపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని గ్రామ యువకుడు ఎం.మహిపాల్ ప్రశ్నిస్తున్నారు.దోర్నాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 25లో ప్రభుత్వ అసైన్డ్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు వాటిపై నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సెప్టెంబర్ 21న ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు వెళ్లాయి. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి సెప్టెంబర్ 22న మెమో జారీ చేయడంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుంచి అక్టోబర్ 12న విచారణ నోటీసులు జారీ చేశారు.అక్టోబర్ 14వ తేదీ ఉదయం 11.30 గంటలకు దోర్నాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సమగ్ర విచారణ నిర్వహిస్తామని నోటీసుల్లో పేర్కొన్నా రు. ఫిర్యాదుదారులు తమ వద్ద ఉన్న ఆధారాలు, దస్తావేజులతో హాజరుకావాలని, సంబంధిత పంచాయతీ కార్యదర్శి కూడా రికార్డులతో అందుబాటులో ఉండాలని సూచించారు.

విచారణకు హాజరుకాకపోతే తదుపరి చర్యల కోసం జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పిస్తామని స్పష్టం చేశారు.అయితే నోటీసుల్లో పేర్కొన్న తేదీ దాటి రోజులు గడుస్తున్నా విచారణకు సంబంధించిన స్పష్టమైన సమాచారం బయటకు రాకపోవడంపై ఫిర్యాదుదారుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అసలు విచారణ జరిగిందా.? జరిగితే ఏం తేలింది.? ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు,నిర్మాణాలపై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారు.?విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపించారా.? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తాజాగా సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో గ్రామ యువ కుడు మహిపాల్ ఈ వ్యవహారంపై మరోసారి ఫిర్యాదు చేశారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని,కేవలం నోటీసులు జారీ చేసి కాలయాపన చేయకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మహిపాల్ కోరుతున్నారు. జిల్లా కలెక్టర్,జిల్లా పంచాయతీ అధికారులు ఈ వ్యవహారంపై స్పందించి విచారణ పురోగతిని వెల్లడించడంతో పాటు బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంలో మండల పంచాయతీ అధికారి వివరణ కోసం ఫోన్ చేయగా ఎంపీఓ స్పందించలేదు.



చేపల వలలో చిక్కుకుని మత్స్యకారుడి మృతి

మానేరు డ్యామ్‌లో ప్రమాదం.. వేటకు వెళ్లి విగతజీవిగా..

గన్నేరువరం, నవంబరు 2 (జనంసాక్షి): చేపల వేటకు వెళ్లిన వృద్ధ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన రంగనవేణి మల్లయ్య (75) సోమవారం సాయంత్రం చేపల వేట కోసం మానేరు డ్యామ్ వద్దకు వెళ్లాడు. వేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలికి చేపల వల చుట్టుకోవడంతో నీటిలో పడిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న గన్నేరువరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య లచ్చవ్వ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గాంధారి పాఠశాలలకు రూ.4.20 కోట్ల నిధులు

- 13 ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం
- నాబార్డు నిధులతో అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే మదన్‌మోహన్ చొరవతో మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గాంధారి, నవంబర్ 2 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు మెరుగైన బోధనా వాతావరణం అందించడమే లక్ష్యంగా గాంధారి మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలలకు నాబార్డు నిధుల ద్వారా రూ.4.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ ప్రత్యేక చొరవతో తరగతి గదుల నిర్మాణానికి ఈ నిధులు కేటాయించారు. పాఠశాలల వారీగా ఎంపీపీఎస్ సోమారం తండా, బుర్గుల్, జెడ్పీహెచ్ఎస్ గౌరారం కలాన్, ఎంపీపీఎస్ వెంకటాపూర్, గండివేట్, ఎంపీయూపీఎస్ మాధవపల్లి, జువ్వాడి, వండ్రికల్, ఎంపీపీఎస్ ఎస్సీ వాడ గాంధారిలో ఒక్కో అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.13.55 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఎంపీపీఎస్ మేడిపల్లికి రెండు గదులకు రూ.27.10 లక్షలు, రాంపూర్ గడ్డకు మూడు గదులకు రూ.40.65 లక్షలు కేటాయించారు. పీఎంఎస్‌హెచ్ఆర్ఐ జెడ్పీహెచ్ఎస్ గాంధారికి 12 తరగతి గదుల నిర్మాణానికి రూ.1.62 కోట్లు, మరో ఐదు గదుల నిర్మాణానికి రూ.67.75 లక్షలు మంజూరయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలలోనే విద్యనభ్యసించిన తనకు ప్రభుత్వ విద్యా వ్యవస్థ అవసరాలు తెలుసని ఎమ్మెల్యే మదన్‌మోహన్ పేర్కొన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణంతో విద్యార్థులకు సరిపడా వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఇది కేవలం గదుల నిర్మాణం మాత్రమే కాదని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కళాకారుల ఐక్యత, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ


- సిరిసిల్లలో ఘనంగా ఆవిర్భావ వేడుకలు
- పెన్షన్, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్
- ప్రత్యేక ఫోక్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

సిరిసిల్ల టౌన్, నవంబర్ 2 (జనంసాక్షి): తెలుగు ఫోక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలను సిరిసిల్లలో రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాక రమణకర్, ప్రధాన కార్యదర్శి ఎండీ సత్తార్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను సోమవారం పరిశీలించిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కవులు, కళాకారులు, గాయకులు, టెక్నీషియన్లు, కెమెరామెన్లు, సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్ట్ ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. సాయంత్రం సిరిసిల్ల పాత బస్టాండ్ నుంచి కళాకారుల ర్యాలీ ప్రారంభమై ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటుందని వెల్లడించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న కళాకారులకు వరుస క్రమంలో పాటలు పాడే అవకాశం కల్పిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను జానపద కళాకారులకూ వర్తింపజేయాలని కోరారు. కళా కారుల కోసం ప్రత్యేక ఫోక్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలంగా కళారంగానికి సేవలందిస్తున్న సీనియర్ కళాకారులకు నెలవారీ పెన్షన్, ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుపేద కళాకారులకు పక్కా ఇళ్లు, వడ్డీలేని రుణాలు, సీనియర్ కళాకారుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని కోరారు. కళాకారులు, వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రత్యేక సంక్షేమ పథకాలు రూపొందించాలన్నారు.

తెలంగాణ కళాకారులు ఆటపాటల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకొస్తూ ప్రజా కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నా వారి సంక్షేమం, కుటుంబాల భద్రతకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యవర్గం ముందస్తు ఆమోదం, తీర్మానం మేరకే ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని కళాకారులంతా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గౌరవ సలహాదారు దరువు అంజన్న, కోశాధికారి గజ్వేల్ వేణు, రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సభ్యులు జడల రమేష్, ప్రచార కార్యదర్శి ఆకునూరి దేవయ్య, కాపర్తి మల్లికార్జున్, మంకాల ప్రసాద్, పాత శ్రీధర్, చికోడు నరసింహులు, ఫోక్ ఇండస్ట్రీ సభ్యులు ఎడమల శ్రీధర్‌రెడ్డి, నవీన్, చిత్రం మల్లేశం, శ్రీధర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి సమయపాలన పాటించని అధికారులు

- ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేనా!



నవాబుపేట్ నవంబర్ 2 (జనం సాక్షి): మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రభుత్వం ప్రజల సమస్యలు తీర్చడానికి ఏర్పాటు చేసిన ప్రజావాణి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహించి సమావేశానికి వివిధ శాఖల అధికారులు మేము అధికారులం మా ఇష్టం ఎప్పుడైనా వస్తాము అంటూ ఉదయం 10 గంటలకు రావాల్సిన 11 గంటల వరకు వస్తున్నారు. మునుముందుగా ఎంపీడీవో కార్యాలయంలో సూపరిడెంట్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రమేష్ ఏ టైంలో వస్తారో ఎప్పుడు వెళ్తారు అంతు పట్టని వైన్యంగా జరుగుతున్న సంఘటన. సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్న సందర్భంగా వెటర్నరీ సురేందర్, ఆర్ అండ్ బి ఏ ఈ , మండల హౌసింగ్ ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ, ఇరిగేషన్ ఏఈ, మిషన్ భగీరథ ఏఈ సమయపాలనం పాటించకుండా నామమాత్రంగా ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారు అంతుపట్టని వైన్యం మమ్ముల ఎవరు అడుగుతారు అంటూ సమావేశానికి వస్తున్న మా లేదంటూ నామమాత్రంగా పనులు చేస్తున్న అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులే సమయపాలన పాటించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజావాణికి అధికారులు నిర్ణీత సమయానికి హాజరుకాకపోవడంతో ఫిర్యాదుదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి పలువురు అధికారులు ఆలస్యంగా చేరుకున్నారు. ఉదయం 10 గంటలకు రావాల్సిన ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వర్లు 10.29 గంటలకు, మిషన్ భగీరథ ఏఈ విపుల్ తివారి 10.45 గంటలకు, ఆర్అండ్‌బీ ఏఈ సుస్మిత 10.58 గంటలకు హాజరయ్యారు. మండల విద్యాధికారి అబ్దుల్ రహమాన్ గైర్హాజరు కాగా, ఆయనకు బదులుగా కంప్యూటర్ ఆపరేటర్ ప్రభాకర్ 10.58 గంటలకు వచ్చారు. ఇక హౌసింగ్ ఏఈ సందని ఏకంగా ఉదయం 11.27 గంటలకు కార్యక్రమానికి చేరుకోవ డం గమనార్హం.తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఉదయాన్నే కార్యాలయానికి చేరుకున్న ప్రజలు సంబంధిత అధికారుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. నిర్ణీత సమయానికి అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదుల స్వీకరణ, సమస్యలపై చర్చ ఆలస్యమవుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం ప్రజావాణి ప్రధాన ఉద్దేశం. అలాంటి కార్యక్రమానికే అధికారులు సమయానికి హాజరుకాకపోతే ప్రజలకు సకాలంలో సేవలు ఎలా అందుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల సమయానికి విలువ ఇవ్వాల్సిన అధికారులే ఆలస్యంగా రావడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రజల సమస్యలు వినాల్సిన వేదికలోనే నిరీక్షణ తప్పడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.ఉన్నతాధికారులు స్పందించి ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ కార్యాలయంలో కరెంటు కష్టాలు

- పదేపదే విద్యుత్ కోతలతో ఉద్యోగుల అవస్థలు..
- పలు ప్రభుత్వ సేవలకు అంతరాయం
- పవర్ బ్యాకప్ సదుపాయాలు లేక విధులకు ఆటంకం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఉద్యోగుల విజ్ఞప్తి




వికారాబాద్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో తరచూ విద్యుత్ కోతలు ఉద్యోగులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఒక రోజులోనే పదుల సంఖ్యలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో కార్యాలయాల్లో సాధారణ కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోంది.ముఖ్యంగా కంప్యూటర్లు, ఆన్‌లైన్ సేవలు, డేటా ఎంట్రీ, ప్రభుత్వ రికార్డుల నిర్వహణ వంటి పనులు విద్యుత్‌పై ఆధారపడి ఉండటంతో కరెంటు సరఫరా నిలిచిన ప్రతిసారీ ఉద్యోగులు పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రజలు వివిధ ప్రభుత్వ పనుల నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చినప్పుడు కూడా సేవలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది.సోమవారం కలెక్టరేట్‌లో పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. రోజూ ఇదే పరిస్థితి ఎదురవుతోందని, విద్యుత్ కోతల కారణంగా కార్యాలయ సమయం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని కార్యాలయాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నప్పటికీ, మిగిలిన శాఖల్లో తగిన పవర్ బ్యాకప్ సదుపాయాలు లేకపోవడం సమస్యగా మారిందని ఉద్యోగులు చెబుతున్నారు. జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అవసరమైన చోట జనరేటర్లు, ఇన్వర్టర్లు, యూపీఎస్ వంటి ప్రత్యామ్నాయ పవర్ బ్యాకప్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. విద్యుత్ కోతలకు గల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజలకు అందించే ప్రభుత్వ సేవలకు అంతరాయం కలగకుండా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని స్కూటరిస్ట్ మృతి

చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన మధుసూదన్
ప్రమాదానికి కారణమైన వాహనం కోసం పోలీసుల గాలింపు

శామీర్‌పేట్, అక్టోబర్ 2 (జనంసాక్షి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో స్కూటీపై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన తుముకుంట మధుసూదన్ (45) అంథాయిపల్లిలో పని ముగించుకుని యాక్టివా (టీఎస్ 07 ఈఆర్ 7958)పై ఇంటికి తిరిగి వెళ్తుండగా, తూముకుంటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ దాటిన తర్వాత గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు, ఛాతీకి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో అల్వాల్‌లోని లోటస్ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం ఈఎస్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మధుసూదన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి మేనల్లుడు మద్దికుంట ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలని పోలీసులు సూచించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సాయం అందించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



- ఎరుకల కులస్తుల ఆవేదన
- మా బతుకులు ఎక్కడ సాగాలి
- పంచాయతీ కార్యదర్శి వేధింపులు భరించలేకున్నాం
- ప్రజావాణిలో ఎంపీడీవోకు ఎరుకల మొర
- నోటీసులిచ్చి షెడ్లు కులగొడుతామని బెదిరింపులు

ఊరికి దూరంగా బతకొద్దా

రంగారెడ్డి, నవంబర్ 2 (జనంసాక్షి):

‘‘ఊరికి దూరంగా, డంపింగ్ యార్డు పక్కన షెడ్లు వేసుకుని బతుకుతున్నా మమ్మల్ని ప్రశాంతంగా జీవించనివ్వడం లేదు. తరతరాలుగా నమ్ముకున్న పందుల పెంపకం వృత్తినే మా నుంచి దూరం చేయాలని చూస్తున్నారు. మేం ఎక్కడకు వెళ్లి బతకాలి? మాపై ఈ వివక్ష ఎందుకు?’’అని రాయపోల్ గ్రామానికి చెందిన ఎరుకల సామాజిక వర్గీయులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి వేధింపులు తాళలేకపోతున్నామంటూ బాధితులు ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

రూ. 2 లక్షల పెట్టుబడి నాశనం చేసే కుట్ర..

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామ సరిహద్దుల్లో, జనావాసాలకు కిలోమీటర్ దూరంలో ఉన్న డంపింగ్ యార్డు సమీపంలో రూ. 2 లక్షలు అప్పులు చేసి పందుల పెంపకం కోసం షెడ్లను నిర్మించుకున్నారు. అయితే, పందుల పెంపకం వల్ల గ్రామానికి నష్టమంటూ పంచాయతీ కార్యదర్శి లలిత తమకు హుకుం జారీ చేశారని వారు ఆరోపించారు. కాగా, ఇదే స్థలాన్ని గతంలో పంచాయతీ పాలకవర్గం, రెవెన్యూ అధికారులు కలిసి చూపించారని గుర్తు చేశారు. నాటి నుంచి అక్కడే తమ పందులను పంచుకుంటున్నామని తెలిపారు. తమకు సంబంధించిన ఒక్క పందిని కూడా బయటకు వదలడం లేదన్నారు. కానీ ఊర్లో తిరిగే వాటి యజమానులను తమను పంచాయతీ కార్యదర్శి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లక్షల రూపాయిల వ్యయంతో నిర్మించుకున్న షెడ్లను సైతం బలవంతంగా కూలగొడతామని బెదిరిస్తున్నారని ప్రజావాణిలో ఆవేదన వ్యక్తం చేశారు.

జీవనాధారాన్ని దెబ్బతీయవద్దు..

తమ కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలపై ఈ రకమైన వేధింపులు తగవని బాధితులు వేడుకున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమ షెడ్లకు రక్షణ కల్పించాలని, స్వేచ్ఛగా జీవించేందుకు సహకరించాలని విన్నవించారు.

బాధితుల వినతిపై స్పందించిన ఎంపీడీవో ప్రమీల నాయక్ ఈ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
03 నవంబర్ 2026

పాలమూరులో మళ్లీ పాత కరువు రోజులు

కాంగ్రెస్ నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోతున్నాయి

□ మాజీ మంత్రి హరీశ్‌రావు



వనపర్తి బ్యూరో, నవంబర్ 2 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, సాగునీటి నిర్వహణలో వైఫల్యం కారణంగా పాలమూరు జిల్లాలో పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. పెద్దమందడి మండలం అల్వాల గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతన్నల రణభేరీ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 'ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం వల్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ మోటార్లు సక్రమంగా నడపకపోవడంతో రైతుల పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. నీళ్లు, కరెంటు, పంటలకు సెలవు ప్రకటిస్తున్న రేవంత్‌రెడ్డికే ప్రజలు 'టాటా.. బాయ్ బాయ్' చెప్పే రోజులు దగ్గరపడ్డాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాలో కృష్ణా జలాలు అందుబాటులో ఉన్నప్పటికీ రైతుల పొలాలకు నీరు అందడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం వల్ల పంటలు ఎండిపోతున్నాయని, కొండ్యా అనే రైతు మూడు ఎకరాల్లో సాగు చేసిన పంట మొత్తం ఎండిపో యిందని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మోటార్లను పూర్తి స్థాయిలో నడపకుండా తొమ్మిది గంటలకే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు నాలుగు ప్రధాన డిమాండ్లు చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఐదు మోటార్లను 24 గంటలపాటు నడిపి చెరువులను నింపాలని, పాలమూరు-రంగారెడ్డి పథకంలో అడ్డుగా ఉన్న మట్టిని తొలగించి రిజర్వాయర్లలో నీటిని నింపాలని కోరారు. జూరాల నుంచి మరో 15 రోజులపాటు నీటిని విడుదల చేసి చేతికొచ్చే దశలో ఉన్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు రైతుల సమస్యలపై స్పందించడం లేదని విమర్శించారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలే లక్ష్యం

మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఏర్పాటు

□ అడ్డంకులను తొలగించేందుకు వుయ్ హబ్ ద్వారా కృషి

□ మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 2 (జనంసాక్షి) : మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి, వారి వ్యాపారాలకు పెట్టుబడులు, మార్కెట్ అవకాశాలు, విధానపరమైన సహకారం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (డబ్ల్యూఈఈసీ)ను ఏర్పాటు చేసింది. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 నేపథ్యంలో ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి తొలి సమావేశం సచివాలయంలో సోమవారం నాడు జరిగింది. మంత్రి సీతక్క అధ్యక్షతన, వుయ్ హబ్ సీఈఓ సీత పల్లచోళ్ల కన్వీనర్‌గా పనిచేసే ఈ కౌన్సిల్‌లో విధాన నిర్ణేతలు, మహిళా పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు భాగస్వాములవుతారు.

మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణలో పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ, స్వయం సహాయక సంఘాల నెట్‌వర్క్‌ల ద్వారా మహిళలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మహిళలకు పెట్టుబడులు, మార్కెట్లు, అనుకూలమైన ప్రభుత్వ విధానాలు అందుబాటులో ఉండాలన్నారు. మహిళా పారిశ్రామికతను సంక్షేమ కోణంలో మాత్రమే చూడకూడదని, రాష్ట్ర ఆర్థిక బలాన్ని పెంచే కీలక రంగంగా గుర్తించాలని పేర్కొన్నారు. మహిళా వ్యాపారవేత్తలకు ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేందుకు ప్రభుత్వం వుయ్ హబ్ ద్వారా కృషి చేస్తుందని తెలిపారు. పాలసీ, సంస్థాగత నాయకత్వం, పట్టణ ఆవిష్కర ణలు, పారిశ్రామికీకరణ, సమ్మిళిత వ్యాపారాలు, పెట్టుబడులు, కార్పొరేట్ భాగస్వామ్యాలు అనే నాలుగు కీలక రంగాలపై కౌన్సిల్ దృష్టి సారిస్తుంది. వుయ్ హబ్ సీఈఓ సీత పల్లచోళ్ల మాట్లాడుతూ, మహిళా వ్యాపారవేత్తలకు ఆశయాలు, సామర్థ్యాల కొరత లేదని, పెట్టుబడులు, వినియోగ దారులు, మార్కెట్లు, వ్యాపార నెట్‌వర్క్‌లకు చేరువ కావడంలోనే ప్రధాన అడ్డంకులు ఉన్నాయని తెలిపారు. ఈ కౌన్సిల్ ద్వారా ఆ సమస్యలకు ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను గుర్తించి, ప్రభుత్వ విధానాల ద్వారా అమలు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కౌన్సిల్ సిఫారసులతో మహిళా పారిశ్రామిక రంగంపై ప్రత్యేక శ్వేతపత్రాన్ని గ్లోబల్ సమ్మిట్‌లో విడుదల చేయనున్నారు. వుయ్ హబ్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ సంబంధిత శాఖల సమన్వయంతో సిఫారసుల అమలుకు తోడ్పడనుంది.

నేడు నిర్మల్‌లో మహాపాదయాత్రకు సర్వం సిద్ధం

కేంద్రమంత్రుల రాక



నిర్మల్, నవంబర్ 02 (జనంసాక్షి) : బీజేపీ ఆధ్వర్యంలో నేడు నిర్మల్ పట్టణంలో నిర్వహించనున్న 'లోక్‌తంత్ర బచావో - అరాచకత హటావో' మహా పాద యాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్త యాయి. మహా పాదయాత్ర నేపథ్యంలో నిర్మల్ పట్టణం కాషాయ జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలతో కాషాయమయంగా మారింది. నగరమంతా బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు హాజరు కానుండటంతో కార్యక్ర మంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ సంస్థల గౌరవం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రజలకు పిలుపునిస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ మహా పాదయాత్రకు ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, బీజేపీ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నిర్మల్ గడ్డపై కాషాయ జెండా రెపరెపలాడేలా.. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పోలీసు సిబ్బందికి పదోన్నతి శిక్షణ షురూ

1,435 మంది పోలీసులకు పదోన్నతి శిక్షణ ప్రారంభం

□ మూడు శిక్షణ కళాశాలల్లో తరగతులు ప్రారంభం



హైదరాబాద్, నవంబరు 2 (జనంసాక్షి) : రాష్ట్ర పోలీసు శాఖలో 1,435 మంది సిబ్బందికి పదోన్నతికి ముందస్తు శిక్షణ సోమవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని మూడు పోలీసు శిక్షణ కళాశాలల్లో (పీటీసీ) సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగాలకు చెందిన సిబ్బందికి ఈ శిక్షణ ఇస్తున్నారు. వీరిలో 899 మంది సివిల్ విభాగం, 536 మంది ఏఆర్ విభాగానికి చెందినవారు. సివిల్ విభాగంలో.. మేడ్చల్ పీటీసీలో 586 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కోసం శిక్షణ ప్రారంభించారు. కరీంనగర్ పీటీసీలో 313 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి శిక్షణ ఇస్తున్నారు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో.. వరంగల్ పీటీసీలో 302 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా, 176 మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ఎస్సైలుగా పదోన్నతి శిక్షణ ప్రారంభమైంది. కరీంనగర్ పీటీసీలో మరో 58 మంది ఏఆర్ఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి శిక్షణ ఇస్తున్నారు. మేడ్చల్ పీటీసీలో జరిగిన కార్యక్రమానికి సాంకేతిక సేవలు, శిక్షణ విభాగం అదనపు డిజిపి డాక్టర్ ఆకున్ సబర్వాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత పాల్గొన్నారు. ఉన్నత హోదాల్లో బాధ్యతలు చేపట్టనున్న సిబ్బందికి వృత్తిపరమైన పరిజ్ఞానం, విధి నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఈ శిక్షణ లక్ష్యమని అధికారులు తెలిపారు.



దుబ్బగూడెంలో మద్య నిషేధ తీర్మానం

గంగారం, నవంబర్ 2 (జనం సాక్షి) : మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం దుబ్బగూడెం గ్రామంలో మద్యంపై ఉక్కుపాదం మోపారు. గ్రామ మహిళల సమక్షంలో జరిగిన ప్రత్యేక గ్రామసభలో మద్యం విక్రయాలు, మద్యం సేవించడాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు.గ్రామంలో మద్యం కారణంగా కుటుంబాల్లో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని మహిళలు సభలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గ్రామాన్ని మద్య రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని మహిళల కోరిక మేరకు గ్రామస్తులంతా ఏకగ్రీవంగా ఈ నిర్ణయానికి మద్దతు తెలిపారు. ఇకపై గ్రామ పరిధిలో ఎవరైనా మద్యం విక్రయించినా, మద్యం సేవించి గొడవలకు దిగినా జరిమానా విధించడంతో పాటు గ్రామ పెద్దల సమక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని తీర్మానించారు.

అక్రమ నీటి దందాపై చర్యలు తీసుకోండి

□ రహదారుల ఆక్రమణలను నియంత్రించండి

□ హైడ్రా ప్రజావాణికి 39 ఫిర్యాదులు



హైదరాబాద్, నవంబర్ 02 (జనంసాక్షి) : చెరువుల చెంత బోర్లు వేసి అక్రమంగా నీటి దందా చేస్తున్నారని.. వెంటనే హైడ్రా రంగంలోకి దిగి వాటిని నియంత్రించాలని పలువురు హైడ్రా ప్రజావాణిలో కోరారు. 600ల నుంచి వెయ్యి అడుగుల మేర భూగర్భంలో నీటిని తోడేసి.. పక్కనే ఉన్న కాలనీల్లో నివసిస్తున్న తమకు నీరు అందకుండా చేస్తున్నారని పలువురు వాపోయారు. ఒకప్పుడు పంట పొలాలతో సమృద్ధిగా జలాలుండేవని, అక్రమ బోర్లతో నీరు సామాన్యులకు అందనంత అడుగంటాయని పేర్కొన్నారు. వాటర్ ట్యాంకర్లు రాత్రి పగలూ తేడా లేకుండా ప్రమాదకరంగా నడుపుతున్నారని వాపోయారు. నానక్‌రాంగూడ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ తదితర ప్రాంతాలలో నీటిని అమ్ముకుని తమకు నీరు లేకుండా చేస్తున్నారని గోపన్నపల్లి జర్నలిస్టు కాలనీతో పాటు.. పలు కాలనీవాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గోపన్నపల్లిలో పదుల సంఖ్యలో వాటర్ ట్యాంకర్ల దందా కొనసాగుతోందని.. వాపోయారు. ఇలా హైడ్రా ప్రజావాణికి మొత్తం 39 ఫిర్యాదులు రాగా వాటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ డి. ఆనంద్‌కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.



లక్ష మందికి ఉచితంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌లో శిక్షణ

అమెజాన్ వెబ్ సర్వీసెస్ సహకారంతో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహణ

□ నాన్ స్టెమ్ కోర్సుల విద్యార్థులకూ ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్

□ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రభుత్వంపై గానీ, కళాశాలలు లేదా విద్యార్థులపై గానీ ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 'తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్(ఏడబ్ల్యూఎస్) సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఇందుకు సంబంధించిన ఒప్పందం సోమవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాస్క్, ఏడబ్ల్యూఎస్ మధ్య జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లోని విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ తదితర ఇండస్ట్రీ ఓరియెంటెడ్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ప్రత్యక్షంగా ప్రాక్టికల్స్ చేసేందుకు ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ తదితర నాన్ స్టెమ్ కోర్సుల విద్యార్థులకు కూడా ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్స్ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కోర్సులో చేరిన ప్రతి విద్యార్థికి 'ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్' ద్వారా 900 కంటే ఎక్కువ డిజిటల్ కోర్సులను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. గ్లోబల్ సర్టిఫికేషన్ పరీక్షల కోసం డిస్కౌంట్ వోచర్లను కూడా అందిస్తామన్నారు. విద్యార్థులకు సాంకేతిక నిపుణులతో ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు, హ్యాకథాన్లను నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అర్హులైన విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాలు ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. ఆయా కళాశాల్లోని అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ సాంకేతికతలో ప్రపంచస్థాయి శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, టాస్క్ సీఈవో నితిన్ రెడ్డి , ఏడబ్ల్యూఎస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ సందీప్ దత్తా, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ హెడ్ అభినవ్, కంట్రీ మేనేజర్(స్కిల్లింగ్ ఇండియా) ప్రతిభా, ఏడబ్ల్యూఎస్ అకాడమీ టీపీఎం ఆకాంక్ష రాయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అడవి బిడ్డల ఆవేదన

ఇందిరమ్మ ఇండ్ల కోసం కలెక్టర్ ను కలిసిన ఆదివాసీలు





కెరమెరి, నవంబర్ 2(జనంసాక్షి) : స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా ఇప్పటికీ అడవి బిడ్డల బతుకులు గుడిసెల్లోనే మగ్గుతున్నాయి. కెరమెరి మండలంలోని మారుమూల గ్రామం బోరిలాల్ గూడ గ్రామపంచాయతీ పరిధిలోని కోలాంగూడ లో ఆదిమ గిరిజనుల దీనగాథ ఇది. కోలాంగూడకు చెందిన ఆదిమ తెగ పివిటిజి కొలాం జాతికి చెందిన సుమారు 10 కుటుంబాలు తరతరాలుగా అటవీ ప్రాంతంలోనే నివసిస్తున్నాయి. వారికి ఇప్పటి వరకు ప్రభుత్వం నుండి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. వర్షం వస్తే కారే గుడిసెలు, ఎండకు మాడే రేకుల షెడ్లలోనే వారి జీవనం సాగుతోంది. ఈ దయనీయ పరిస్థితిపై ఆవేదనతో వారు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి తరలివచ్చారు. బోరిలాల్ గూడ గ్రామ సర్పంచ్ చవాన్ శంకర్ ఆధ్వర్యంలో కోలాంగూడకు చెందిన గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కు తమ గోడును వినిపించారు. తమ గూడలో అత్యంత నిరుపేద కుటుంబాలు ఉన్నాయని, తమకు ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో తమకు ప్రాధాన్యత ఇచ్చి ఇండ్లు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. సర్పంచ్ చవాన్ శంకర్ మాట్లాడుతూ "మా గ్రామపంచాయతీ పరిధిలోని కోలాంగూడ ఆదివాసీలు చాలా వెనుకబడి ఉన్నారు. వారికి సొంత ఇల్లు లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందడం లేదు. జిల్లా కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించి, తక్షణమే విచారణ జరిపి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి" అని కోరారు.

జిల్లా కలెక్టర్ వినతి పత్రాన్ని స్వీకరించి, సంబంధిత ఎంపీడీవో, హౌసింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి, అర్హుల జాబితాలో వారి పేర్లను చేర్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో, అత్యంత వెనుకబడిన పివిటీజీ తెగకు చెందిన ఈ ఆదివాసీ కుటుంబాలకు ఇండ్లు మంజూరు అవుతాయా? లేక వారి ఆశలు అడవిలోనే కలిసిపోతాయా? అనేది వేచి చూడాలి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370